ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 452

వెల : రూ.25/-

నవంబర్ 2022




## అక్టోబర్ విప్లవానికి జేజేలు!!

జనసాహితి ప్రచురణ

కవిత

# ఎవరి పిల్లలోయ్ మీరు!

- అనిసెట్టి సుబ్బారావు

బ్రిడ్జికింద, స్టేషన్లో, ధూళిమీద
ఎటు చూచిన మీ రూపులు!
ఎటువిన్నా మీ అరుపులు!
పార్కుచెట్లు, కాల్వగట్లు
అరుగులు, మరుగులు అన్నీ
ఆక్రమించి తిరుగుతున్న;
ఎవరిపిల్లలోయి మీరు!

మురికివొళ్ళు, చింకికళ్ళు
మీ రూపులు!
కడుపాక బాదంఆకై,
మీ చూపులు
తోపుల్లో తుమ్మముళ్ళు!

దిక్కులేని తల్లులు
దిగవిడిచారా?
మీరు గర్భాల్లోకెక్కినపుడె
వేవోళ్ళ శపించుకుంటు
శత్రుబాధలా తొమ్మిది
నెలలుమోసి,
గుట్టల్లో గుబురుల్లో
ప్రసవించి పడవేసి
తమదేమీ పోనట్లు నటించి
తరలి వెళ్ళారా?
దాగని గర్భశోకముప్పొంగి
ఆగని మాతృప్రేమకే లొంగి
తల్లడిల్లుతువెళ్ళారా?
వాళ్ళ గర్భశోకం
ఈ లోకానికి తగులుతుంది!

మీ కేకలు వినబడవు!
విశ్వం శోధిస్తూ పైతారలు
లెక్కిస్తున్నారు!
జీవన్మరణ సమస్యలు చింతిస్తూ
బోధిస్తున్నారు!
మేధస్సముద్రంలో వేటాడి
కవిత వ్రాస్తున్నారు!
గుళ్ళు, గోపురాల్, పశువులశాలలు
నిర్మిస్తున్నారు!

ఎవరిపిల్లలోయి మీరు!

ఉన్నవాళ్ళ హుంకారంతో
ఉలిక్కిపడుతుంది ఎండ!



మీరంటే ఎండగూడ మండిస్తుంది
ఉన్నవాళ్ళ ఉడుపాకటే,
స్పృశించలేదీ వర్షం!
వానగూడ మీరంటే
వరదలు పారిస్తుంది!
విశాల ప్రకృతి పూర్ణ హృదయం
కావులించుకుని
పవళిస్తున్నా, రేడుస్తున్నా
రెవరు మీరు?

చలిపొంటిని మెలిపెడితే,
ఎండకాళ్ళి వేధిస్తే
భూమాతతో మొరపెడుతూ
వెక్కి... వెక్కి, ఏడ్చే
ఓ దిక్కులేని తమ్ములార!
నా ప్రాణమిత్రులార!
ఈ లోకపు శాపనాలు
ఎంగిలాకులిస్తాయి,
ఇనుపకమ్ములిస్తాయి,
న్యాయమూర్తి గ్రంథాల్లో
నల్లని అక్షరపంక్తులు
మీ మెడలకు ఉరిపువ్వులు!

ఎవరి సంతతోయి మీరు!
ప్రస్తుత సమాజ దేహాపు
నుదుటిరేఖలా మీరు?
భవిష్యత్తు మారించే
వెలుగు పోచలా మీరు?
దివ్యకాంతి మూర్తులైన
ఏండిమియాన్లెంతమంది!
సంఘపు కుంపటి వెల్గించే
సైంట్‌జోన్ లెంతమంది!
జీవశాంతి రసార్ద్రులా
జీసస్‌లెందరో మీలో!

దిక్కులేని తమ్ములార!
మిమ్ముచూస్తే
రాతిగుండె జాలువారి ద్రవిస్తుంది,
కరుణతో ప్రవహిస్తుంది!
జాలిగుండె కర్కశమై నిలుస్తుంది,
జగతినెదుర్కొంటుంది!

('అగ్నివీణ' కవితాసంకలనం నుండి)

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

452

సంపుటి : 46

సంచిక : 4

నవంబర్ 2022

## ఈ సంచికలో...

website : www.prajaasaahithi.com


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | అక్టోబర్ విప్లవానికి జేజేలు! చిత్రం – అంతర్జాలం నుండి | | .....01 |
| ✦ రెండవ అట్ట | : | ఎవరి పిల్లలోయి మీరు! (కవిత) | – అనిసెట్టి సుబ్బారావు | .....02 |
| ✦ మూడవ అట్ట | : | కా॥ మదార్‌కు జోహార్లు; కాలం కుట్రల నడుమ (కవిత) | –ఎస్. శంకరరావు | .....35 |
| ✦ నాల్గవ అట్ట | : | చిత్రం – ఆర్.కె. లక్ష్మణ్ | | .....36 |
| ✦ సంపాదకీయం | : | సంక్షుభిత భారతం | | .....05 |
| ✦ కథ | : | టెన్నిస్ బాల్ | – ఎ. మన్మధరావు | .....07 |
| ✦ వ్యాసాలు | : | జాతికి వెన్నుదన్నుగా నిలవాల్సిన స్థితి నుండి..... | – ఓ.వీ.వీ.యస్. రామకృష్ణ | .....11 |
| | : | రుద్రయాగం | – రా.రా. | .....24 |
| ✦ సినిమా సమీక్ష | : | 'రామ్ సేతు' | – బాలాజీ (కోల్‌కతా) | .....30 |
| ✦ స్పందన | : | 75 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా..... | – జి.వి. భద్రం | .....20 |
| ✦ ధారావాహికలు | : | వ్యాసం – దేశ విభజన వస్తువుగా సాహిత్యం (3) అమృతా ప్రీతమ్ నవల 'పింజార్' | – కొత్తపల్లి రవిబాబు | .....15 |
| | : | దీర్ఘకవిత – రంగు వెలసిన చిత్రం (3) | – శీలా సుభద్రాదేవి | .....22 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | కామ్రేడ్ చిత్త ప్రసాద్ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....23 |
| ✦ పుస్తక పరిచయం | : | 'కృష్ణాజిల్లా జమీందారులు – రైతాంగ పోరాటాలు' | – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | .....17 |
| ✦ వివిధ | : | ఆర్.కె. లక్ష్మణ్ శతజయంతి ముగింపు, కొలకలూరి స్వరూపరాణి మృతి (**04**); డి.ఏ.వి. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి (**06**); అనిసెట్టి సుబ్బారావు శతజయంతి, అనామధేయుడు మరణం (**10**); చైతన్యవాహిని (**32**); ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**33**); యం.కె. సుగమ్‌బాబు మృతి (**33**); ఈ పుస్తకాలు అందాయి (**34**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.

ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ఫ్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, దగ్గస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – 532001

ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

### రాజకీయ వ్యంగ్య చిత్రకారుడు
# ఆర్.కె. లక్ష్మణ్ శతజయంతి ముగింపు సందర్భంగా

**ఆర్.కె.** లక్ష్మణ్‌గా చిరపరిచితుడైన రాశీపురం కృష్ణస్వామి లక్ష్మణ్, నవలా రచయిత ఆర్.కె. నారాయణ్‌కు సోదరుడే! ఆయన మైసూరులో 24-10-1921లో జన్మించారు. 2015 జనవరి 26న తన 93వ యేట పూనేలో మరణించారు. ఆయన శతజయంతి గత నెల అక్టోబరుతో ముగిసింది.

ఆర్.కె. లక్ష్మణ్ బొంబాయిలోని జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో చేరడానికి దరఖాస్తు పెట్టుకుంటే, 'మా సంస్థలో విద్యార్థిగా చేరడానికి తగిన ప్రతిభ నీలో లేదు' అని తిరస్కరించారు. కాని ఆయన చనిపోయిన ఒక సంవత్సరం తర్వాత అంటే 2016లో ఆ ఆర్ట్సు స్కూలులో ఆయన జ్ఞాపకచిహ్నమొకటి ఏర్పరిచారు. మైసూరు విశ్వవిద్యాలయంలో బి.ఏ. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి లక్ష్మణ్ చిత్రకళా నైపుణ్యాన్ని స్వయంకృషితో సాధించారు. ప్రపంచ ప్రసిద్ధ బ్రిటీష్ చిత్రకారుడు సర్ డేవిడ్ లో (Sir David Low) తనకు స్ఫూర్తినిచ్చారని చెప్పారు. మొదట్లో Lowను Cow అని ఆయన చదివేవారట!

1940లో 'బ్లిట్జ్' పత్రికలోనూ 'ఫ్రీ ప్రెస్ జర్నల్'లో 1946లోనూ చేరారు. ఆ తర్వాత 1951లో 'ది టైమ్స్ ఆఫ్ ఇండియా'లో చేరి "యూసెడ్ ఇట్" (అది నీవే చెప్పావు) అనే శీర్షికలో ఒక సామాన్య వ్యక్తిని (Common Man) సృష్టించి 50 ఏళ్ళపాటు కార్టూన్లు రోజుకొకటి చొప్పున వేశారు. ఆ సామాన్యవ్యక్తి ప్రతి కార్టూన్లో కనబడతాడు. 50 ఏళ్ళ భారతదేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ చరిత్ర ఈ కార్టూన్లలో మనకు కనబడుతుంది.

కుమారి కమల అనే భరతనాట్య కళాకారిణిని వివాహమాడి 1960లో విడిపోయారు. రెండో వివాహం తన మేనగోడలుతో జరిగింది. ఆమె పేరు కూడా కమలే! వీరికి ఒక కుమారుడు.

వేలాది కార్టూన్లే కాక, లక్ష్మణ్ మూడు నవలలు, కథలు, వ్యాసాలు, యాత్రా రచనలు, స్వీయచరిత్ర రాశారు. 'ది టనల్ ఆఫ్ టైమ్' అనేది ఆయన స్వీయచరిత్ర.

ఆయన 1985 నుండీ ప్రొఫెసర్‌గా చేసిన పూనాలోని సింబియోసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మీడియా అండ్ కమ్యూనికేషన్ సంస్థ వారి విశ్వభవన్ ఎదురుగా 8 అడుగులు ఎత్తు వున్న 'కామన్ మాన్' కంచు విగ్రహాన్ని నెలకొల్పడమనేది ప్రపంచ కార్టూనిస్టుల చరిత్రలోనే విశిష్టమైన సంఘటన.

# కొలకలూరి స్వరూపరాణి మృతి

**తొలి** తెలుగు గజల్ కవయిత్రి కొలకలూరి స్వరూపరాణి తన 80వ యేట 15-10-2022న ఒంగోలులో మరణించారు. ఆమె 1-5-1943లో గోవాడలో జన్మించారు.

ఆమె తండ్రి నడకుదిటి వెంకటరత్నం కవి. ఆమె తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ ఉపాధ్యాయినిగా పనిచేస్తూ సాహిత్య కృషి చేశారు. ఆమె రాసిన 'చంద్రగ్రహణం' పద్యకావ్యం తొలి స్త్రీవాద కావ్యంగా విమర్శకులు గుర్తించారు. 'రైతు' పదానికి స్త్రీలింగ పదంగా 'రైతాలు' అనే పదాన్ని ఆమె సృష్టించారు. 12 రంగాల నాటకం 'ప్రణయకుంతి' రచించారు. 'నన్నయ మహిళ'పై వ్యాస సంపుటి ప్రచురించారు. ఇంకా పలు రచనలు చేశారు.

## సంపాదకీయం

# సంక్షుభిత భారతం

"....**సంక్షోభం** చివరి అంచున / ఒక భయానక దృశ్యమేదో / ప్రాణవాయువు మీద / కార్బైడ్ విషవాయువులా కమ్ముకుంది / డాలర్ సంక్షోభం బద్దలై / ఏ పరిణామ సిద్ధాంతానికీ అంతుపట్టని / దిష్టిబొమ్మ ఒకటి హఠాత్తుగా ఊడిపడి / మనిషి భవిష్యత్ మీద / ఊరేగుతోంది!!....."

**(విద్యాసాగర్ – దీర్ఘకావ్యం 'దిష్టిబొమ్మ' నుండి)**

ఈ స్థితి, ఈ సంక్షోభం మరింతగా విస్తరించి, సమాజంలోని అన్ని మూలాలకూ, జీవితాలలోని అన్ని అంచులకూ చేరుతోంది. అమెరికాతో సహా అన్ని దేశాలూ ఆర్థికమాంద్యాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ మాంద్యాన్ని ఎదుర్కోవటానికి డబ్బు సరఫరాను పరిమితం చేయటంతో పెట్టుబడులు తగ్గిపోయి వృద్ధి మందగించింది. మందగించిన వృద్ధి వల్ల తలసరి ఆదాయం తగ్గిపోతుంది. ప్రజల ఉపాధీ, కొనుగోలు శక్తి తగ్గిపోయి పేదరికం తాండవిస్తూంది. ఈ పర్యవసానాలవల్లే ఉన్నత సామాజిక విలువలను కోల్పోయి సాంస్కృతికంగా కూడా పతనదిశలోకి ప్రపంచం పయనిస్తూంది. విచ్ఛిన్నమవుతున్న వ్యక్తిత్వాల పలు రూపాలను, వాటి ప్రతిఫలనాలను నేడు అనుభవిస్తున్నాం. ప్రపంచంలోని అన్ని దేశాల సమాజాలలో వాటి ఆర్థిక, రాజకీయ నిర్ణయాలు, విధానాలు ప్రజల మనోభావాలను, ఆలోచనలను, భవిష్యత్తును నిర్దేశిస్తాయన్న చలన శీలమైన, శాస్త్రీయమైన, తార్కికమైన అవగాహన నేడు నిరూపితమవుతూంది.

మూడు దశాబ్దాల క్రితం ప్రపంచీకరణకు బీజం వేసిన ఏక ధృవ ప్రపంచపు పెత్తందారుగుంపుల నిర్ణయం, పతనదిశగా సాగుతున్న పెట్టుబడిదారీవ్యవస్థను పీకలలోతు కూరుకుపోయేట్లు చేసింది. ద్రవ్యోల్బణం మూలంగా ప్రజల వద్ద ఉన్న పొదుపు మొత్తం ఖర్చయిపోతుండటంతో వస్తువుల కొనుగోలు చేసే స్తోమత ప్రజలకు తగ్గిపోయింది. ఉత్పత్తులూ పడిపోతాయి. ఉత్పత్తులు లేనప్పుడు ఉద్యోగాల అవసరమూ వుండదు. ఆయా వ్యాపారాలు చేసే కంపెనీలను మూసివేయవలసి వస్తుంది. 2008లో వచ్చిన ఆర్థికమాంద్యం వల్ల వందల ఏళ్ళ చరిత్ర గలిగిన కంపెనీలను మూసివేయటం వెనుక ఉన్న కారణాలివే.

2019 కోవిడ్ కాలంలో ఈ ఆర్థిక సంక్షోభం మరింత లోతుకు దిగబడింది. ఇటువంటి సంక్షోభ పరిస్థితులను గతం నుండి చూస్తూనే వున్నాం. 1929–39 మధ్య కాలంలో తలెత్తిన మహా ఆర్థికమాంద్యం పెట్టుబడిదారీ ప్రపంచాన్ని అల్లకల్లోలం చేసింది. ఆ హంగ్రీ థర్టీస్ దశకంలోనే సోషలిస్టు ఆర్థికవ్యవస్థను ఏర్పరచుకున్న సోవియట్ యూనియన్‌లో మాత్రం ఆ ఆర్థికమాంద్యం ప్రభావమే లేదు. 2023 ఆర్థికంగా మరింత గడ్డు కాలమని హెచ్చరిస్తున్న ఆర్థిక శాస్త్రవేత్తలుగానీ, మీడియాగానీ – ఈ సంక్షోభాలకు పెట్టుబడిదారీ ఆర్థికవిధాన స్వభావమే కారణమని దీనికి సోషలిస్టు ఆర్థికవిధానమే పరిష్కారమని ఋజువు చేసిన సోవియట్ రష్యా అనుభవాలను ప్రపంచ ప్రజల దృష్టికి తీసుకురావటంలేదు.

నాటినుండి నేటివరకూ పెట్టుబడిదారీ వ్యవస్థ పోషకులైన అగ్రదేశాలు తమ సంక్షోభాలను వివిధ రూపాలతో ప్రపంచ, స్థానిక యుద్ధాల రూపంలోనూ రకరకాల Trickle Down చికిత్సలతోనూ అధిగమించాలని తీవ్రంగా విఫల ప్రయత్నాలతో పోటీపడుతున్నారు. పైగా ఆయుధాల అమ్మకాలతో ఆర్థికవ్యవస్థను చక్కబెట్టుకోవాలని ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలను రెచ్చగొడుతున్నారు.

ప్రపంచబ్యాంకు నెలక్రితం విడుదల చేసిన 2022 నివేదిక ప్రకారం, కోవిడ్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏడు కోట్లమంది ప్రజలు కొత్తగా పేదరికంలోకి జారిపోతే, అందులో ఐదుకోట్ల అరవై లక్షలమంది (80%) ఒక్క భారతదేశంలో వున్నారు. అత్యధిక నిరుపేదల నిలయంగా మారిన మనదేశంలో ఆజాదీకా అమృత మహోత్సవాలను బ్రహ్మాండంగా జరిపిస్తూ పాలకులు సంబరాలు చేశారు. అంబరాన్ని చుంబించే అంబానీ సౌధాలను, తారాజువ్వలా దూసుకువెళుతూన్న ఆదాని ఆస్తులను చూపిస్తూ, మరో మూడేళ్ళలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవించబోతోందని మన పాలకవర్గాలు మభ్యపెడుతున్నారు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటును 2% పెంచిన ఫలితంగా డాలర్ విలువ 22% పెరిగి రూపాయి విలువ పాతాళానికి పడిపోతే అది రూపాయి పతనం కాదనీ, డాలర్ బలపడుతోందనే విదూషకత్వాన్ని మన పాలకులు ప్రదర్శిస్తున్నారు.

లాభాలను చేకూరుస్తున్న అన్ని రంగాలలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు కార్పొరేటు వర్గాలకు తాకట్టు పెడుతున్నారు, తెగనమ్ముతున్నారు. దేశాన్ని కాపాడే మిలటరీ రంగంతోసహా అన్నిరంగాల సంస్థలలోనూ ఒప్పంద ఉద్యోగాలను కల్పిస్తున్నారు. ఇక విద్యా, వైద్యం ప్రజల ప్రాథమిక హక్కు అన్నది రాజ్యాంగం పుటల్లో వెతుక్కోవల్సిన అంశంగా మారిపోయింది. నష్టాలొస్తున్న ప్రభుత్వ సంస్థలన్నిటినీ ప్రజలకు అంకితం చేసి – వాటి నష్టాల భారాన్ని ప్రజలపై మోపుతున్నారు.

నిత్యావసర వస్తువులైన ఉప్పులు, పప్పులు, నూనెలు, కూరగాయలు, గ్యాస్‌బండ అన్నింటి ధరలనూ విపరీతంగా పెంచేశారు. మందులు, వైద్యం ఖర్చులు జీవితాలను తాకట్టుపెట్టేస్తున్నాయి. నిరుద్యోగం ఎన్నడూ లేనంతగా 7.5 శాతానికి చేరబోతుంది. ప్రజల దైనందిన జీవన అవసరాలపట్ల, వారి ఉద్యోగ భద్రతపట్ల బాధ్యతలేని పాలకులు చెత్తపైనా, పెన్సిల్లపైనా, రబ్బర్లపైనా, స్మశానవాటికల్లోనూ, మనం బ్రతికివున్నా, చచ్చినా పన్నులు కట్టవలసిందేనంటూ ప్రజల మూలుగులను పీల్చివేస్తున్నారు. ప్రజల చేత, ప్రజల కొరకు ఎన్నుకోబడిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుండి గృహిణుల వరకూ, రైతాంగం, కార్మికులు,

విద్యార్థులు లోన్ యాప్‌లకు, మైక్రో ఫైనాన్స్ వంటి ప్రైవేటు సంస్థల ఉరితాళ్ళకు వేలాడుతున్నారు. ఈ సంక్షోభ కాలపు పగ్గాలను చేపట్టవలసిన యువతరాన్ని విషసంస్కృతి వలలో బంధించారు. సినిమాలు, టి.వి.లు, ఇంటర్నెట్, ఫోన్‌లు ద్వారా ముఖ్యంగా యువతపై విషసంస్కృతి భావజాలపు పంజాను విసురుతున్నారు. పితృస్వామ్య పురుషాహంకారానికి, ఈ విషసంస్కృతి తోడై పసిపిల్లలతో సహా ఆడవారిపై అత్యాచారాలను చేస్తుంటే, ఆ నేరస్థులపై వాటిని సమర్థించేవారిపైనా పాలకులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారు. కొందరు ఈ విషసంస్కృతికి బానిసలై నేరస్థ స్వభావాన్ని సంతరించుకుంటూ దురలవాట్లతో హింసా ప్రవృత్తితో విచ్చలవిడితనంతో పేట్రేగిపోతుంటే, మరికొందరు ఆత్మన్యూనతా భావంతో ఒంటరివారిగా కుమిలిపోతూ జీవితాల నుండి పారిపోవాలను కుంటున్నారు. ఆత్మహత్యలే పరిష్కారంగా భావిస్తున్నారు.

సామ్రాజ్యవాదుల కనుసన్నలలో నేటి పాలకులు పరిపాలన కొనసాగిస్తూ ప్రజల శ్రమశక్తిని, దేశ సంపదలను, సహజవనరులను వారికి దోచిపెడ్తున్నారు. దేశభక్తి లేని మన పాలకులు – తమ దళారీ స్వభావానికి ఆ, ఆ పరిస్థితులకు తగినట్లుగా ముసుగులు తొడుగుతున్నారు. ఆ ముసుగులు యుద్ధం కావచ్చు, మతం కావచ్చు, దేవుడు కావచ్చు, భాష కావచ్చు మరింకేదైనా కావచ్చు. ఆదివాసీలను అడవుల నుండి వెళ్ళగొట్టి, అటవీ సంపదలను కొల్లగొట్టటానికి చట్టం తెచ్చిన పాలకులే ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్మును భారతదేశ ప్రథమ పౌరురాలిగా ప్రకటించటం కూడా ఒక ముసుగే.

ఇక మతం పేరుతో జరిగే విధ్వంసం గురించి చెప్పనవసరంలేదు. బ్రిటిష్‌వారు 75 ఏళ్ళక్రితం మతం పేరుతో ఉపఖండపు ప్రజలను విడగొట్టారు. వారి వారసులుగా నేటి పాలకులు ప్రజలను మతపరంగా మాత్రమే గుర్తించేంతగా మార్చారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బిజెపి అనుకూల నిషాద్ పార్టీ మంత్రి సంజయ్ నిషాద్ హిందీ మాట్లాడనివారు ఈ దేశం వదలి వెళ్ళిపోవచ్చని ఈ మధ్యే ప్రకటించారు. ఈ తరహా ప్రకటనలు రాజ్యాంగ నిర్మాయక సభలోనే (1949) వెలువడ్డాయని గుర్తు తెచ్చుకుంటే, హిందీ – హిందూ – హిందుస్థాన్ అనే నినాదం వెనుక కొనసాగుతున్న ఆధిపత్య ధోరణి స్పష్టమవుతుంది. దక్షిణాది రాష్ట్రాలపై హిందీని అధికార భాషగా బలవంతంగా రుద్దే ప్రయత్నాలూ సాగుతూనే వున్నాయి. ఈ రెచ్చగొట్టే ప్రకటనతో హిందీయేతరులు తమ రాజ్యాన్ని తాము విడగొట్టుకునే భావాలకు ఊతమిస్తున్నారు. "దేశభక్తి హద్దులు మీరితే, దేశ హద్దులను పణం పెట్టినట్లు" అని తెలియచెప్పాల్సిందే.

నేటి సంక్షుభిత భారతంలో ప్రశ్నించటమేగాదు ఆలోచించటానికి మెదడు వుండటమూ నేరమైపోయింది. చట్టాలూ, న్యాయమూ పాలకవర్గ ప్రయోజనాలకై నిర్దేశించబడి సత్యాన్ని, సత్యం మాట్లాడేవారిని నిర్బంధి స్తున్నారు. సామాజిక సాంస్కృతిక విచ్ఛిన్నాన్ని తీవ్రతరం చేస్తూన్న ఆర్థిక, రాజకీయ మూలాలను కాపాడుతూ పాలకులు కుమ్మరిస్తున్న మోసపూరిత అసత్యాలను తిప్పికొట్టాలి. సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలను సంఘటితం చేయటానికి రచయితలూ, కళాకారులూ, మేథావులూ సమష్టిగా కృషిచేయాలి.

మాట్లాడండి!
"మీ పెదవులు స్వేచ్ఛగానే ఉన్నాయిగా!
మీ నాలుక మీ స్వాధీనంలోనే ఉందిగా!!
మీ దేహం ఇంకా నిటారు గానే ఉందిగా!!
మీ ప్రాణం ఇప్పటికీ మీలోనే
కొట్టుకుంటూ ఉందిగా!
అయితే మాట్లాడండి!
ఎలుగెత్తి మాట్లాడండి!"
– ఫైజ్ అహ్మద్ ఫైజ్

**28-10-2022**

# DAV స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్,** బంజారాహిల్స్‌లోని డిఎవి పబ్లిక్ స్కూల్లో సమాజం మొత్తం తలదించుకునేలా నాలుగు సంవత్సరాల పాపపై రెండు నెలలపాటు లైంగిక దాడికి పాల్పడిన స్కూలు ప్రిన్సిపల్ కారు డ్రైవరును, సహకరించిన నేరస్తులందరినీ కఠినంగా శిక్షించాలి.

అన్ని విద్యాసంస్థల్లో ఆడపిల్లల భద్రత, రక్షణ కోసం చర్యలు చేపట్టాలి.

అన్ని ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్ళలో పేరంట్స్ కమిటీలు ఏర్పడి తమ హక్కులకోసం పోరాడాలి.

పిల్లల తల్లిదండ్రులతో అవమానకరంగా వ్యవహరించే స్కూళ్ళపై కఠినచర్యలు తీసుకోవాలి.

ఘటనలు వెలుగు చూసినపుడు కంటితుడుపు మాటలు కాకుండా అడుగడుగునా పసిపిల్లలపై, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను, హత్యలను అరికట్టడానికి ప్రభుత్వాలు నిర్దిష్టమైన చర్యల్ని చేపట్టాలి.

గతంలో జరిగిన అనేక ఘటనలలో డబ్బు, అధికార పలుకుబడి ఉన్న నేరస్థులకు ఎలాంటి శిక్షలు పడకుండా రక్షిస్తున్న చట్ట, న్యాయ వ్యవస్థల పనితీరును ప్రజలంతా నిరసించాలి.

అత్యాచారాలు, హత్యలు చేసిన హంతకులను జైలు నుండి విడుదల చేసి సన్మానాలు చేసి ఊరేగించే ప్రభుత్వాలను, పార్టీలను తిప్పికొట్టాలి.

మహిళలపై లైంగిక దాడులను, హింసను ప్రేరేపిస్తున్న సినిమాలు, టివిలు, ఇంటర్నెట్ ద్వారా వ్యాప్తి చేస్తున్న విష సంస్కృతిని అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేద్దాం.

మద్యం, మత్తు పదార్థాలు, పోర్న్ సైట్స్ ను నిషేధించాలని ఉద్యమిద్దాం.

**20-10-2022**

**స్త్రీ విముక్తి సంఘటన**
**జనసాహితి**

కథ

# టెన్నిస్ బాల్ కథ

- ఎ. మన్మధరావు

**శంకర్రావుగారింట్లో** ఉన్న ఆరేళ్ల అతని పాపకీ, ఇరవయ్యారేళ్ల వాళ్ల ఆవిడకీ మధ్య ఉన్న సంబంధం కాశ్మీర్ సమస్యంత సున్నితమైనది. వాళ్లు ఎప్పుడు మిఠాయిలు పంచుకుంటారో, ఎందుకు పటాసులు పేల్చు కుంటారో బొత్తిగా అంతుపట్టడం లేదతనికి. అందుకే!... వాళ్ల వ్యవహారాలలో వేలు పెట్టాలంటే ఆయనకు చాలా భయం, ఎటుపోయి ఎటు వస్తుందోనని. ఆ భయంతోనే చాలా వరకూ వాళ్ల గొడవలకి దూరంగానే ఉంటాడతను. కానీ ఒక్కొక్కసారి పరిస్థితులు అదుపుతప్పి, అతను జోక్యం చేసుకోక తప్పని పరిస్థితిని కల్పిస్తాయి. అలాంటి సందర్భాలలో అంతా అయిపోయిన తర్వాత, "అనవసరంగా మధ్యలో నేనెందుకు కలుగజేసుకున్నానా?..." అని బాధపడడం తప్ప, ఇంకేమీ మిగలడం లేదతనికి. ఈ సారి కూడా అదే జరిగింది.

శంకర్రావు రోజూలాగానే, ఆ రోజు కూడా ఆఫీసుకి బయలుదేరడానికి రెడీ అవుతున్నాడు. అప్పటికే తల్లీ, కూతుళ్ల మధ్య గొడవ స్టార్టైయి ఉంది. "అలాగైతే, నేను స్కూలుకి ఎల్లనంతె ఎల్లను..." అంటూ ఆ ఆరేళ్ల పాప, బ్లాక్ మెయిల్ చేస్తోంది వాళ్లమ్మని. బదులుగా "ఎలగెల్లవో, నీనూ సూస్తాను. పది నిమషాల్లో రెడీ కాకపోతే, ఈపు ఇమానం మోతైపోద్ది ఏటనుకుంతనవో ఏటో...." గట్టిగానే హెచ్చరిస్తోంది వాళ్లమ్మ.

బాత్రూం నుండి బయటకొచ్చిన శంకర్రావు ఇంట్లోకి అడుగుపెడుతూ, డోర్ మేట్ మీద కాలేసి, కాళ్లకున్న తడిని తుడుచు కుంటున్నాడు. అతన్నలా చూసీ, చూడడంతోటే ఆ ఆరేళ్ల పాప పరిగెత్తుకుంటూ వెళ్లి, అతని కాళ్లని గట్టిగా చుట్టేసి, బోరున ఏడవడం మొదలు పెట్టింది. పాప తలని చేతితో నిమిరి, "ఏటైందీ?..." అని అడిగాడతను.

"దానికి బాలు కావాలట. బాలు... మగబోడిలాగ ఆడుకొని కూకుంతది.... స్కూలుకి టైమైపోతందీ.... బయల్దేరే, అంతే, ఎల్లనని మొండికేసి, ఎలగ అరస్తందో సూస్తనవా?...." అంటూ కంప్లంట్ చేసింది వాళ్లమ్మ. పాప తలని పైకెత్తి "నిజమా?!..." అన్నట్టుగా సైగచేస్తూ అడిగాడు శంకర్రావు. అతనలా అడగేసరికి, పాప కళ్లు తెగిన ఆనకట్టలయ్యాయి. కళ్లనుండి ప్రవాహంలా నీరు. అతని కాళ్లని ఇంకా గట్టిగా చుట్టేసి, ఎక్కి ఎక్కి ఏడ్వడం మొదలుపెట్టింది పాప.

పాపని భుజానికెత్తుకొన్న శంకర్రావు పాపని ఓదారుస్తూ, "లేదులేమ్మా!.... ఆపూ...." అంటూ ముద్దు పెట్టి బుజ్జగించాడు. అతని భుజం మీద పాపనలా చూసేసరికి, వాళ్లమ్మకి కోపం తన్నుకొచ్చింది. "దీనికీ మద్దిన బాగా అలవాటైపోయింది. ఊ అంతే ఏడ్డము... ఆ అంతే ఏడ్డమూ.... లెగిసింది మొదలు మళ్లీ తొంగున్నంత వరకూ ఇదే పనైపోతంది. తొక్క తీసేస్తను ఏటనుకుంతన్డో... ఏటో...." అంటూ మరోసారి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. దాంతో పాప గుక్కపెట్టి మరింత బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టింది.

పాపని ఓదార్చడానికి "సర్లే!... బాలు కావాలి నీకు. అంతేకదా!... ఇస్తాను పద." అంటూ నేల మీద పడి ఉన్న ప్లాస్టిక్ బాలుని తీసి ఆమె చేతికి అందించాడు శంకర్రావు. పాప అంతా మర్చిపోయి, తన రెండు మండలతో, రెండు కళ్లూ తుడుచుకొని, తలెత్తి బంతివైపు చూసింది. శంకర్రావుచేతిలో ఉన్న ఆ పచ్చ రంగు బంతిని చూసి చూడ్డంతోటే మళ్లీ ఆమెకు దుఃఖం పొంగుకొచ్చింది. "ఈ బాలు నాకొద్దు..." అన్నట్టుగా అడ్డంగా తలూపి, మళ్లీ ఏడవడం మొదలుపెట్టింది. ఆది చూసిన వాళ్లమ్మకి మళ్లీ బీ.పీ పెరిగిపోయింది.

"దానికా బాలొద్దట.. మరి ఇంతసేపూ ఆ ఏడుపు ఏనికనుకుంతనవు? దానికా టెన్నిస్ బాలే కావాలట, దాని బుర్రమీదెట్టి తగలెట్టుకోడానికి...." అంటూ పళ్లు బిగబట్టి పాప వైపు కోపంగా చూసింది.

పాప అల్లరి చూసి శంకర్రావుకి చిరాకు రావాల్సింది పోయి, నవ్వొచ్చింది. కానీ, ఆయన నవ్వలే. ఒకవేళ నవ్వితే, వాళ్లావిడ, అప్పటి వరకూ పాప మీద చూపించిన ఆ కోపాన్ని, ఎక్కడ తన మీద చూపిస్తుందేమోనన్న భయం ఆయనది. అందుకే ఆయన ఆ నవ్వుని, పెదాల చాటునే దాచుకొని, పాపతో "ఆ టెన్నిస్ బాలేనికమ్మా!.. నీకు?.. ఆ బాలుతో ఆడుకో డానికి ఇంకా నీకు టైముందిలేగానీ, ఇంద.... ఇప్పుడికీ బాలు తీసుకో...." అంటూ మళ్లీ ఆ ప్లాస్టిక్ బాలునే అందించాడు పాప చేతికి.

ఈసారి ఏకంగా నేలపై దొర్లుతూ, విపరీతంగా కేకలేస్తూ, బోరున ఏడ్వడం మొదలుపెట్టిందా పాప. "ఈ బాలు నా కొద్దూ...." అని.

అప్పటికే మంచి కోపం మీదున్న శంకర్రావు భార్యకి, ఆ అరుపులు విన్న తరువాత విపరీతమైన కోపమొచ్చేసింది. ఇక తట్టుకోలేక, కోపంతో, "ముండకి..." అని తిట్టుకుంటూ వచ్చి పాప జుట్టు పట్టుకొని అకాలించింది. అప్పటి వరకూ నవ్వుతూ ఉన్న శంకర్రావుకి, ఆవిడలా పాప జుట్టుని పట్టుకొనేసరికి, చెప్పలేనంత కోపమొచ్చేసింది.

"మర్యాదగా వదులూ..." అంటూ భార్యని కసిరి, పాపని తన భుజం మీద వేసుకున్నాడు శంకర్రావు. పాప అంత అల్లరి చేసినా, ఏమాత్రం మందలించని శంకర్రావు, పాపమీద కాస్తంత కోప్పడగానే, కళ్లెర్రగించేసరికి, వాళ్లమ్మకి ఆయన మీద కోపం మొదలైంది. అప్పటి వరకూ శంకర్రావు ఏదైతే జరక్కూడదనే

భయంతో ఉన్నాడో అదే జరిగింది. అప్పటివరకూ ఆవిడకి ఆ పాప మీద ఉన్న కోపం కాస్తా శంకర్రావు మీదకి మళ్లింది.

"అలాగే ఎక్కించుకోదాన్ని... నివ్వలాగ ఎక్కించుకోబట్టే అదిలగ మొండిదాన్లాగ తయారయ్యింది. కనీసం ఒక రోజైనా బియ్యిం సెప్పినావా దానికి?... ఇంట్లోన అదాడిందే ఆట.... పాడిందే పాటయిపోతంది. అయినా నాకేనికలే.... నీకెప్పుడు తెలాలో అప్పుడే తెలుస్తాది...." అంటూ విసురుగా చీపురు తీసుకొని వంట గదిలోకెళ్ళిపోయింది. ఆవిడలా వెళిపోయేసరికి శంకర్రావుకి ధైర్యమొచ్చేసింది. సన్‌షేడ్ మీదనుంచి సంచీని కిందకి దించి, అందులో నుండి ఓ ఎర్రరంగు టెన్నిస్ బంతిని తీసి పాప చేతికందించాడు. దాన్ని చూసి పాప మొహం వెలిగిపోయింది. అంత సేపూ గోల చేసి ఏడ్చేసిన పాప, అరసెకను కూడా గడవక ముందే అంతా మర్చిపోయి, "హే.... బాలూ...." అంటూ ఎగిరి గంతులేసింది. దానిలోని పసితనాన్ని చూసి శంకర్రావుకి మరింత ముచ్చటేసింది. ఒక చిన్న కంటి తుడుపుతో అంత పెద్ద దుఃఖాన్ని సైతం సునాయాసంగా మర్చిపోయిన ఆ పసితనంలోని అమాయకత్వానికి శంకర్రావు దాసుడైపోయాడు. పాప "నానా.... బాలూ...." అంటూ ఆటలో పడిపోయి మురిసిపోతుంటే, శంకర్రావు ఆమెలోని ఆనందాన్ని చూసి మురిసిపోతున్నాడు. వాళ్లమ్మ మాత్రం కోపంతో రగిలిపోతోంది.

"కళ్లు సూడూ.... గుడ్లు కళ్లెట్టుకొని.... ఇంతసేపు బే గొట్టి, ఇప్పుడేమో నవ్వేస్తంది.... నవ్వు. సిగ్గులేని నవ్వూ, ఇదీ..." అని వాళ్లమ్మ ఏదో అరుచుకుంటోంది గానీ, పాప అదేమీ పట్టించుకోవడంలే. ఎలాగైతేనేం, పాప, ఆ పూటకి తాననుకున్నది సాధించుకోవడమే కాక, అనుకోకపోయినా వాళ్లిద్దరి మధ్యా గొడవ పెట్టడంలో కూడా పూర్తి విజయం సాధించింది.

రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటే తప్ప, కుటుంబానికి గుక్కెడు గంజి నీళ్లు అందించలేని పరిస్థితి శంకర్రావుది. యజమాని విదిల్చే ఎంగిలి మెతుకులు కోసం, రోజంతా పనే. సముద్రాలకి ఆవల ఎక్కడో కూర్చొని కూడా, ఇక్కడ చేస్తున్న పనిని పర్యవేక్షించగల ఆ యజమానుల కనుసన్నల్లోనే గడుస్తుంది అతని రోజంతా. ప్రతి క్షణం, ప్రతి కదలిక... అంతా వాళ్ల అజమాయిషీ కిందే. వాళ్ళకి వీళ్లెప్పుడూ పని చేసే యంత్రాల్లాగే కనిపిస్తారు తప్ప, మనుషుల్లా కనిపించరు. అందుకే రోజంతా పనే. వాళ్ళకి లాభాలొచ్చే పని తప్పా మరోటి గుర్తురానివ్వడు వాడు. ఒకసారి ఎంట్రన్స్ గేటుదాటి లోపలికెలితే, మళ్లీ బయట కొచ్చేంత వరకూ అంతా వాళ్ళ లోకమే. ఇల్లూ, పొల్లూ, పెళ్లాం, పిల్లలూ, కష్టాలూ, సుఖాలూ.... ఇవేవీ గుర్తురాకూడదు. గుర్తురావు కూడా.

ఉదయం ఎనిమిదికనగా ఇంటినుండి బయల్దేరిన శంకర్రావు, మళ్లీ ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదయ్యింది. శంకర్రావు ఇంటికి చేరుకునేటప్పటికి, శంకర్రావు వాళ్లావిడ, వాళ్ల పాపకి గోరింటాకు పెడుతోంది. "అమ్మా!... ఇక్కడా.... ఇక్కడా...." అంటూ ఆ పాప, తానెక్కడెక్కడ గోరింటాకు పెట్టించుకోవాలను కుంటోందో చెప్తుంటే, వాళ్లమ్మ, "ఇదా.... ఇదా...." అంటూ ఆ పాప చూపించిన చోట మురిసిపోతూ గోరింటాకు పెడుతూపోతోంది.

శంకర్రావు ఫ్రెషప్పై వచ్చి, భోజనం చేసిన తర్వాత లేచి, పాపని దగ్గరకి తీసుకొని మాట్లాడడం మొదలుపెట్టాడు. రోజు మొత్తం మీద, అతను మనస్ఫూర్తిగా పాపతో మాట్లాడడానికి మిగిలింది ఆ గంటా అరగంట సమయం మాత్రమే. శంకర్రావు రావడం లేటైనా, పాప అలసిపోయి పడుకుండిపోయినా, వాళ్లకి ఆ సమయం కూడా మిగలదు ఆ రోజుకి. అందుకే అవకాశమున్నంత వరకూ శంకర్రావు, ఆ అవకాశాన్ని వదులుకోవడానికి ఇష్టపడడు.

"ఉదయం స్కూలుకెళ్ళావమ్మా!..." అంటూ స్టార్ట్ చేశాడు శంకర్రావు పాపని దగ్గరగా తీసుకొని. పాప, "ఎళ్లాను..." అన్నట్టుగా హుషారుగా తలూపింది. పాపలోని ఆ హుషారుని చూసి, "మరి హెూం వర్క్ సేసావైతే?..." అనడిగాడు శంకర్రావు అంతే హుషారుగా. ఈ మాటకి వాళ్లావిడ అందుకుంది. "సేసిందీ.... సెయ్యిదా? రెండు తంతే.... అప్పుడు సేసింది... "అని ఒక్కసారిగా మళ్లీ వాతావరణాన్ని వేడెక్కించేలా మాట్లాడింది.

"హెూమ్ వర్కు సెయ్యిడానికి అలా ఏడిపిస్తె ఎలగమ్మా?..." అని వాతావరణాన్ని చల్లబరుస్తూ అడిగాడు శంకర్రావు. "నానా.... సాక్లేటు తింతే పళ్లు పుచ్చిపోతయా?...." అంటూ పాప టాపిక్ డైవర్ట్ చెయ్యడానికి ప్రయత్నించింది.

"పుచ్చిపోతయి.... పుచ్చిపోవా?.... మీ నాయిన ఏటడిగినాడూ!... నువ్వేటి సెప్తనవే.... అడిగిందానికి సమాధానం సెప్పడం మానేసి, తిరిగి అడ్డమైన కొచిన్లేస్తాటీ?...." అంటూ సంబంధం లేకుండా మధ్యలోకొచ్చి ఫైరయింది శంకర్రావు భార్య. అప్పటి వరకూ హుషారుగా ఉన్న పాప, ఆ అరుపులకి నెమ్మదిగా మొహం మాడ్చుకొని, సైలెంటైపోయింది. అదలా మొహం మాడ్చుకునేసరికి, వాళ్లమ్మ ఉత్సాహం రెట్టింపయింది.

"ఉదయం బాల్ తీసికెల్లింది కదా!... తెచ్చిందో లేదో అడుగుమీ..." అంటూ తన భర్తని కూతురుపైకి ఎగదోసింది శంకర్రావు భార్య, గోరింటాకు పెట్టుకుంటూనే. అప్పటికిగానీ ఉదయం బంతి కోసం జరిగిన రాద్ధాంతమంతా గుర్తురాలేదు శంకర్రావుకి.

భార్య మాటలు విన్న శంకర్రావుకి, పాప ఉదయం స్కూలుకి తీసుకెళ్లిన బంతిని తిరిగి తీసుకురాలేదన్న విషయం అర్థమయ్యింది. "బాలు తేలేదమ్మా!...." అనడిగాడు శంకర్రావు పాపని. పాప మళ్లీ ఏదో సంబంధంలేని సమాధానం చెప్పింది. పాప మాటతీరుని చూసి మళ్లీ పొంగిపోయాడు శంకర్రావు. "అది కాదే.... బాలేటి సేచ్చినావో సెప్పూ... తెచ్చినావా? లేదా?..." అంటూ అడిగాడు ముసిముసిగా నవ్వుతూ. ఆ మాటకి పాప, "బాలా?..." అంటూ ఆశ్చర్యంగా అడిగింది. అప్పుడే మొదటిసారి బాలు గురించి విన్నట్టుగా మొహం పెడుతూ. "అవును బాలే..." అన్నాడు శంకర్రావు. ఇంకోమాటకి అవకాశం ఇవ్వకుండా. "నానా!..." అంటూ మొదలుపెట్టింది పాప. ఆమె పలుకుల్లోని ప్రతి స్వరం భలే విచిత్రంగా వినిపిస్తోంది శంకర్రావుకి.

"నానా!.... నేనేమో! బాలు తీసుకెల్లి బ్యాగులో పెట్టాన్నానా!.... మా క్లాసు లచ్చిముంది కదా!... అదీ, బాసాగోడూ కలిసి నా బేగు నుండి దొంగతనంగా బాలు తీసేసి, నాలుగో తరగతి సురేంద్రగోడున్నాడు కదా!.... ఆడితో కలిసి, ఆడారు...." పాప చెప్పుకుంటూ పోతోంది. శంకర్రావుకి ఆ లచ్చెమెవరో, ఆ సురేంద్రెవరో, ఆ బాసాగాడెవరో అస్సలు తెలియకపోయినా, తెలుసునన్నట్టుగా కుతూహలంగా తలాడిస్తుండేసరికి, ఆ పాప

ఏదో మహాద్భుతంని వివరిస్తున్నట్టుగా చెప్పుకుపోతోంది. చిన్న పిల్లల మాటల్లో ఏదో గమ్మత్తుంటుంది. కాస్తంత శ్రద్ధ పెడితే చాలు కన్నీళ్లూ, కష్టాలూ.... అన్నింటినీ మరిపించే శక్తి వాటికుంది. శంకర్రావు కూడా ఇప్పుడు అదే మత్తులో ఉన్నాడు.

“నేనేమో బాలు ఇసిరాను నానా!... సురేంద్రగోడు బ్యాటుతోటి కొట్టాడు. అదేమో!.. ఆకాసమంత హై...టెల్లి మా క్లాసు రూముంది కదా!... దాని మీదొచ్చి పడింది. ఎంతసేపుటి కిందకి రాలే. ఇంతలో ఐదో తరగతి సులేమాన్ గోడేమో బాలు తియ్యిడానికి మేడమీదకెక్కుతుంతె, మా సార్ సూసి ఆడ్ని తిట్టారు. మమ్మల్నందర్నీ క్లాసు రూముకి పంపించీసారు. బాలక్కడ ఉండిపే....” పాప చెప్తున్నంతసేపూ అలా దాని వైపే చూస్తూ ఉండిపోయాడు శంకర్రావు. కానీ పాప ఎప్పుడైతే, సులేమాను గాడు మేడ మీదకెక్కడానికి ప్రయత్నించాడని చెప్పిందో, అప్పుడు భయమేసింది శంకర్రావుకి. “తప్పమ్మా.. అలా గోడలు ఎక్కకూడదు.... అని శంకర్రావంటే, “సరే...” అన్నట్టుగా తలూపిన ఆ పాప, మళ్లీ వెంటనే అందుకొని, “నానా... కొత్త బాలు కొను నానా....” అంటూ బతిమిలాడడం మొదలుపెట్టింది. “సర్లే! కొంతాన్లే....” అన్నాడు శంకర్రావు. “ఇప్పుడే కొను...” అంటూ రాగాలు తీయడం మొదలెట్టింది పాప. “ఇప్పుడెక్కడ షాపులుంటాయా?... రేపు కొంతాన్లే....” అని శంకర్రావు సర్ది చెప్పాడు. అతను ఎంత చెప్పినా పాప అస్సలు వినదే. “నాకిప్పుడే కొనూ...” అంటూ ఏడవడం మొదలెట్టింది. ఆఖరికి శంకర్రావు భార్యొచ్చి, పాపని ఒళ్లో తీసుకొని పడుకోబెట్టినంత వరకూ ఆ సమస్య సద్దుమణగలే.

ఎప్పటిలాగే రోజూ ఉదయాన్నే ఆఫీసుకెళ్లి, సాయంత్రానికి ఇంటికొచ్చేసే శంకర్రావు, ఆ రోజు ఇంటికి చేరుకునేటప్పటికి బాగా ఆలస్యమైపోయింది. ఆయన ఇంట్లో అడుగుపెట్టేటప్పటికి, పాప పడుకుండి పోయింది. శంకర్రావు ఫ్రెషప్పైన తర్వాత భోజనం దగ్గర కూర్చున్నాడు. పడుకొని ఉన్న పాపని చూసి, “స్కూలు కెళ్లిందా?...” అనడిగాడు భార్యని.

“లేదు” అన్నట్టుగా తలూపింది భార్య.

“ఏమీ?....” అనడిగాడు శంకర్రావు.

“నిన్న రాత్రి సులేమానుగాడట, ఎవుడో ఐదో తరగతి పిల్లడు, స్కూలెనకనున్న గోడ మీదనుండి స్కూలు బిల్డింగు మీదకెక్కుతుంతే, ఆ గోడ పడిపోయి సచ్చిపొన్డట... అందికే, ఈ రోజు స్కూలుకి సెలవు....” అని అన్నం వడ్డిస్తూ విచారంగా చెప్పుకొచ్చింది శంకర్రావు భార్య. “పిల్లడు సచ్చిపోయాడు” అన్నమాటతో వినబడతానే, శంకర్రావుకి గుండె పిండేసి నట్టయ్యింది. “పిల్లడు సచ్చిపోడమేటీ?...” అనే విచారంలో ఉన్న శంకర్రావుకి, “సులేమాన్...” అనే పేరు ఎక్కడో విన్నట్టనిపించి, “ఎక్కడ విన్నాను?” అని ఆలోచించడం మొదలుపెట్టాడు. “ఆఁ.... గుర్తొచ్చింది.... పాప నోటంట విన్నాను.... బాలు తీయ్యిడానికి మేడెక్కుతుండి, సార్ చేత తిట్లు కాశాడు....” అని గుర్తు చేసుకుంటూ శంకర్రావు, “కొంప తీసి, మళ్లీ బాలు కోసం ఆడా గోడెక్కలేదు కదా!...” అని మనసులో అనుకుంటూ విపరీతమైన కంగారుకు లోనయ్యాడు. ఆ కంగారులోనే భార్యని అడిగాడు, “ఆడా బిల్డింగ్ ఎందుకెక్కాడు?...” అని.

“ఆ స్కూలు పక్కనే ఎవరో కార్పొరేటరు ఆల్లు ఉన్నారట కదా.. ఆవిడేమో, ఈ పిల్లడ్ని పిలిసి, నేరడు పళ్లు తెమ్మని సెప్పిందట ఆ ముందురోజు. ఈ పిల్లడు తీసికోనెళ్లిస్తే, ఆయమ్మ ఐదు రూపాయిలిచ్చి, రేపు ఇంకొంచెం మంచివి తీసుకొని రా రా పది రూపాయిలిస్తాను అని సెప్పిందాట.... అందుకే, ఆ పిల్లడు తెల్లారి లెగిసీ లెగడం తోటే నిద్ర కళ్లేసుకొని పళ్లు తియ్యిడానికని ఎల్లి అలా ఐపొన్డు...” కూర వడ్డిస్తూ చెప్పిందా మాట.

“గోడెలా పడిపోయిందీ?...” అతని ధ్యాసంతా ఆ పిల్లోడి మీదే ఉంది.

“అప్పుడికే ఆ గోడ కొంత పడిపోయి ఉందట. రాతిర వర్షం పడింది కదా!... దానికి ఆ గోడ బాగా తడిసిపోయి, ఇంకా బులబులై పోయిందట. పాపం ఆ గుంటడు, ఇదేదీ సూడకుండా ఎక్కిస్తే, ఆడి బరువు కాయలేక, ఆ గోడ పడిపే. ఆడేమో ఆ మద్దిలోన ఉండిపోయి....” అంటూ భారంగా ముగించేసిందావిడ.

ఆ కుర్రోడు బాలుకోసం ఆ గోడ ఎక్కలేదనే విషయం అర్థమయ్యేసరికి, శంకర్రావు కొంత కుదుటపడ్డాడు. గట్టిగా ఊపిరి బిగబట్టి, వదిలి, “బాలు కోసం కాదన్నమాట...” అన్నాడు. తాను మనసులో అనుకుంటున్నాననుకొనే మాటని బయటకి అనేసేసరికి, “ఏ బాలు?... “ అని ఆశ్చర్యంగా అడిగింది శంకర్రావు భార్య.

“అదీ... “ అని శంకర్రావు ఏదో తడబడు తుండేసరికి, విషయాన్ని అర్థం చేసుకున్న అతని భార్య, “పాప తీసుకెళ్లిన టెన్నిస్ బాలేనా?...” అని అడిగి, “ఆ బాలు దాని బేగులోనే ఉంది.... ఉదయం హోం వర్కు సెయ్యించడానికి పుస్తకాలు తీయిస్తుంతే, దొరికింది...” అని ఆవిడే సమాధానం చెప్పింది. అప్పటికి గానీ,శంకర్రావుకి నోట్లో ముద్ద పెట్టుకోవాలనిపించలేదు. ఓ ముద్ద కలిపి నోట్లో పెట్టాడో లేదో మళ్లీ ఆ పిల్లోడే గుర్తొచ్చాడు.

“ఇంతకీ లాస్టుకి ఏటైందదైతే?!...” అనడిగాడు శంకర్రావు ఆపుకోలేక. గొంతు నుండి ముద్ద కిందకి దిగడంలేదతనికి.

“ఏటొద్దీ?.. పోలీసులూ, పెద్ద మనుసులూ అందరు వచ్చారట.... పడిపోయిన గోడుంది కదా!... ఆ గోడ తీసేసి, అక్కడ కొత్త గోడ కట్టమని గవరమెంటోలు అప్పుడెప్పుడో డబ్బు లిచ్చినారట... ఈ పెద్ద మనుసుల్లోన ఎవులో ఆ డబ్బులు తీసుకొని, ఆ గోడ కట్టినట్టుగా బిల్లులు సేయించుకున్రట... ఇప్పుడీ పిల్లడు గోడ మీద నుండి పడిపేయి, సచ్చిపొన్డనే విషయం అందరికీ తెలిస్తే విషయం పెద్దదైపోయి, మళ్లీ ఆ పాతవన్నీ ఎక్కడ బయిటికొచ్చేస్తయో ఏమోనని ఆలోసించి, ఫస్టు పోలీసులుకి ఎంతో కొంత ఇచ్చి మూతి కట్టేసినారట. దాంతో అందరూ ఒకటైపోయి, ఆ పిల్లడి తల్లిదండ్రుల్ని పిలిపించి ఎంతో కొంతిచ్చేస్తమూ అని సెటిల్ మెంటు సేసుకున్రట.... ఈ విషయం ఊరందరూ సెవులు కొరుక్కుంతన్రు గానీ, ఎవులూ కిక్కురుమని మాట్లాడ్డంలే....” అని జరిగిందంతా దగ్గరుండి చూసినట్టుగా చెప్పి, “ఇప్పుడు నీను సెప్పిన ఈ మాటలు బయటెక్కడ అనకుమీ.... మనకేనికి అనవుసరంగా....” అంటూ అదేదో బయట మాట్లాడ కూడని విషయమైనట్టుగా జాగ్రత్త చెప్పుకొచ్చింది శంకర్రావు భార్య. కానీ ఇవేవీ అతనికి వినిపించడంలే. కూలిపోయిన గోడ.... శిథిలాలూ.... శిథిలాలలో నలిగిపోయిన పసివాడు.... చుట్టూ నెత్తురూ.... చేతిలో నేరేడు పళ్లు.... గుండెలు పగిలేలా ఏడుస్తున్న

కన్నతల్లి అరణ్యరోదన.... ఇది తప్పా శంకర్రావుకి ఇంకేదీ కనిపించడంలే.

శంకర్రావుకి తిండి తినాలనిపించలేదు. పళ్లెంలో అన్నం అలాగే వదిలేసి, చేతులు కడిగేసుకొని లేచిపోయాడు. అతనలా మెతుకు ముట్టకుండా చేతులు కడిగేసుకొనే సరికి, అతని భార్య కంగారుతో, "ఏమైందీ?...." అని ఆశ్చర్యంగా అడిగింది. అయినా అతనవేవీ వినిపించుకోవడంలేదు. కంచం ముందు నుండి లేచిన శంకర్రావు, సరాసరి, పడుకొని ఉన్న పాప పక్కకు చేరి, పాప నుదుటి మీద గాఢంగా ఒక ముద్దు పెట్టి, పాపని బలంగా తన కడుపులోకి లాక్కున్నాడు. తల్లి కోడి తన రెక్కల్లో పిల్లల్ని దాచిపెట్టినట్టు. ఆ రాత్రి మొత్తం మీద అతనికి క్షణం కూడా నిద్ర పట్టలే. కళ్లు మూసినా, కళ్లు తెరిచినా ఒకటే దృశ్యం. శిథిలాలు.... శవం.... రోదన. అతని భార్యది కూడా ఆ రాత్రికి కోడి నిద్రే అయ్యింది.

శంకర్రావు ఉంటున్న ఇంటికి నాలుగు వీధుల అవతల ఉన్న నాలుగంతస్తుల మేడలో ఉన్న కార్పోరేట్ గారి భార్య, కడుపు నిండా చికెన్ బిర్యానీ తిని, గురకపెట్టి నిద్రపోతోంది. కార్పొరేటర్ గారు కల్లు తాగి ఒళ్లు తెలియని మైకంలో పడున్నారు. ●

# తొలితరం అభ్యుదయ కవి అనిసెట్టి సుబ్బారావు శతజయంతి నివాళి

**అఖిలభారత** ప్రజానాట్యమండలి, ఆంధ్ర ప్రజానాట్యమండలి, ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం 1943లో ఏర్పడగా, అంతకుముందే 1942లో నరసరావుపేటలో అనిసెట్టి సుబ్బారావు అనే అభ్యుదయ కవి నవ్యకళా పరిషత్తును స్థాపించారు.

అనిసెట్టి సుబ్బారావు 23 అక్టోబరు 1922లో నరసరావుపేటలో ఒక ధనిక కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రికి ఆయిల్ మిల్లు, 20 లారీలు వుండేవి. ఆయన ఒక పారిశ్రామికవేత్త. అనిసెట్టి 1937లో స్కూల్ ఫైనల్, 1939లో గుంటూరు హిందూ కళాశాలలో ఎఫ్.ఏ., 1941లో ఏ.సి. కళాశాలలో బి.ఏ. పూర్తిచేశారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారు. 1943లో మద్రాసు లా కళాశాలలో చేరారు. బెంగాలీ విప్లవకారుడు రతన్‌కుమార్ చటర్జీని ఆశ్రయమిచ్చినందుకు రెండేళ్ళ జైలుశిక్ష వెల్లూరులో అనుభవించాడు. జైలు నుండి విడుదలై వచ్చిన తర్వాత 1945 జూన్ 6న, గతంలో నిర్ణయించుకున్న లక్ష్మీదేవిని వివాహం చేసుకున్నారు. 1947లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో ఎం.ఏ. ఇంగ్లీషు చదివారు. 1948లో డిటైన్ చేయడంతో పరీక్ష రాయలేకపోయారు.

శ్రీశ్రీలాగానే అనిసెట్టి కూడా తన సాహిత్య జీవితం తొలిదశలో కాల్పనికోద్యమ ప్రభావంతో, హైస్కూలులో తన గురువైన నాయని సుబ్బారావు ప్రోత్సాహంతో పద్య కవిత్వం రాశారు. తర్వాత ఆయన సమకాలిక మిత్రులు ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, మాచిరాజు దేవీప్రసాద్, శ్లిష్టా, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీల ప్రభావంతో అభ్యుదయ కవిత్వ రచన చేశారు. 1943లో అరసం మొదటి మహాసభ నుండి 1947 చతుర్థ మహాసభల వరకు అనిసెట్టి రాష్ట్ర కార్యవర్గంలో పనిచేశారు.

'ప్రజాశక్తి' (1945-46), 'ప్రతిభ', (1946-47), 'అభ్యుదయ' (1948) పత్రికలకు సంపాదకవర్గ సభ్యులుగా కృషిచేశారు. కమ్యూనిస్టు పార్టీని నిషేధించిన సందర్భంగా అరసం, ప్రజానాట్యమండలి రచయితలు, కళాకారులు అత్యధికులు జీవనోపాధికై మద్రాసు సినీరంగంలో ప్రవేశించారు. 1952లో గిడుతూరి సూర్యం సహకారంతో సినీరంగంలోనికి వెళ్ళి మాటలు, పాటలు రాస్తూ దానిలో మునిగిపోయారు.

అభ్యుదయ రచయితగా అనిసెట్టి వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. కవిత్వం, అనువాద కవిత్వం, నాటకాలు, నాటికలు, రేడియో నాటికలు, కథలు, వ్యాసాలు, మూకీ నాటికలు, సినిమా పాటలు, మాటలు మొదలైన ప్రక్రియలలో సాహిత్య సృష్టి చేశారు. తాను 1941 నుండి 1947 వరకు రాసిన కవితలను 1949లో మా-గోఖలే వర్ణచిత్రంతో 'అగ్నివీణ' సంపుటిగా ప్రచురించారు. 'కల్పన' (1953), శ్రీశ్రీయుగం (1961), యువకవిత (1974) సంకలనాలకు సంపాదకులలో ఒకరుగా వున్నారు. 1965-75 మధ్య బెంగాలీ, ఒరియా, రష్యన్, ఉర్దూ, ఇంగ్లీషు కవితలను అనువదించారు. 1950 నుండి నాటక రచయితగా పేరుపొందారు. 1950 నాటి 'గాలిమేడలు' నాటకాన్ని ప్రభుత్వం నిషేధించింది. 'శాంతి', 'రిక్షావాలా', 'ఓటెవరికి?' అనే మూడు మూకాభినయం రచనలు చేశారు. ఆయన కథలు, రేడియో నాటికలు, వ్యాసాలు కూడా రాశారు.

1970-74 ప్రాంతంలో అరసంను రాజకీయ పార్టీ చెప్పుచేతల్లో వుండకూడని విధంగా పునరుద్ధరించిన కృషిలో అనిసెట్టి ప్రధాన పాత్ర వహించారు. కాని ఆ సంస్థ అతి త్వరితంగా కనుమరుగైంది. సోమసుందర్, అనిసెట్టి సాహిత్య జీవితాన్ని అంచనా వేస్తూ, "రాబోయే తరాల రచయితలు అనిసెట్టి మొదటి దశను ఆదర్శంగానూ, రెండో దశను గుణపాఠంగానూ తీసుకోవాలి" అన్నారు. అభ్యుదయ సాహిత్యోద్యమంలో కృషిచేసిన అనిసెట్టిని జ్ఞాపకం చేసుకుందాం. ●

# రచయిత, కవి, అనామధేయుడు మరణం

**అనామధేయుడు** కలం పేరుతో ప్రసిద్ధుడైన జోరీగల వెంకట నారాయణమూర్తి (జె.వి.ఎన్. మూర్తి) 8-10-22న రాజమండ్రిలో మరణించారు.

విద్యార్థి దశలో రాడికల్ విద్యార్థిసంఘంలోనూ ఆ తర్వాత విరసంలోనూ పనిచేశారు. అనామధేయుడు కలంపేరుతో 'తల తెగిపడినా', 'మరోసారి ట్రిగ్గర్ మీద వేళ్ళతో....', 'నేనూ నా మబ్బు తునక' ఇంకా 'ఓ వొంటిరెక్క సీతాకోకచిలుక' మొదలైన కవితాసంకలనాలను ప్రచురించారు. పలు అనువాదాలు చేశారు. ●

వ్యాసం

# జాతికి వెన్నుదన్నుగా నిలవాల్సిన స్థితినుండి, వెన్నుకోల్పోయే దశకు మీడియాను దిగజార్చిన ముప్పాతికేళ్ళ 'స్వాతంత్ర్య' ప్రస్థానం

– ఓ.వి.వి.యస్. రామకృష్ణ

**కచ్చిత్ స్వానుష్ఠితా తాత వార్తాతే సాధు బిర్జనైః**
**వార్తాయాం సంశ్రితస్ తాత లోకోయం సుఖం ఏధతే**

వ్యాస మహాభారతం – సభాపర్వం – 69వ శ్లోకం.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి – పురిపండా అప్పలస్వామి ఇద్దరూ కలిసి చేసిన వ్యాసప్రోక్త మహాభారతం తెలుగు వచనానువాదంలో ఈ శ్లోకాన్ని, "ఓ రాజా! నీ రాజ్యంలో వార్త – అంటే వ్యవసాయమూ, పశుపోషణా, వాణిజ్యము తగినవారి వలన బాగా సాగుతోందా?!... వార్త వలననే ఈ లోకం సుఖపడుతుంది" అంటూ నారదుడు ధర్మరాజుతో సంభాషణ జరిపిన సందర్భంగా.... అని రాశారు. దీనినే

"వార్తయందు జగము వర్ధిల్లుచున్నది
అదియు లేనినాడు అఖిల జనులు
అంధకారమగ్నులగుదురు కావున
వార్త నిర్వహింపవలయు బతికి"..గా ఆంధ్ర మహాభారతంలో

నన్నయ పేర్కొన్నాడు. ఇందంతా ఎందుకంటే, వార్తంటే కేవలం ఒక వృత్తాంతమనో, పైపై సమాచారమనో భావించకూడదు, ఇంకా లోతుగా ఇది ప్రజారాజకీయాలకు, అంటే ప్రజా జీవితాలకు సంబంధించిన అంశమని గుర్తించడానికే. పాలకులు అమలుచేస్తున్న విధానాలు తమ అభ్యున్నతికి దారితీస్తున్నాయా?!.... లేక తిరోగమనంలోకి నెట్టివేస్తున్నాయా అని ప్రజలు ఆలోచించుకునేందుకు, విశ్లేషించుకునేందుకు వార్తాప్రసార సాధనాలు తోడ్పడాలి. ప్రజల జీవితాలను కడగండ్లపాలు చేసే ప్రజావ్యతిరేక విధానాలపట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అవి అప్రమత్తం చేయాలి. ఆ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు అవసరమైన చైతన్యాన్ని ప్రోదిచేసేందుకు, మేధోసహకారాన్ని అందిస్తూ ప్రజలవైపే నిలబడాలి. ఈ కర్తవ్యాన్ని జాతీయోద్యమ కాలంనాటి పత్రికలు ఎంతో నిబద్ధతతో చేపట్టి, ఎన్ని నిర్బంధాలు ఎదురైనా తట్టుకొని కొనసాగించాయి. గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1908లో 'స్వరాజ్య' పత్రిక సంపాదకుని కోసం.... "స్వరాజ్య పత్రికకు సంపాదకుడు కావలెను. జీతం – ఎండిన రెండు రొట్టెలు, ఒక గ్లాసు చల్లని నీరు. సంపాదకీయాలకు బహుమతి పదేళ్ళ జైలు జీవితము" అంటూ చేసిన ప్రకటన ఈ పరిస్థితికి అద్దం పడుతున్నది. అలా జాతీయోద్యమకాలం నుండి నిబద్ధతతో ప్రజల పక్షం వహిస్తూ వార్తాప్రచురణగా మొదలైన మీడియారంగపు ప్రస్థానం, స్వాతంత్ర్యం అంటూ చెప్పబడే అధికార మార్పిడి మీదుగా, స్వాతంత్ర్యపు అమృత మహోత్సవాలంటూ పాలకులు ఊదరగొడుతున్న నేటి డిజిటలైజ్డ్ అబద్ధాల కోలాహలాల మేళాల వరకు ఎలా కొనసాగుతున్నదో పరిశీలిద్దాం.

జాతీయోద్యమ వెల్లువలో ప్రజలు బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. భారతదేశాన్ని దులుపుకు పోవాల్సిన వరహాల చెట్టుగా భావిస్తూ తెల్లదొరలు అమలుచేసిన క్రూర దోపిడీ పాలనను నిరసించి ఎదిరించారు. ప్రజల ఆలోచనలనూ, జాతి భావచైతన్యాన్ని బ్రిటీషువారి పాలనకు వ్యతిరేకంగా మలచడంలో జాతీయోద్యమకాలపు మీడియా గొప్ప పాత్ర పోషించింది. ఈనాడు విస్తృతంగా అందుబాటులో వున్న ఇంటర్నెట్ కాదు కదా, కనీసం ల్యాండ్‌ఫోన్ కూడా లేని ఆరోజుల్లో పత్రికాముద్రణ – పంపిణీ అంటే ఎంత కష్టతరమైన పనో. కానీ ఆనాడున్న ఆ పరిమిత సౌకర్యాల మధ్యనే పత్రికలు స్థాపించి జాతీయభావాల వ్యాప్తికి కృషిచేశారు. ప్రజలలో దేశభక్తియుత చైతన్యాన్ని రగల్చడానికి ఆనాటి సంపాదకులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చారు. ఎంత నిర్బంధాన్నైనా తట్టుకున్నారు. 1819లోనే రాజారామ్మోహన్‌రాయ్ 'సంవాదకౌముది' పత్రికను స్థాపించినా, దాని ప్రధాన కార్యరంగం మతసంస్కరణే. ప్రజలలో బ్రిటీషు పాలనా వ్యతిరేక చైతన్యం రగిల్చే కృషికి ఊపు, వేగాలను యిచ్చింది 20వ శతాబ్దపు తొలిదశకాలే. మౌలానా మహమ్మద్ ఆలీ 1911లో ఇంగ్లీషులో 'కామ్రేడ్' పత్రికను, మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ 1912లో 'అల్–హిలాల్' అనే ఉర్దూపత్రికను, గణేష్ శంకర్ విద్యార్థి 'ప్రతాప్' అనే హిందీ పత్రికను ప్రారంభించారు. 1919లో మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 'యంగ్ ఇండియా' పత్రికను, 1920లో డా॥ బి.ఆర్. అంబేద్కర్ 'మూక్‌నాయక్' పత్రికను స్థాపించారు. ఇంకా పండిత మదనమోహన మాలవీయ 1936లో 'హిందుస్థాన్ దైనిక్'ను, జవహర్‌లాల్‌నెహ్రూ 1938లో 'నేషనల్ హెరాల్డ్' పత్రికను ప్రారంభించారు. తెలుగువారిలో కూడా కొండా వెంకటప్పయ్య 1902లోనే 'కృష్ణాపత్రిక'ను, పార్థసారథినాయుడు 'ఆంధ్ర ప్రకాశిక'ను కాశీనాథుని నాగేశ్వరరావు 1909లో 'ఆంధ్రపత్రిక'ను, సురవరం ప్రతాపరెడ్డి 1927లో 'గోల్కొండ' పత్రికను ప్రారంభించారు. భారతీయుల హృదయాలలో పేరుకుపోయిన నైరాశ్యాన్ని పారద్రోలి, మెదళ్ళలో గూడుకట్టిన న్యూనతను తుదముట్టించి జాతీయవాద చైతన్యాన్ని రగిల్చేందుకు ఆనాటి పత్రికలు తమ శాయశక్తులా కృషిచేశాయి.

1917లో లెనిన్ నాయకత్వాన విజయవంతమైన రష్యన్ విప్లవం ప్రపంచవ్యాపితంగా పీడితదేశాల ప్రజలకు పోరాట చైతన్యాన్నిచ్చింది. రెండో ప్రపంచయుద్ధం ముగింపులో జోసెఫ్ స్టాలిన్ నాయకత్వాన సామ్యవాద రష్యా జర్మన్ ఫాసిస్టు నియంతృత్వాన్ని మట్టికరిపించడం అనేక దేశాలలో విమోచనోద్యమాలు పెల్లుబకడానికి కారణమయ్యింది. వలసలు, అర్ధవలస దేశాలలోని జాతీయోద్యమాలు అభివృద్ధి చెందాయి.

అమెరికా సామ్రాజ్యవాదం తప్ప మిగిలిన సామ్రాజ్యవాద దేశాలు చాలా బలహీనపడ్డాయి. మరోవైపు రష్యానేగాక, ప్రజా చైనా మరియు తూర్పు యూరపు దేశాల విప్లవ విజయాలతో ప్రపంచపటం మీద బలమైన సోషలిస్టు శిబిరం ముందుకు వచ్చింది. అటువంటి పరిస్థితుల్లో తెల్ల ఏలికలకు, దోపిడీ పాలన కొనసాగించుటకు రెండే మార్గాలు మిగిలాయి. ఒకటి భారతదేశం వంటి వలసలలోని జాతీయోద్యమాలను అణచివేసి తమ పీడక పాలనను ప్రత్యక్షంగానే కొనసాగించడం. రెండోది, పాలనను దేశభక్తియుత జాతీయశక్తులు పూర్తిగా లాగేసుకోకముందే తెల్లవారి దోపిడీ ప్రయోజనాలను కాపాడేందుకు, తాము పెంచి పోషిస్తున్న దళారీ శక్తులకు సురక్షితంగా పాలించే అధికారాలను బదలాయింపు చేయడం.

ఆనాటి జాతీయోద్యమంలో ప్రజలు సంఘటితమై పోరాటాలలో పాల్గొంటున్న తీరును చూసిన బ్రిటీషు సామ్రాజ్యవాద ఏలికలు, మొదటి మార్గాన్ని అనుసరిస్తే తమ సామ్రాజ్యవాదపు ప్రయోజనాలు సమూలంగా పెకలించివేయబడతాయనే భయంతో రెండవ మార్గాన్నే ఎన్నుకున్నారు. తామే పాలుపోసి పెంచి పోషించిన దళారీశక్తుల నెత్తిన కిరీటాలు పెట్టి తమ దోపిడీని విజయవంతంగా నేటికీ కొనసాగిస్తున్నారు. 'అర్ధరాత్రి స్వతంత్రం... అంధకార బంధురమంటూ' శ్రీశ్రీ.... 'ఆగస్టు 15 ద్రోహాన్ని గురించి చెప్పకపోతే అన్నం సహించదు నాకు' అంటూ చెరబండరాజు చెప్పినదిదే. అధికార మార్పిడినే స్వతంత్రమంటూ మభ్యపెట్టి అమలుచేసే దోపిడీ పాలనాకళలో పాలకులు నానాటికీ ఆరితేరిపోతున్నారు. స్వతంత్ర పాలననే ముసుగులో దళారుల దోపిడీకి భజన చేసేదిగా మీడియా మెడలను వంచి ఉంచడానికి శతథా ప్రయత్నిస్తున్నారు. స్వతంత్ర దేశంలో కనీస ప్రజాస్వామిక ఆకాంక్షలేవీ నెరవేరకపోగా నానాటికీ ప్రజాజీవితాలు దుర్భరమైపోతున్నాయి. ఈ వైనాన్ని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత మీడియాదే. కానీ స్వాతంత్ర్యానంతరం మీడియాను ఈ పనిచేయనివ్వలేదనేదే వాస్తవం. 'గరుత్మంతుళ్ళు తెచ్చిన అమృతం / దక్కించుకోవడం అనృతం / దర్భలు నాకేరు మన ఏలికలు / అందుకే ఈ నాలుకల చీలికలు / కరిమింగింది వెలగపండు / కాదు కాదంటే పోనిండు / మన స్వాతంత్ర్యం మేడిపండు / మన దారిద్ర్యం రాచపుండు' – ఆరుద్ర (ఆనందవాణి పత్రిక 15-8-1949) వంటి కొన్ని గళాలు తప్ప ప్రజలకు వాస్తవాలు చేరనేలేదు.

స్వాతంత్ర్యానంతరం దేశ విభజన, మతకలహాలు, సరిహద్దు సమస్యలు, కమ్యూనిస్టు ఉద్యమ అణచివేత, పాలకపక్షం లోపల కుమ్ములాటలు మొదలైన అనేక అంశాలలో మీడియా చేత పాలక విధానాల భజనలే చేయించాయి తప్ప, శాస్త్రీయ ఆలోచనలను ప్రజల ముందు చర్చ పెట్టాల్సినంత పెట్టనివ్వలేదు. ఇదే తరుణంలో ఇంకోవైపు నాటి గుత్త వ్యాపార శక్తులైన దాల్మియా – జైన్ గ్రూపు, గోయెంకా, బిర్లా తదితర గ్రూపుల యాజమాన్యంలోకి మీడియా మెల్లగా నెట్టబడ సాగింది. ప్రజల ప్రయోజనాలకన్న, యాజమాన్యాల వ్యాపార – లాభాల ప్రయోజనాలే ప్రాధాన్యతాక్రమంలో ముందుకొచ్చి కూర్చున్నాయి. సర్క్యులేషన్, అడ్వర్టయిజ్‌మెంట్ రెవెన్యూ తదితరాలు జాతీయోద్యమ కాలంనాటి పాత్రికేయ విలువలను వెనక్కి నెట్టివేశాయి. రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆర్టికల్ 19(1) ప్రకారం ప్రతి పౌరునికీ భావప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక హక్కుగా ప్రకటించబడింది. కానీ మరోవైపు పరువు నష్టం, రాజ్యభద్రత తదితర సాకులు చూపుతూ 19(2) ప్రకారం భావప్రకటనా స్వేచ్ఛకూ సంకెళ్ళు వేయబడ్డాయి. సుదీర్ఘ వలస దోపిడీ అనంతరం జాతి పునర్నిర్మాణం కోసం సామాజిక బాధ్యత కలిగిన మీడియా అవసరం అత్యంత ఆవశ్యకమైన విషయంగా ముందుకు వచ్చింది. కానీ తెల్లదొరల చెప్పుల్లో కాళ్ళు ఉంచి పగ్గాలు స్వీకరించిన నల్లదొరలు ఏనాడూ ఈ ఆవశ్యకతను పట్టించుకోలేదు. సరికదా ప్రజల పక్షం వహించే పత్రికారంగపు కర్తవ్యం నుండి పక్కదారులు పట్టించే లేదా నిర్బంధాలను అమలుచేసే ప్రక్రియలలో తెల్లదొరలనే మించిపోతున్నారు.

ప్రపంచంలోనే అతిగొప్ప ప్రజాస్వామ్య దేశమంటూ పాలకులు ఎన్ని గొప్పలు పోయినా, ముసుగులు తీసి ప్రజలకు తమ నిజరూప సాక్షాత్కారమివ్వకుండా ఎక్కువకాలం ఉండలేకపోయారు. 1970ల మధ్య అంటే..., 1975 జూన్ నుండి 1977 మార్చి వరకు అంటే 21 నెలల పాటు దేశంలో విధించబడిన ఎమర్జెన్సీ సమయంలో మీడియాపై ఉక్కుపాదమే మోపబడింది. తమ దోపిడీ గుప్పెట నుండి మనదేశాన్ని జారిపోనీయని సామ్రాజ్యవాద శక్తుల పట్టు, వారి ప్రయోజనాల పరిరక్షణకై మనసావాచా కర్మణా సాగిలపడుతూ మన పాలకుల లొంగుబాట్ల విధేయ ప్రదర్శనలూ ప్రజల కళ్ళముందే తారసిల్లసాగాయి. మనదేశ రక్షణ, పారిశ్రామిక తదితర రంగాల దోపిడీ నిమిత్తమై బయటనుండి నాటి ద్విధ్రువ ప్రపంచపు సామ్రాజ్యవాద శక్తుల తీవ్ర ఒత్తిళ్ళు, రూపాయి విలువ పతనం, పాలక కాంగ్రెస్ పార్టీ లోపల కుమ్ములాటలు, చివరికి 1975 జూన్ 12న రాయ్ బరేలీ నుండి ప్రధాని ఇందిర పార్లమెంటు ఎన్నిక చెల్లనిదంటూ అలహాబాదు హైకోర్టు యిచ్చిన తీర్పు.... ఇన్ని పరిణామాల క్రమంలో ఎమర్జెన్సీయే సరైనదని నాటి పాలకవర్గం నిర్ణయం తీసుకున్నది. ఎమర్జెన్సీ ఉక్కుపాదపు తొలి అడుగులు మీడియాపైనే పడ్డాయి. ప్రెస్ కౌన్సిల్ రద్దు, న్యూస్ ఏజెన్సీలన్నింటినీ కలిపివేయడం, అడ్వర్టయిజ్‌మెంట్ పాలసీల మార్పు, విదేశీ కరస్పాండెంట్లను అంగీకరించకపోవడం వంటి ఇనుప తెరల్ని ప్రజలకు, మీడియాకు మధ్య బిగించారు. ఎమర్జెన్సీ ప్రకటించిన నాడే ఇండియన్ ఎక్స్‌ప్రెస్, స్టేట్స్‌మన్ పత్రికల ఢిల్లీ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా సైతం నిలిపివేయబడింది. ప్రజలకు వాస్తవాలు చేరరాదన్న దురాలోచనతో నాటి ఇందిరమ్మ ప్రభుత్వం అడుగడుగునా ఇటువంటి అడ్డంకులు అనేకంగా సృష్టించింది. ఎమర్జెన్సీ విధింపుకు ముందు కూడా మన నల్లదొరలు సమాచారంపై సెన్సార్‌షిప్పులు విధించిన సందర్భాలూ వున్నాయి. 1947-48 భారత్-పాక్ సరిహద్దు సమస్య 1948 హైద్రాబాద్ నిజాం సంస్థానంపై సైనికచర్య, 1962 ఇండో-చైనా సరిహద్దు సమస్య, 1971 బంగ్లా విముక్తి యుద్ధం వంటి సందర్భాల సెన్సార్‌షిప్పులన్నిటికీ పెద్దన్నలాగ ఎమర్జెన్సీ నిలబడింది. ఎమర్జెన్సీ కాలంలో దేశవ్యాప్తంగా 3800 వార్తాపత్రికల ఆస్తులు జప్తు చేయబడినాయి. అంతర్గత భద్రతాచట్టం – మీసా ఆరోపణలు మోపుతూ 327 మంది పాత్రికేయులు జైలుపాలు చేయబడ్డారు. విదేశీ జర్నలిస్టులను దేశంలోకి అనుమతించలేదు. రోజుల తరబడి సంపాదకీయ వ్యాఖ్య వేసేచోటు ఖాళీగా ఉంచి ఎందరో సంపాదకులు నిరసన వ్యక్తం చేశారు. కానీ ఢిల్లీ నుండి 47 మంది సంపాదకులు మాత్రం 1975 జులై 9న ఎమర్జెన్సీని సంపూర్ణంగా సమర్థిస్తూ ప్రకటన చేశారు.

వార్తాపత్రికలపై సెన్సార్‌షిప్పును సైతం వారంగీకరించడం విశేషం. కేవలం తలవంచమంటే వీరు సాగిలపడిపోయారంటూ నాటి ప్రతిపక్ష నాయకుడు ఎల్.కె. అద్వానీ చేసిన వ్యాఖ్య విశేష ప్రాచుర్యం పొందింది. ఇక ప్రజలకు చెందిన ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లైతే ప్రభుత్వ బాకాలుగానే మార్చివేయబడ్డాయి.

అంతర్జాతీయంగా సోవియట్ యూనియన్ పతనం కావడం, చైనాలో కూడా సాంస్కృతిక విప్లవానంతర పరిణామాలతో తాత్కాలికంగా శ్రమజీవుల ఉద్యమాలు మందగించాయి. దీనిననుసరించే అమెరికన్ సామ్రాజ్యవాదపు నాయకత్వాన ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు, డబ్ల్యుటివోల నేతృత్వంలో మూడవ ప్రపంచ దేశాలపై దోపిడీ తీవ్రత కూడా పెరిగింది. మనదేశం ప్రపంచ దేశాలలో అతిపెద్ద మీడియా మార్కెట్టుగా సామ్రాజ్యవాద దేశాల ద్రవ్య పెట్టుబడులకు నోరూరించ సాగింది. నూరు కోట్లను దాటిన జనాభా. అందులోనూ అతిపెద్ద సంఖ్యగా యువత. సదా మోకరిల్లి ఉంటూ దోపిడీకి గేట్లు బార్లా తెరచి ఉంచే పాలకవర్గము. ఇంకేముంది, మీడియారంగపు విదేశీ రాబందులూ, వాటి స్వదేశీ బంధుజనమూ దేశం ఆకాశమ్మీద ఎగరడం మొదలయ్యింది. పాలకులు 'స్వావలంబన' అనే మాటలు ఎత్తేసి, 'సరళీకృత ఆర్థిక విధానాలు' అనే కొత్త డైలాగును ఎత్తిపట్టారు. సరళీకృత ఆర్థిక విధానాల పేరిట కొత్త నాటకానికి తెరలెత్తడంతో 1992 నాటికి ప్రయివేటు టి.వి.ఛానెళ్ళ రంగప్రవేశం మొదలయ్యింది. విదేశీ ద్రవ్య సహాయము, సాంకేతికత దేశంలోకి వరద ప్రవాహంలాగ వచ్చి చేరసాగింది. వారానికో తెలుగు, హిందీ సినిమాలు, ఓసారి సినిమా పాటలు, మూగ బధిరుల వార్తలు మాత్రమే ప్రసారం చేసే దూరదర్శన్ నుండి, నిరంతర వార్తాస్రవంతులు, సినీసంగీత వాహినులు, క్రైమ్‌స్టోరీల కలగాపులగపు దెయ్యపుపెట్టెలు యింటింటా వెలిసాయి. రుద్రాక్షల, మంత్రతంత్రాల దేశీయ కుళ్ళు నుండి, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ వంటి అమెరికన్ కుళ్ళు వరకు నిరాటంకంగా ఇళ్ళల్లోకి ప్రవహిస్తూ కోట్లాది ప్రేక్షక మెదళ్ళను మురుగు బురదల్లో ముంచి ఉంచగలుగుతున్నాయి. ద్వంద్వార్థాల జబర్దస్త్ షోల నుండి చొంగజాతర్ల బిగ్‌బాస్ షోలుగా జాతి ఆలోచనలను బూతుల గోతులలోకి తొక్కిపారేయాలని నిరంతరం శ్రమిస్తున్నాయి. ఒక్కదెబ్బకు రెండు పిట్టలన్న చందంగా ఒకవైపు జాతిని నిస్తేజం చేస్తూ, నిర్వీర్య పరుస్తూ, మరోవైపు క్షణక్షణానికీ మేటలు పడుతున్న దోపిడీ లాభాలను మూటగట్టుకుపోతున్నారు. ఇండియన్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ (IM&E) రంగపు ఆదాయం 2002లో 9600 కోట్ల రూపాయలు కాగా, 2012 నాటికి ఇది 40,000 కోట్ల రూపాయలకు చేరుకోవడం, దేశ జిడిపిలో అడ్వర్టయిజ్‌మెంట్ రంగపు ఆదాయం 0.38%గా వుండటం వంటివన్నీ, మన ఏలికలను పులి చేపట్టిన కడియం మాదిరిగా ఆకర్షిస్తున్నాయి. కనుకనే మీడియారంగంలో పెట్టుబడులు పెట్టే సామ్రాజ్యవాద శక్తుల లాభాలను నడక నుండి పరుగులోకి మార్చాలని తహతహలాడుతున్నారు. అందులో భాగంగానే ఈ రంగపు పెట్టుబడులకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) పరిమితిని 74% నుండి 100%గా మార్చడం.... అంటే పరిమితిని ఎత్తివేయడం, చలనచిత్ర నిర్మాణానికి పరిశ్రమస్థాయినివ్వడం మొదలైన సౌకర్యాల కార్పెట్లన్నీ పరుస్తున్నారు. దీనికి ప్రతిగా సామ్రాజ్యవాద శక్తులు నువు రమ్మంటే ఏనాడైనా కాదంటానా?!... అంటూ కన్నుగీటుతూ వాలిపోతున్నారు. మన మీడియారంగంలో ప్రయివేటు ఈక్విటీ పెట్టుబడుల పేర వారు ప్రవహింపజేస్తున్న సొమ్ములు కళ్ళుతిరిగేలా చేస్తున్నాయి.

2018 నుండి నాలుగేళ్ళ కాలంలో ఈ ప్రవాహాన్ని ఓసారి పరికిస్తే.. 2018లో ఇవి 591 మిలియన్ అమెరికన్ డాలర్లు. అంటే 4,829 కోట్ల రూపాయలు. 2019కి ఇది 686 మిలియన్ డాలర్లు, 2020కి 730 మిలియన్ అమెరికన్ డాలర్లు. కాగా 2021 నాటికి వారి పెట్టుబడులు 4,947 మిలియన్ అమెరికన్ డాలర్లు. అనగా 39,576 కోట్ల రూపాయలు. ఎంత పెద్ద లాభాల గ్యారంటీ లేకుండా ఇన్ని వేల కోట్ల రూపాయలు పెట్టుబళ్ళు పెడతారు?!.. కమలనాథుల అండదండలతో దేశ వనరులను జుర్రేసుకోవడంలో రెచ్చిపోతున్న అంబానీ, అదానీలు మీడియారంగపు దోపిడీలో సైతం మేమెందుకు వెనకబడాలని దూసుకొచ్చేశారు. న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాలలో నెట్‌వర్క్ 18 పేర 56 ఛానెళ్ళను స్వంతం చేసుకుని 12.84% వ్యూయర్‌షిప్ సాధించిన అంబానీ గ్రూపు మీడియారంగంలో 2021 చివరినాటికి 5930 కోట్ల రూపాయల రెవెన్యూ ఆదాయాన్ని, 9144 కోట్ల రూపాయల నికర ఆస్తులను సాధించగలిగింది. 2022 మేలో క్వింటిలియన్ మీడియా లిమిటెడ్ అనే పెద్ద మీడియా సంస్థలో 49% వాటాలు కొనేసిన అదానీ కూడా అంబానీ సరసన మీడియాలో తిష్టవేశాడు. ఈ దోపిడీ తంతు నిరాటంకంగా నల్లేరు మీద నడకలా సాగిపోయేటందుకే పాత్రికేయ విలువలను, సంపాదక దృక్పథాలను వాసన కోల్పోయిన పువ్వులుగా ఎంచి విసిరిపారేస్తున్నారు. ఇష్టారాజ్యంగా వాస్తవాలను వక్రీకరించడం, సాధారణ వార్తలను సంచలనాలుగా మార్చడం, డబ్బుకోసమే వార్తాసేకరణ – ముద్రణ వంటి అవాంఛనీయ ధోరణులను పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్నారు.

ప్రస్తుతం దేశంలో మీడియా వ్యవహారాలన్నీ కార్పొరేటు ప్రయోజనాలకు అనుగుణంగా, ప్రభుత్వ కనుసన్నలలో జరగాలితప్ప, వేరేవిధంగా జరిగే అవకాశమే లేనంతగా మారిపోయాయి. ఏది వార్త?.. ఎంత రాయాలి?.. ఎంత చూపాలి?.... అసలు వేటిని వార్తలుగా చూపాలి.... అనేవన్నీ ప్రభుత్వమే నిర్ణయిస్తుందా అన్నంతగా నియంత్రణ పెరిగిపోయింది. జమ్మూకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు, పౌరసత్వ చట్టము, NRC, కోవిడ్–19 మహమ్మారి వంటి సమస్యలు దేశాన్ని పట్టి కుదిపేశాయి. సెప్టెంబర్ 2020 నుండి నవంబర్ 2021 వరకు, నల్లచట్టాల రద్దు కోసం జరిగిన ఢిల్లీ రైతాంగపోరాటం ప్రజలను ఉత్తేజపరచింది. ఈ పరిణామాలన్నింటినీ ప్రజలకు రిపోర్టు చేయడం, భవిష్యత్తుకు రికార్డు చేయడం మీడియా ఎంతో బాధ్యతగా చేపట్టవలసిన కర్తవ్యం. కానీ ప్రభుత్వ క్రూర పదఘట్టనల క్రింద నలిగిపోయిన మీడియా ఆ పనిని సక్రమంగా చేయలేకపోయింది. వాస్తవాలను వాస్తవాలుగానే సేకరించే, చిత్రీకరించే మీడియా వారిపై రాజద్రోహచట్టం, అధికార రహస్యాల చట్టం, NIA, UAPA వంటి క్రూర చట్టాలను ప్రయోగించి జైలుపాలు చేయడం జరుగుతున్నది.

2020 మార్చి 25న లాక్‌డౌన్ ప్రకటించిన నాటినుండి వందలాది మంది రిపోర్టర్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర యిబ్బందులకు గురిచేసాయి. మహమ్మారిని ఎదుర్కోవడంలో ఈ ప్రభుత్వాలు అశాస్త్రీయ వైఖరులు అవలంబిస్తున్నాయని, విఫలమయ్యాయని రిపోర్టు చేయడమే వాళ్ళు చేసిన తప్పు. జనవరి 2022లో జరిగిన పార్లమెంటు

శీతాకాల సమావేశాలకు జర్నలిస్టులను అనుమతించేందుకు లాటరీ సిస్టమ్ పెడుతున్న ప్రభుత్వ నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని, దానిని తక్షణమే ఉపసంహరింపజేయాలని, సాక్షాత్తూ ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా అన్ని రాజకీయ పార్టీలకూ లేఖలు రాసిందంటే మనదేశంలో మీడియా స్వేచ్ఛ ఎలా దిగనాసిపోతున్నదో అర్థమౌతుంది. జమ్ముకాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు సందర్భంలో చాలాకాలంపాటు అక్కడి అంతర్జాల సేవలు బందు చేశారు. అన్ని పాత్రికేయ రచనలు, రిపోర్టులు శ్రీనగర్‌లోని మీడియా ఫెలిసిటేషన్ సెంటర్ నిఘాలోంచి తప్ప బయటపడే మార్గమే లేకుండా చేశారు.

రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ అనే అంతర్జాతీయ సంస్థ యొక్క 2021 రౌండప్ రిపోర్టు ప్రకారం మీడియాకు ప్రాణాంతక దేశాల జాబితాలో యెమెన్ దేశంతో కలిసి ఇండియా సంయుక్తంగా 3వ ర్యాంకులో కొనసాగుతోంది. 2022 జులైలో విడుదలైన ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్ జాబితాలో మన దేశం గత ఏడాదికన్నా ఏకంగా 8 స్థానాలు దిగజారి 150వ స్థానంలో నిలిచింది. కాగా ఈ జాబితాలోని మొత్తం దేశాల సంఖ్య 180. ఐతే మీడియా పట్ల ప్రాణాంతక దేశమనే అపవాదును, ఫ్రీడమ్ ర్యాంకు దిగజారిపోతుండడాన్ని, కేంద్ర ప్రభుత్వ పెద్దలు గమనిస్తూ ఉండిపోలేదు. ధిక్కారముల్ సైతునే అంటూ 2020లోనే 'ఇండెక్స్ మానిటరింగ్ సెల్' అనే సంస్థను ఏర్పాటుచేసి, అంతర్జాతీయ ర్యాంకులు పడిపోతూ ఉండడానికి కారణాలు అన్వేషించమని పురమాయించారు. పెద్దల మనోభీష్టాన్ని సరిగ్గా అర్థం చేసుకున్న సదరు సంస్థవారు 2020 చివరకు అందజేసిన తమ రిపోర్టులో, ప్రెస్‌ఫ్రీడమ్ ర్యాంకులు పడిపోతుండడానికి కారణం పశ్చిమదేశాల పక్షపాతపుటాలోచనలే తప్ప క్షేత్రస్థాయి వాస్తవాలు కానేకాదంటూ యధాశక్తి బుకాయించారు. కానీ అదే కమిటీలోని మరో సభ్యుడు, సీనియర్ పాత్రికేయుడు పి.సాయినాథ్ సదరు కమిటీ అందజేసిన రిపోర్టుతో పూర్తిగా విభేదించాడు. కోవిడ్-19ను సాకుగా చూపి కేంద్ర ప్రభుత్వం అనుసరించిన అనేక ప్రజావ్యతిరేక విధానాలు, ఏకపక్ష నిర్ణయాలు, బెదిరింపులు, బలవంతపు గెంటివేతలు మొదలగు వాటిని అసలు క్షేత్రస్థాయి వాస్తవాలుగానే పరిగణించలేదని విమర్శించాడు. వాస్తవాలను కాదంటూ బుకాయించడం, వక్రీకరించడం వంటి పనులకు ప్రభుత్వాల పెద్దలే ఈ స్థాయిలో పూనుకుంటూ ఉంటే, అబద్ధాలు, అజ్ఞానాంశాలు విస్తృతంగా ఛలామణీ (వైరల్) కావడంలో ఆశ్చర్యం ఏముంటుంది?!... ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలలో కనీస సభ్యత విజ్ఞతలను కూడా మరచిపోయి, మత ఛాందసత్వాన్ని, విద్వేషాలను వ్యాపింపజేస్తున్నారు. శరవేగంగా వైరల్ అయ్యే అనేక విషయాలలో ఏవి నిజమో, ఏవి అబద్ధాలో తెలియక ప్రజలు అయోమయానికి గురౌతున్నారు. ప్రచారంలో ఉన్నది అబద్ధమేనని తెలిసినా, రుజువు చేయలేక అనేకమంది మిన్నకుండిపోతున్నారు. ప్రచారకర్తల దబాయింపులు చూసి అబద్ధాలనే నిజాలని నమ్ముతూ ఎంతోమంది విద్వేష భావాలను తలకెక్కించుకుంటున్నారు.

ఇన్ని పెనుగాలుల మధ్య ప్రజలకోసం, వాస్తవాల కోసం నిలిచే పాత్రికేయులూ లేకపోలేదు. నిర్బంధాలకు ఎదురునిలుస్తూ వారు పాత్రికేయ విలువలను పరిరక్షిస్తున్నారు. 2002 గుజరాత్ అల్లర్లలో బాధితుల పక్షాన నిలిచిన తీస్తాసెతల్వాద్, గుజరాత్ ఫైల్స్ రచయిత్రి రాణా అయూబ్, హత్రాస్ దళిత యువతి గ్యాంగ్‌రేప్ రిపోర్టింగ్ కోసం వెళుతూ UAPA తదితర ఆరోపణలు మోపబడి అక్టోబర్ 2020 నుండి సెప్టెంబర్ 2022 వరకు నిర్బంధించబడిన సిద్దిఖ్ కప్పన్ వంటి వారి ఉదాహరణలు ఎన్నో చెప్పుకోవచ్చు. సామాన్య ప్రజలకు విస్తృతంగా అందుబాటులో ఉండి, సామాజిక మాధ్యమాలలో గందరగోళాలకు కారణమౌతున్న అబద్ధాలను, నిజాల నుండి వేరుచేస్తున్న ఫ్యాక్ట్ చెకింగ్ వెబ్‌సైట్ ఐన ఆల్ట్-న్యూస్ వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబైర్ కూడా ఈ కోవలోకే వస్తాడు. వార్తాపత్రికలు, టి.వి. తదితర సాంప్రదాయక మీడియాకన్న, వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సోషల్‌మీడియా వేదికల నుండి ప్రచారాంశాలకు ప్రసారవేగం చాలా ఎక్కువ. సరిగ్గా దీనినే అవకాశంగా తీసుకున్న మతోన్మాదశక్తులు విద్వేషపు పోస్టింగులతో సోషల్ మీడియాను ముంచెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అబద్ధపు వార్తల, విద్వేషాలు నూరిపోసే వీడియోల గుట్టురట్టు చేస్తుండడంతో... జుబైర్ వంటివారినీ తప్పుడు కేసుల్లో ఇరికించి కక్ష సాధిస్తున్నారు.

రెక్కలు ముక్కలు చేసుకుంటూ శ్రమను అమ్ముకుంటున్నా, నోటికి నాలుగు వేళ్ళూ చేరని దౌర్భాగ్యస్థితిలో జనజీవితాలు అల్లాడుతున్నాయి. ప్రజలకు చెందాల్సిన శ్రమ ఫలాలను, వనరులనూ, సమస్త సంపదలనూ ధనికవర్గాలకు దోచిపెట్టే దుర్మార్గం నిరంతరాయంగా కొనసాగుతున్నా రాజ్యపు రాకాసి దాహం తీరడంలేదు ఆ రాకాసి దాహానికి తమ జీవితాలు బలైపోతున్న వైనం ఆ ప్రజలకే తెలియకుండా రాజ్యం చేసే నిరంతరాయ దాడులలో మీడియా కూడా ముఖ్య ఆయుధంగా మారిపోయింది. పాలకవర్గాల గ్రూపుల కుర్చీలాటల నాటకాలు, కాలక్షేపం సీరియళ్ళు, సెక్స్, హింస తదితరాల కోవలోకి ఇప్పుడు విద్వేష విష ప్రచారాలు కూడా తోడై మీడియా అంతటా నిండిపోతున్నాయి. సంక్షోభపూరిత వాతావరణంలోనే వాస్తవాలను ప్రజల వద్దకు చేర్చే కృషిని మీడియా మరింత నిబద్ధతతో చేపట్టాలి. వాస్తవాల దండలో దారంలాగ దాగియున్న, సంక్షోభాల అసలు కారణాలను ప్రజలకు చూపించి అర్థమయ్యేట్లు చెయ్యాలి. కానీ ఈ కర్తవ్యాన్ని చేబూనే వారెవరనేది ఒక ప్రశ్నార్థకంగా మిగిలిపోతున్నది. పీడితులైన ప్రజల జీవితానుభవాలను స్వంతం చేసుకుని, వారి కష్టాల కడగండ్లను వారి కళ్ళతో చూసి, వారి గొంతుతో ప్రపంచానికి చాటేవారెంతమంది?.... మీడియారంగంలో ఇంగ్లీషు రిపోర్టింగ్‌లో పనిచేసే నిరుపేద దళితులు ఎంతమంది ఉన్నారోనని నేను పదేళ్ళుగా వెదుకుతుంటే, నాకు తారసపడింది కేవలం 8 మందేనని అల్‌జజీరా పాత్రికేయుడు సుదీప్తో మోండల్ చెప్పిన మాటలో అవాస్తవమేమీ లేదు. నోమ్ ఛామ్‌స్కీ అన్నట్టు, ప్రజలకు చేరాల్సిన అసలైన వార్తావిశేషాలు ప్రజల కోణంలో ప్రజలకు చేరకుండా అడ్డంపడే అవరోధాలన్నీ ఈ వ్యవస్థలోనే అంతర్నిర్మితంగా ఉన్నాయి. అవి సత్యాన్ని ప్రజలకందించే ప్రజాప్రత్యామ్నాయాలను దాదాపు అసాధ్యం చేస్తున్నాయి. కళాసాహిత్యాల మాదిరిగానే మీడియా కూడా ప్రజల సొత్తే. ప్రజల ఆకాంక్షలు, జీవన సంఘర్షణల నుండే మీడియాకు కూడా జవజీవాలు సమకూరుతాయి. అంతే తప్ప కార్పొరేటు శక్తుల పెట్టుబడుల నుండి కాదు. ప్రజల నుండి పుట్టినవాటిని ప్రజలకే చేర్చడం నిజమైన ప్రజాస్వామిక కర్తవ్యం. ●

## ధారావాహిక

# దేశ విభజన వస్తువుగా సాహిత్యం-3

# అమృతా ప్రీతమ్ నవల 'పింజార్'

- కొత్తపల్లి రవిబాబు

**అమృతా ప్రీతమ్** 1919 అగస్టు 31న నేడు పాకిస్తాన్‌లో వున్న గుజ్రన్‌వాలాలో జన్మించారు. 1947లో దేశ విభజన జరిగినపుడు వీరి కుటుంబం లాహోర్ నుండి న్యూఢిల్లీకి వలస వచ్చింది. ఆమె తన 86వ యేట 2005 అక్టోబరు 31న న్యూఢిల్లీలో మరణించారు.

ఆమె తల్లి రాజ్ బీబీ ఒక ఉపాధ్యాయురాలు. తండ్రి కర్తార్‌సింగ్ హిత్కారి, కవి, ప్రజాభాషా పండితుడు. ఒక సాహిత్య పత్రికకు సంపాదకుడు. అంతేగాక ఆయన సిక్కు మత ప్రచారకుడు. అమృత 11వ యేట తల్లి మరణించగా, తండ్రితో కలసి లాహోర్‌లో స్థిరపడ్డారు. ఆమె వారికి ఏకైక సంతానం. ఆమె రాసిన మొదటి కవితాసంపుటి 'అమృత్ లెహరే' (Waves of Nectar - అమృత తరంగాలు) 1936లో ఆమె 16వ యేట వెలువడింది. బాల్యదశలోనే పరిచయస్థుడైన ప్రీతమ్ సింగ్‌ను 1936లో వివాహం చేసుకున్నారు. ఆయన ఒక పత్రికా సంపాదకుడు. 1936-1943 మధ్య అరడజను కవితా సంపుటులు ఆమె ప్రచురించారు. పంజాబీ సాహిత్య పత్రిక 'నాగమణి'కి ఆమె 36 సంవత్సరాలపాటు సంపాదకురాలుగా వున్నారు. 1969లో పద్మశ్రీ, 2004లో పద్మవిభూషణ్ అవార్డు, 2004లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్ అందుకున్నారు. 1982లో జ్ఞానపీఠ పురస్కారం పొందారు. 'పంజాబ్ రత్న', పురస్కారం కూడా ఆమెకు లభించింది. చివరి సంవత్సరాలలో పాకిస్తాన్ పంజాబీ అకాడమీ పురస్కారం ఇవ్వగా 'చాల ఆలస్యంగా నా మాతృభూమి నన్ను గుర్తించింది' అని వ్యాఖ్యానించారు. 1986-92 సంవత్సరాలలో రాజ్యసభ సభ్యురాలిగా వున్నారు. 60 ఏళ్ళ కాలంలో వివిధ ప్రక్రియలలో 100 పుస్తకాలు రాశారు.

ఒక కాల్పనిక కవయిత్రిగా సాహిత్య వ్యాసంగం ప్రారంభించినా, ఆ తర్వాత అభ్యుదయ రచయితల ఉద్యమంలో పాలుపంచుకున్న ఫలితంగా, 1944లో 'లోక్‌పీడ్' ('ప్రజావేదన') అనే కవితాసంపుటి ప్రచురించారు. దానిలో ఆమె 1943 నాటి బెంగాల్ కరువు తర్వాత యుద్ధం మూలంగా అస్తవ్యస్తమైపోయిన ఆర్థికవ్యవస్థను నిశితంగా విమర్శించారు. దేశ విభజన ఫలితంగా జరిగిన మారణకాండకు చలించిపోయిన ఆమె, 1948లో కొడుకుతో పాటు ఢిల్లీ నుండి డెహ్రాడూన్‌కు ప్రయాణం చేసిన రోజున "వారిష్ షా! ఈనాడు నిన్ను పిలుస్తున్నాను" అనే గేయం రాశారు. వారిష్ షా 1722-1798 మధ్య జీవించిన ఒక పంజాబీ సూఫీ కవి. ఆయన రాసిన విషాదాంత ప్రేమగాథ 'హీర్ పంజా' పంజాబీ సాహిత్యంలో పేరెన్నికగలది. విభజన సృష్టించిన విషాదాన్ని ఉదహరిస్తూ ఆమె "నాడు ఒక పంజాబీ యువతి విషాదాన్ని గానం చేశావు. నేడు వేలాది పంజాబీ యువతులు విలపిస్తున్నారు. సమాధి నుండి లేచిరా! నేటి పంజాబ్‌లో శవాలు నిండిన పొలాలు చూడు, చీనాబ్ నదిలో రక్తం ప్రవహిస్తోంది. మన ఐదు నదుల్లో ఎవరో విషం కలిపారు. వారిష్‌షా! సమాధి నుండి లేచిరా! ఈ విషాదాన్ని వర్ణించు!" అంటూ ఆ కవిత సాగుతుంది. ఆమె రాసిన 'పింజార్' నవలను పంజాబీ నుంచి ఇంగ్లీషులోకి కుశ్వంత్‌సింగ్ 2009లో అనువదించారు.

తన 16వ ఏట వివాహం చేసుకున్న ప్రీతంసింగ్‌తో ఆమె 1960లో విడిపోయారు. కవి సాహిర్ లూధియాన్విని ప్రేమించారు. కాని ఆయన సుధామల్హోత్రాను వివాహమాడారు. సాహిర్‌ని తను ప్రేమించిన గాథ ఆమె తన స్వీయచరిత్ర 'రెవిన్యూ స్టాంప్' ('రసీద్ టికట్')లో చిత్రించారు. ఆ తర్వాత ఆమె చిత్రకారుడు, రచయిత అయిన ఇంద్రజిత్ ఇమ్రోజ్‌తో చివరి 40 ఏళ్ళు సహజీవనం చేశారు. ఆయన ఆమె పుస్తకాలన్నింటికీ ముఖచిత్రాలు వేసారు. తన చిత్రాలన్నిటిలో ఆమెను చిత్రించారు. వారి అనుబంధంపై "అమృతా ఇమ్రోజ్ - ఒక ప్రేమకథ" అనే పుస్తకం వచ్చింది.

దేశ విభజన సందర్భంగా పంజాబ్‌లో జరిగిన దురాగతాలు, మహిళలపై ప్రత్యేకంగా జరిగిన లైంగిక దాడులూ, మహిళలను ఎత్తుకుపోవడం, వారిని వివాహమాడటం, వారిని హింసించడం, కొందరు మహిళలు ఆత్మహత్యలు చేసుకోవడం మొదలైన దారుణ సంఘటనలన్నిటికీ అమృతా ప్రీతమ్ ప్రత్యక్ష సాక్షి. 28 ఏళ్ళ వయసులో గర్భిణిగా వున్న అమృత తన తండ్రి, భర్తతో లాహోరు నుండి న్యూఢిల్లీకి శరణార్థులుగా వచ్చారు. తాను చూచిన దృశ్యాలనూ, రెండు హిందూ - ముస్లిం కుటుంబాల మధ్య తగాదా - ఫలితంగా ఆ కుటుంబాలలోని మహిళలనుభవించిన కష్టనష్టాలనూ 'పింజార్' అనే నవలలో ఆమె రాసారు. ఈ నవలలోని కథ 1935-1947 మధ్య జరుగుతుంది. దేశ విభజన జరిగిన మూడేళ్ళకే 1950లోనే అమృత ఈ నవలను పంజాబీ భాష (గురుముఖి)లో రాశారు. ఆమె తన రచనలలో కొన్నిటిని హిందీలో కూడా రాశారు. వారి రచనలు తూర్పు యూరప్ దేశాల భాషలలోకీ, ఫ్రెంచి, జపనీస్, డేనిష్, మెహఫిల్, మాండరీన్ భాషలలోకి అనువాద మయ్యాయి. ఆమె పంజాబీలో నవలలు, కవితలు రాసిన మొదటి మహిళా రచయిత. పంజాబీ రచయితల్లో జ్ఞానపీఠం అందుకున్న మొదటి మహిళా రచయిత.

'పింజార్' అంటే అస్థిపంజరం అని అర్థం. ఇది దేశ విభజన కథావస్తువుగా వున్న నవల. దీనిలో హిందూ, ముస్లిం, సిక్కు మతాలకు చెందిన పాత్రలుంటాయి. పూరో అనే హిందూ యువతి కేంద్రంగా కథ నడుస్తుంది. ఆమెను బలవంతంగా రషీద్ అనే ముస్లిం యువకుడు

ఎత్తుకుపోతాడు. ఆమె మతం మారుస్తాడు. వివాహం చేసుకుంటాడు. ఆమె కలలన్నీ భగ్నం చేస్తాడు. ఆవిడ అనుభవాలన్నిటినీ పూసగుచ్చినట్లు నవలలో చిత్రించారు. దేశ విభజన కాలం ప్రజల హృదయాలలో, జీవితాలలో ప్రత్యేకించి మహిళలలో కారుచీకటి ఆవరించిన కాలం.

ఈ నవలలోని పూరో అనే యువతి వడ్డీ వ్యాపారుల కుటుంబానికి చెందినది. ఆమెకు ఒక ధనిక కుటుంబానికి చెందిన రామ్‌చంద్‌తో పెళ్ళి నిశ్చయమైంది. అది దేశ విభజన కాలం. రెండు మతాలకు చెందిన స్త్రీలపై లైంగికదాడులు, దురాగతాలు, అపహరణలు, మతమార్పిడి మొదలైన దారుణాలు విచ్చలవిడిగా సాగిన కాలం. ఈ నేపథ్యంలో ముస్లిం కుటుంబానికి చెందిన రషీద్ తాను ప్రేమించిన పూరోను అపహరించుకుపోతాడు. రామ్‌చంద్‌తో పెళ్ళి నిశ్చయమైన పూరో ఒకరోజు రామ్‌చంద్‌ను కలుసుకోడానికి పూరిబయట వేచివున్న సమయంలో రషీద్ ఆమెను బలవంతంగా ఎత్తుకుపోతాడు. రెండు తరాల క్రింద రషీద్ కుటుంబానికి చెందిన మహిళను తీసుకున్న అప్పు తీర్చలేకపోవడంతో పూరో కుటుంబానికి చెందిన అతను మూడు రోజులపాటు తీసుకుపోయి బంధిస్తాడు. దానికి ప్రతీకారంగా కూడా రషీద్, తను ప్రేమించిన పూరోను ఆనాటి అల్లర్ల నేపథ్యంలో తీసుకుపోతాడు. పూరోను మతం మార్చి, పేరు హమీదాగా మార్చి బలవంతంగా వివాహం చేసుకుంటాడు. పూరో కోసం రామ్‌చంద్, పూరో సోదరుడు త్రిలోక్ వెదుకుతారు కాని ఫలితం వుండదు. ఈలోగా పూరో ఎలాగో రషీద్ చెర నుండి తప్పించుకుని వచ్చేస్తుంది. కాని ఆమె తండ్రి ఆమెను కుటుంబంలోకి తీసుకోడానికి నిరాకరిస్తాడు. కొన్నాళ్ళు ముస్లిముల వద్ద వుండి తన పవిత్రత కోల్పోయినందుకు తండ్రి హిందూ సమాజానికి భయపడి, అటువంటి నిర్ణయం తీసుకుంటాడు. దానితో పూరో తన కర్మ ఇంతేననుకొని రషీద్ దగ్గరకు వెళ్తుంది. కాని తన లాగా ఇతర స్త్రీలు బాధపడకూడదనీ, వారికి చేతనైన సహాయం చేయాలనీ నిర్ణయించుకుంటుంది. మేనత్త వద్ద బాధపడుతున్న తల్లిలేని యువతి 'కమ్మో'కు భర్త తరిమివేయగా వేశ్యగా మారిన తారకు సహాయం చేస్తుంది. ఈలోగా రామ్‌చంద్ చెల్లెలు లజ్జో కూడా అపహరణకు గురవుతుంది. ఆమె పూరో సోదరుడు త్రిలోక్‌కు భార్య. అపుడు తన భర్త రషీద్ సహాయంతో లజ్జోను ముస్లిముల చెరనుండి రక్షిస్తుంది. ఇండియాకు తిరిగి వెళ్ళే అవకాశం వచ్చినా కూడా "ఇప్పుడు నా స్వస్థలం పాకిస్తాన్" అని పూరో ప్రకటిస్తుంది.

సమాజంలో వున్న పురుషాధిక్య స్వభావాన్ని రచయిత్రి ఈ నవలలో చిత్రించారు. పూరో తల్లికి, తన కూతురు పట్ల సానుకూలత వున్నా భర్త నిర్ణయాన్ని ప్రశ్నించదు. భర్త నిర్ణయాన్ని శిరసావహిస్తుంది. వాస్తవానికి దేశ విభజన అనేది భారతదేశాన్ని రెండు ముక్కలు చేయడమే కాదు – కొన్ని వేల కుటుంబాలను క్రూరంగా విడదీసింది. పూరోకు కూడా తన కుటుంబం నుంచేకాక, దేశం నుండి కూడా విడిపోయిన పరిస్థితి ఏర్పడింది. నవలలో మతసంస్థలపై విమర్శనాత్మక విశ్లేషణ వుంది. మతం పేరుతో ప్రజల భావోద్వేగాలను నిర్లక్ష్యం చేయడం చిత్రవిచిత్ర మైంది. ఒక మతిస్థిమితం లేని హిందూ యువతిపై ముస్లిములు లైంగికదాడి జరపగా ఆమె గర్భందాల్చి పిల్లవాడిని కంటే, పూరో ఆ పిల్లవాడిని పెంచడానికి నిర్ణయం తీసుకుంటుంది. అయితే ఆ పిల్లవాడి తల్లి హిందూ గనుక ముస్లిం మతం స్వీకరించిన పూరో పెంచగూడదని, పూరో నుంచి ఆ శిశువును వేరు చేస్తారు. ఆ సమయంలో పూరో ఆక్రందన – దేశ విభజన సందర్భంగా అశేష ప్రజల ఆక్రందనలతో పోల్చి చిత్రించారు.

నవలలో హిందూ సమాజపు ఆచారాలు, సంప్రదాయాలు చిత్రించారు. పూరోకి తమ్ముడు పుట్టినపుడు సంప్రదాయాల ప్రకారం జరిగే తంతునూ, పాడే పాటలను చిత్రించారు. అలాగే పూరో వివాహానికి చేసిన ఏర్పాట్లు – స్నేహితురాళ్ళ ఇకఇకలూ, పకపకలూ, ఏడ్పించటాలూ, తన కూతురు దూరమైపోతుందని పూరో తల్లి విచారించడం మొదలైనవి నవలలో రచయిత చిత్రించారు.

పూరో, హమీదాగా మారిన తర్వాత ఆమె రెండు ప్రపంచాలలో జీవిస్తుంది. ఒకటి పగలు హమీదాగా, రెండోది రాత్రిపూట కలల్లో పూరోగా, ఆ కలల్లో ఆమె తన పాత స్నేహితురాళ్ళతో ఆడిన ఆటలు, మొదలైనవి కంటుంది. నిద్రలేస్తే హమీదా ఐపోతుంది. కూతురుగా, అక్కగా, భార్యగా, తల్లిగా పూరో పాత్ర చిత్రణ చూస్తాం.

శరణార్థుల శిబిరాలలో అస్తవ్యస్థ నిర్వహణ గురించి నవలలో ప్రస్తావన వుంది. ఈ శిబిరాలకు మిలటరీవారు కాపలా వున్నా కూడా హిందూ శిబిరాల్లోకి ముస్లిం గూండాలు ప్రవేశించి మహిళలను ఎత్తుకుపోయి, తెల్లవారిన తర్వాత వారిని శిబిరాలలో వదలి వెళ్ళేవారు. ఆనాడు చెలరేగిన అల్లర్ల ఫలితంగా ఎందరో మహిళలు అవమానాలను భరించలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. కొందరైతే బావుల్లోకి దూకి చనిపోయారు.

పంజాబీ (గురుముఖి) భాషలో రాసిన ఈ నవలకు హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, గుజరాతీ, సింధీ అనువాదాలు వచ్చాయి. పంజాబీ, హిందీ భాషల్లో ఈ నవల చలనచిత్రంగా అదే పేరుతో 2003 అగస్టు 31న విడుదలైంది. దీనికి దర్శకుడు, స్క్రీన్‌ప్లే రచయిత చంద్రప్రకాశ్ ద్వివేది. ఊర్మిళా మంటోద్కర్, మనోజ్ బాజ్‌పేయి, సంజయ్ సూరి ప్రధాన పాత్రలు పోషించారు. జాతీయ సమైక్యతపై ఉత్తమ కథాత్మక చిత్రంగా అవార్డు అందుకొంది. దీనికి సంభాషణలు, 6 గీతాలు గుల్జార్ రాశారు. అమృతా ప్రీతమ్ రెండు గేయాలు, జెహ్రా నిగాహ్ ఒక గీతం మొత్తం 9 గీతాలు ఈ సినిమాలో వున్నాయి. ఇది ఆ తర్వాత టీ.వీ. సీరియల్‌గా కూడా వచ్చింది.

ఈ నవలను ఘూఘి (Ghughi) పేరుతో ఇక్బాల్ హుస్సేన్ దర్శకుడుగా నాటకీకరించారు కూడా. టీవీ పాకిస్తాన్‌లో సీరియల్‌గా 2018లో ప్రసారమైంది.

**వచ్చేసంచికలో – భాస్వతీ ఘోష్ 'విక్టరీ కాలనీ' (1950);**
**అనీశ్ కిద్వాయ్ 'ఇన్ ది షాడో ఆఫ్ ఫ్రీడం' (1949)**

"ఒక్క బానిసున్నా ఈ లోకానికి ముక్తిలేదు
పిడికిలెత్తి జగత్తును పిండికొట్టవేమిరా!" **- అనిసెట్టి**

**పుస్తక పరిచయం**

## ప్రజల పోరాట చరిత్రను రికార్డ్ చేసిన

# 'కృష్ణా జిల్లా జమీందారులు - రైతాంగ పోరాటాలు'

- ఐ.టీ.ఆర్.వి.శివాజీరావు



**కృష్ణాజిల్లా** రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో వివిధ స్థాయిల్లో పనిచేసి డిప్యూటీ కలెక్టర్‌గా పదవీ విరమణ చేసిన మొహమ్మద్ సిలార్ తాను సుదీర్ఘకాలం పనిచేసిన కృష్ణాజిల్లా చరిత్ర మీద మక్కువతోనూ, ఉద్యోగరీత్యా ఆ జిల్లాలోని ప్రాంతాలు విస్తృతంగా తిరిగిఉండటం చేతనూ "కృష్ణాజిల్లా జమీందారులు – రైతాంగ పోరాటాలు"ను సమర్థవంతంగా గ్రంథస్థం చేయగలిగారు. ఈ గ్రంథ రచనకు వారు పనిచేస్తున్న రెవెన్యూ విభాగం కూడా దోహదపడింది. ఆయా జమీలకు సంబంధించిన రెవెన్యూ రికార్డ్స్, కైఫీయత్తులు వంటివి పరిశీలించడానికే కాకుండా ఆ ప్రాంతాలను స్వయంగా తిరిగి చూడడానికి కూడా వారికి అవకాశం లభించింది.

సిలార్‌కి చరిత్ర అంటే ముఖ్యంగా బందరు, కృష్ణాజిల్లాల చరిత్ర అంటే అమితమైన ప్రేమాశక్తులు వున్నాయి గనుకనే వృత్తికి సంబంధించిన పనుల్లో తలమునకలు అవుతూనే మరోపక్క ఆయా ప్రాంతాల చరిత్రను గ్రంథస్థం చేసే బృహత్కార్యాన్ని తలకెత్తుకున్నారు.

ఈ గ్రంథ రచనకు పూర్వమే 'తరతరాల బందరు చరిత్ర', 'మచిలీపట్నం సర్వస్వం', 'కృష్ణాజిల్లా చరిత్ర', 'దివిసీమ సర్వస్వం' వంటి గ్రంథాలను వీరు ప్రచురించారు. ముఖ్యంగా 'ఈ రచనకు ప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ, విజయవాడ – అమరావతి కల్చరల్ సెంటర్ సిఈఓ, ఆర్కియాలజిస్ట్ ఈమని శివనాగిరెడ్డి సూచనలు కారణం' అని సిలార్ తన ముందుమాటలో తెలియజేశారు. ఏదైతేనేమి! తరతరాల కృష్ణాజిల్లాలోని జమీందారుల చరిత్ర, ప్రజా పోరాటాల చరిత్ర ఒకచోట గుదిగుచ్చి అందించబడింది.

భౌగోళికంగా కృష్ణాజిల్లా యొక్క స్థానం ఆ ప్రాంతాన్ని చాలా కీలకంగా మార్చింది. ఇటు ఆంధ్రా ప్రాంతానికి అటు నైజాం సర్కారుకు నడిబొడ్డున వుండడం వలన ఆ ప్రాంతం ప్రాముఖ్యతను సంతరించుకుంది. నైజాంలో జరిగిన కమ్యూనిస్ట్ ఉద్యమానికి తన తోడ్పాటును అందించడమే కాక, ఆ ప్రాంతంలో నిర్బంధాలు ఎదురైనపుడు ఉద్యమకారులను రక్షించుకోవటానికి వీలైన ప్రాంతంగా కూడా ఉపయోగపడింది. అంతేకాక తెలంగాణా ఉద్యమాన్ని రగిలించడానికి అవసరమైన నిప్పు పుల్లల్లా కృష్ణాజిల్లాలోని మునగాల, పరిటాల జమీ ప్రాంతాల్లో చెలరేగిన రైతాంగ ఉద్యమాలు, పోరాటాలు తోడ్పడ్డాయి.

★ ★ ★ ★ ★

బ్రిటిష్ ఏలుబడి కిందనున్న భారతదేశం రెండు భాగాలుగా వుండేది. ఒకటి విదేశీ పరిపాలన కింద వున్న బ్రిటిష్ ఇండియా, రెండు స్థానిక రాజుల పరిపాలనలో వున్న సంస్థానాలు. స్థానిక రాజుల పరిపాలనలో వున్న సంస్థానాలలో వాళ్ళు కప్పం చెల్లిస్తున్నంత వరకూ, తమ ఆధిపత్యానికి ఇబ్బంది లేనంతవరకూ బ్రిటీష్‌వారి జోక్యం నామమాత్రంగానే వుండేది. రాజుల పరిపాలనలో ప్రజలు ఎన్ని ఇక్కట్లు పడినా వారికేమీ సంబంధం వుండేదికాదు. సిలార్ ఈ పుస్తకంలో వివరించినట్లు బ్రిటిష్ జమానాలోకన్నా రాజుల పరిపాలనలో ప్రజలు చెప్పరాని బాధలు పడేవారు. బ్రిటిష్ పరిపాలన కింద వున్న ప్రజలకు అణిచివేత వున్నప్పటికీ కొంత వెసులుబాటు వుండేది.

ఇక తమ ఏలుబడిలో ఉన్న ప్రాంతాలలో పరిపాలనా సౌలభ్యం కోసం, పన్నుల వసూళ్ల కోసం బ్రిటీష్‌వారికి ప్రజల్లో పలుకుబడి గలిగిన వ్యక్తులు అవసరం అయ్యారు. అందుకోసం ప్రజలకూ తమకూ వారధిగా వుండే జమీందారీవర్గాన్ని బ్రిటీష్ ప్రభుత్వం తయారు చేసుకుంది. జమీందారు బ్రిటిష్ ప్రభుత్వానికి పన్నులు వసూళ్లు చేసి పెట్టే ఏజెంట్‌గా వుండి ఆ వసూళ్లలో రెండు వంతులు పైకి పంపించి ఒక వంతు తను తీసుకోవాలి. కానీ ఈ జమీందారులు ప్రజల్ని పీడించి వాళ్ళ రక్తం తాగేవారు. బ్రిటీష్ నిర్దేశించిన పేష్కస్‌కన్నా అనేక రెట్లు ఎక్కువ వసూలు చేసేవారు. బ్రిటీష్‌వారికి చెల్లించవలసినది చెల్లించి, మిగిలిన అధిక మొత్తం వసూలు సొమ్ముతో తమ బొక్కసాలు నింపుకునేవారు. విలాస జీవితం గడిపేవారు.

ఒకప్పుడు ఊరుమ్మడి ఆస్తిగా పరిగణించబడిన భూమిని శిస్తుల ద్వారా తమ ఆదాయం పెంచుకోవడం కోసం బ్రిటిష్ ప్రభుత్వం స్వంత ఆస్తిగా మార్చింది. భూమిని రైతు అమ్ముకోవచ్చు, బదిలీ చేసుకోవచ్చు లేదా తాకట్టు పెట్టుకోవచ్చు. దానితో తమ ఆదాయం పెంచుకోవడం కోసం బ్రిటిష్ ప్రభుత్వం భూమిని వ్యక్తిగత ఆస్తిగా మార్చి పన్నుల వసూళ్ల కొరకు జమీందారీ వ్యవస్థను ఏర్పాటుచేస్తే, జమీందారు ప్రభుత్వం నిర్దేశించిన పన్నులే కాక అనేక రకాలైన ఇతర పన్నులు వసూలు చేసి రైతును పీల్చి పిప్పిని చేసేవాడు.

బ్రిటీష్ రాజు రైతు తల గుడ్డ లాక్కుంటే జమీందారు మొలగుడ్డని కూడా లాక్కొని రైతుని దిశ మొలతో నిలబెట్టేవాడు.

ఈ గ్రంథ రచయిత చెప్పినట్టుగా జమీందారు ఇచ్చే నజరానాలకు ఆశపడి అతడ్ని ఇంద్రుడు చంద్రుడు అని కీర్తించిన కవులు రచయితలు వున్నారుకానీ ఆనాటి రైతు కడగండ్లను రికార్డ్ చేసిన వాళ్ళెవరూ లేరు. రైతాంగ తిరుగుబాట్లు పోరాటాల చరిత్ర తగిన విధంగా గ్రంథస్థం చేయబడలేదు. కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావం తర్వాతే ఆ ప్రయత్నం కొంత జరిగింది.

అందుకే ఈ పుస్తకంలో జమీందారుల చరిత్ర కొంత క్రానలాజికల్ క్రమంలో జమీల వారీగా లభ్యం అయిందిగానీ రైతాంగ పోరాటాల

రికార్డ్ అంత క్రమపద్ధతిలో దొరకదు. దీనికి కారణం రచయిత కాదు. రచయితకి దొరికిన సమాచారం ఆ మేరకే వుందని అర్థం చేసుకోవాలి. రచయిత జమీందారుల చరిత్రని సమగ్రంగా ఇవ్వడానికి ప్రయత్నం చేస్తూనే తాను నమ్మిన "పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప" అన్న సిద్ధాంతానికి అనుగుణంగా ఆనాటి పేద ప్రజల రైతుల పక్షపాతిగా వారి కడగండ్లను, వాటి నుంచి ఉవ్వెత్తున లేచిన పోరాటాల చరిత్రను అందించడానికి సాధ్యమైనంతవరకూ ప్రయత్నించారు.

ఈ పోరాటాలు, తిరుగుబాట్లు ఒక్క రోజులో వచ్చినవి కాదు. జమీందారులు, వారికింద వున్న కరణాలు, పెత్తందార్లు ప్రజల్ని అనేక రకాలుగా పీడించి వాళ్ళ ధన మాన ప్రాణాలను హరించిన ఫలితంగా ఈ రైతాంగ పోరాటాలు పెల్లుబికాయి. జమీందార్లు రైతులు పండించిన పంట పైనే కాక వారి పశువులను మేపుకొన్నందుకు గ్రాసం పన్ను, అడవిలో పుల్లలు ఏరుకున్నందుకు పుల్లరి ఇంకా చెప్పాలంటే శుభకార్యాలు చేసుకున్నందుకు, పెళ్ళిళ్ళు చేసుకున్నందుకు కూడా పన్నులు విధించేవాడు. ప్రజలు విధిగా కట్టాల్సి వచ్చేది.

అంతేకాక జమిందారు, కరణాలను లొంగదీసుకుని పూరుమ్మడి భూములు, బంజర్లను తన పేరున రికార్డుల్లోకి ఎక్కించుకునేవాడు. ఆ భూముల్లోకి వెళ్లిన పశువులను బందెల దొడ్లలో కట్టేసి, వాటిని విడిపించుకొనేందుకు పన్ను విధించేవాడు. పైగా ముందు తన పొలంలో మూడు నాలుగు తడుపులు పూర్తి అయ్యాకే రైతుల పొలంలోకి నీరు విడుదల చేసేవారు. రైతులు ముందుగా అరకలు కట్టుకొచ్చి జమీందారు పొలం దున్నిన తర్వాతే తమ పొలాలు దున్నుకోవాల్సి వచ్చేది. దానితో రైతులు పంటలు వేసుకోవటానికి అదును దాటిపోయేది.

జమీందారు కుప్ప నూర్చాకే, ఆయనగారి పనులన్నీ చేసి పెట్టాకే తన పొలంలో రైతు పనులు చేసుకోవాలి. రైతు తన పంటను నూర్చుకున్నా ఆ గింజలు జమీందారు మనుషులు వచ్చి పన్ను నిర్ణయం జరిగేవరకూ వాటి మీద చెయ్యి వెయ్యకూడదు. ఈలోగా రైతు, అతను భార్యా బిడ్డలు ఆకలితో మలమల మాడాల్సిందే. ఆకలికి పిల్లలు తాళలేకపోతుంటే వాళ్ల కడుపులు నింపే దారిలేక, రైతు ఏ రాత్రిపూటో తమ పశువుల్ని ఆ కుప్పల మీదకి తోలించి, అవి తినివేసిన పేడలో అరగకుండా ఉన్న గింజలతో అంబలో, సంకటో కాచుకొని తినేవాడంటే ఆనాటి రైతు పరిస్థితి ఎంత దుర్భరంగా వుందో మనకి అర్థం అవుతుంది.

తమ ఇళ్ళపై కప్పుకొనేందుకు చెరువుల్లో ప్రకృతి సహజంగా మొలిచే గడ్డిని కూడా చల్లపల్లి జమీందారు కోయనిచ్చేవాడు కాదట. ఆ గడ్డికి ఇంత రేటు అని నిర్ణయించి రైతుల దగ్గర వసూలు చేసేవారట.

జమీందారుల దాష్టీకానికి ఉదాహరణగా లంక భూముల గురించి చెబుతారు రచయిత. ఒక్కోసారి వరదలు వచ్చినపుడు లంక భూములు మునిగిపోతాయి. అయినప్పటికీ వాటికి యధావిధిగా రైతుల దగ్గర జమీందారులు శిస్తు వసూలు చేసేవారట. ఒక్కోసారి వరదల్లో కొత్త లంకలు తేలుతాయి, అటువంటప్పుడు ఆ భూమిని జమీందారు స్వాధీనం చేసుకుంటాడు. రైతుకు ఏ హక్కు లేదంటాడు. "మునిగిన లంకలు ఏటిపాలు తేలిన లంకలు కోటపాలు" అనే సామెత ఈ విధంగానే పుట్టిందంటారు రచయిత.

రైతులు ఏమాత్రం ప్రశ్నించినా, తిరగబడినా జమీందార్ల వద్ద ఫ్యూన్‌లు అని పిలవబడే గూండాలు ఆ రైతుల్ని చావ చితగ్గొడతారు. పన్నులు కట్టని రైతులకు బండ కొయ్యలు మెడకు బిగించడం, చిల్లపెంకుల మధ్య పెట్టి చెవులను గట్టిగా నొక్కడం, వీపుపై బండలు ఎత్తి రోజంతా ఎండలో తిప్పడం వంటి శిక్షలు వేసేవారట.

★ ★ ★ ★ ★

రచయిత విస్తృతంగా పరిశోధించి కృష్ణాజిల్లాలో ఆనాటి జమీలైన దేవరకోట మొదలుకొని, బందరు నవాబులు, నూజివీడు, వల్లూరు, మైలవరం, బెజవాడ, విస్సన్నపేట, వాసిరెడ్డి, వెల్లంకి, చిక్కవరం, పరిటాల, మునగాల చరిత్రలను తనకు లభ్యమైన మేర కైఫీయత్తులు, చారిత్రక పత్రాలు, భౌతికంగా ఆయా ప్రాంతాలు తిరిగి ఆ జమీలలో మిగిలి వున్న వారసులను కలిసి ఇంటర్వ్యూ చేసి, వారి దగ్గర వున్న వారి వంశ చరిత్రలను పరిశీలించి రికార్డ్ చేశారు. జమీందారుల చరిత్ర మాత్రమే అయితే ఇదంతా వృధా ప్రయాసగా మిగిలిపోయేది.

"ఆ రాణీ ప్రేమ పురాణం
ఈ ముట్టడికైన ఖర్చులు
కైఫీయతులు మతలబులు
ఇవి కావోయ్ చరిత్రకర్థం" అని శ్రీశ్రీ అన్నట్టు కృష్ణాజిల్లా జమీలన్నీ మిగిలిన జమీల్లాగానే దాయాదుల పోరుతోనూ, వారసత్వపు కొట్లాటలతోనూ, కోర్టు వ్యాజ్యాలతోనూ నిండిపోయి వున్నాయి. కానీ రచయిత ఈ చరిత్రనంతా ప్రజాపక్షపాతిగానే ఈ పుస్తకంలో రికార్డ్ చేశారు.

ఈ జమీందారుల్లో చాలామంది అసమర్థులుగానూ, వ్యవహార దక్షత లేనివారుగానూ కనిపిస్తారు. ఇందుకు కారణాలు కూడా చరిత్రకారుల మాటల్లో వివరిస్తారు రచయిత. వాళ్ళు చిన్నప్పటినుంచి ఒక అహంకార పూరిత వాతారణంలో పెరగడం వలన వారిలో ఎక్కువ మందికి ప్రజలన్నా ప్రజా జీవితం అన్నా ఏమీ లెక్క వుండదు. పైగా యుక్త వయసుకు వచ్చేసరికి అన్ని రకాల చెడు అలవాట్లు వుండడం వలన ఎక్కువమంది నిస్సంతులుగా మిగిలిపోయి, ఆ జమీని దాయాదుల పరం గావించడమో లేదా దాయాదుల పిల్లల్ని దత్తత తీసుకొని ఆ దత్తుల్ని పట్టాభిషిక్తులను గావించడమో జరిగేది.

చాలామంది జమీందారులు కవుల్ని, కళాకారులని పోషించారు. వారిలో స్వయంగా రచయితలు, కవులు కూడా వున్నారు. ఏదిఏమైనా జమీందారులు చాలామంది ప్రజాకంటకులుగానే వున్నారు. చాలా తక్కువమంది మాత్రమే తమకు వసూలు అయిన పన్నుల సొమ్ముని వ్యవసాయ కాలువల వంటివి తవ్వించటం, విద్యాలయాలు నెలకొల్పటం, రైతుల, ప్రజల శ్రేయస్సు కోసం ఆలోచించినట్లుగా చరిత్రలో కనబడు తుంది. జమీందారులు తమ సమయాన్ని, డబ్బును ఎక్కువగా దాయాదుల కోర్టు గొడవల్లో వృధా చేసుకోవడం కనిపిస్తుంది. స్థానిక కోర్టుల నుండి లండన్ ప్రివీ కౌన్సెల్ వరకు వెళ్లిన సందర్భాలు అనేకం ఈ పుస్తకంలో కనిపిస్తాయి.

భారతీయ రాజుల పరిపాలనలో, బ్రిటిష్ పరిపాలన క్రింద వున్న జమీందారీల్లో బ్రిటీష్ ప్రభువుల భిన్న వైఖరి ఒకటి స్పష్టంగా కనిపిస్తుంది. అదేమిటంటే సంస్థానాలలో ఒకవేళ రాజు వారసులు లేకుండా మరణిస్తే రాణీ ఎవరినైనా దత్తత తీసుకొని పరిపాలించడానికి బ్రిటీష్ ప్రభుత్వం సాధారణంగా అంగీకరించదు. ఆ సంస్థానం ఆటోమేటిగ్గా బ్రిటిష్ ఇండియా ఏలుబడిలోకి వెళ్ళిపోయేది.

కానీ తమకింద వున్న జమీల్లో జమీందారు నిస్సంతుగా మరణిస్తే దత్తత పుత్రుడిని వారసుడిని చెయ్యడానికి, లేదా ఆ జమీందారు భార్య జమీని పరిపాలించడానికి బ్రిటిష్ రాజు అంగీకరించడం కనిపిస్తుంది.

ఒకరిద్దరు జమీందారులు ప్రభుత్వం మీద తిరుగుబాటు చేసినా వాళ్ళను క్షమించి తిరిగి జమీందారీ బాధ్యతలు అప్పగించడం మనకు ఆశ్చర్యం గొలుపుతుంది.

జమీందారులు తమ వర్గ ప్రయోజనాలకు అనుగుణంగా వలస ప్రభువులకు అనుకూలమైన జస్టిస్ పార్టీని స్థాపించి తెల్లదొరల పట్ల తమ విధేయత చాటుకున్నారు. అందుకు ప్రతిగా తెల్లదొరలు జమీల పరిపాలనా వ్యవహారాల్లో ఎక్కువగా జోక్యం కలిగించుకొనేవారు కాదు. జమీల్లో తీవ్రమైన భూస్వామ్య వ్యవస్థ అమలులో వుండడం వలన సతీ సహగమనం వంటి మూఢ ఆచారాలు పాటించేవారు. అయినా బ్రిటీష్ ప్రభుత్వం ఇటువంటి దురాచారాలను ఆపడానికి ప్రయత్నించినట్టు గానీ, వాటిని నిషేధించినట్టు గానీ కనపడదు. స్థానిక భూస్వామ్య వ్యవస్థతో కుమ్మక్కు అయితే తప్ప జరగబోయే వర్గ పరిణామాన్ని, కలగబోయే వర్గ చైతన్యాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదని అప్పటికే ప్రపంచ వ్యాప్తంగా విజయవంతమైన విప్లవాల నుంచి సామ్రాజ్యవాదులు గుణపాఠాలు తీశారు.

అందుకే బ్రిటీష్ సామ్రాజ్యవాదులు, ఒక పథకం ప్రకారం స్థానిక భూస్వామ్య వ్యవస్థను పెంచి పోషించి తమ మద్దతు దారుగా వుంచుకొని దానినుండి పొందాల్సిన లబ్దిని పొందారు. ప్రజలు ఏమైపోయినా జమీందారు పన్నుల పేరిట రైతులను, ప్రజలను ఎంతగా పీల్చి పిప్పి చేసినా వారికి పట్టలేదు. వాళ్లకు చెల్లించాల్సిన పేష్కస్ చెల్లించనప్పుడు మాత్రమే ఆ జమీందారుని తప్పించి, ఆ జమీని వేలం వేసి మరో జమీందారుకి అప్పగించేవారు.

★ ★ ★ ★ ★

1934లో ఆంధ్రాలో కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావం జరిగింది. కష్టజీవులకు, కష్టజీవులు చేసే పోరాటాలకు ఒక అండ దొరికింది. పోరాటాలకు ఒక దిశ దశ ఏర్పడింది. పోరాట ఉధృతి పెరిగింది. ఎర్రజెండా నీడలో రైతులు, రైతుకూలీలు చైతన్యవంతం కావడం ప్రారంభించారు. సహజంగానే జమీందారులకు ఇది కంటగింపు అయ్యింది. అప్పటినుంచీ ఎదురు కాల్పుల ప్రహసనం మొదలయ్యింది. ఎందరో కమ్యూనిస్ట్ కార్యకర్తలను, ప్రజలను బూటకపు ఎన్కౌంటర్‌లలో కాల్చి చంపించారు. అయినా పోరాటం బలపడిందేగానీ బలహీనపడలేదు.

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో కృష్ణాజిల్లా అద్వితీయమైన పాత్ర పోషించింది. ఎందరో కార్యకర్తలు కృష్ణాజిల్లా నుంచి వెళ్లి ఆ పోరాటంలో పాల్గొన్నారు. ఆ ప్రాంతాల్లో తీవ్ర నిర్బంధం అమలైనపుడు వారికి వెన్నుదన్నుగా ఉపయోగపడ్డమే కాకుండా మునగాల, పరిటాల ప్రజలు ఆ పోరాట యోధులను కడుపులో పెట్టుకొని చూసుకున్నారు. ఎంతోమంది అక్కడి రజాకార్ల దుర్మార్గాలను, చిత్రహింసలను తప్పించుకోవడానికి కృష్ణా జిల్లాలోకి వచ్చేసేవారు.

ఇంకో ఆశ్చర్యకరమైన విషయం, స్వాతంత్ర్యం రాకముందు మునగాల, పరిటాల ప్రాంతాలు స్వతంత్ర రిపబ్లిక్‌లుగా ఏర్పడటం! ఆయా ప్రాంతాలు కమ్యూనిస్ట్ కార్యకర్తల ఆధ్వర్యంలో స్వంత రాజ్యాంగం తయారు చేసుకొని, వెట్టిచాకిరీ వంటివి రద్దు చేసుకొని అసలయిన ప్రజాస్వామ్యాన్ని కొంత కాలం అనుభవించారు. 1947లో భారతదేశానికి స్వతంత్రం రాగానే ఆ రిపబ్లిక్‌లను స్వచ్ఛందంగా భారత్‌లో విలీనం చేశారు.

ఈ సందర్భంగా జమీందారీ వ్యతిరేక పోరాటాల సమయంలో కాంగ్రెస్ పోషించిన పాత్రను తప్పక ప్రస్తావించుకోవాలి. బీద, బిక్కి జనం, జమీందారుల దుర్మార్గాలకు బలైపోతున్నా, యమబాధలు పడుతున్నా జమీందారుల కొమ్ముకాయడం దాని వర్గస్వభావాన్ని తెలియజేస్తుంది. 1948లో ప్రకాశం అవార్డ్‌పేరిట వందలాది కమ్యూనిస్ట్ కార్యకర్తలను విచారణ లేకుండానే అరెస్ట్‌చేసి మరెంతో మందిని కాల్చి చంపారు.

స్వతంత్రం రాగానే చల్లపల్లి జమిందారు సూటు బూటు విప్పేసి ఖద్దరు బట్టల్లోకి మారిపోయాడట. అంతేకాక కాంగ్రెస్ గవర్నమెంట్‌లో మంత్రిగా చేరి తన ప్రయోజనాలు కాపాడుకున్నాడు. ఎస్టేట్స్ రద్దు అయినా జమీందారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తీసుకున్న భూములకు కోట్ల రూపాయల పరిహారం,వందల ఎకరాలు ఓన్ ఫార్మ్ లాండ్స్ పేరిట వారి వద్దే ఉంచుకునే ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అదే సమయంలో భూములు పంచుకొని గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేసుకున్న తెలంగాణా ప్రజలను, కమ్యూనిస్ట్ కార్యకర్తలను పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసింది యూనియన్ సైన్యం.

జమీందారు వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు అమరావతిలో తన కోట కట్టుకోవడం కోసం భూమిలో నిక్షిప్తమైన ధరణి కోట ఇటుకలను తవ్వి, పాలరాతి శిల్పాలను పొడి చేయించి సున్నం తయారు చేయించడానికి వాడుకోవడం గురించి చదువుతుంటే గుండెను మెలి పెట్టినట్టు అవుతుంది. మెకంజీ దొర అడ్డుకోకపోతే ఆ చారిత్రక ఆధారాలు మనకి మిగిలి వుండేవి కాదు.

చివరగా సిలార్ ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి రాసిన ఈ పుస్తకం ఎందుకు చదవాలంటే ఆ నాటి జమీందారులను మరిపించే ఆధునిక జమీందారులు ప్రజల్ని బానిసలను గావించి ఇపుడు రాజ్యాలు ఏలుతున్నారు. దేశ వనరులను, భూములను, అడవులను మింగేస్తున్నారు. కాకపోతే ఆనాటి జమీందారుల్లా కాకుండా ముసుగులు వేసుకొని రూపాలు మార్చుకొన్నారు. తమ పులి చారలు కనబడకుండా మేక తోళ్లు, ఆవు తోళ్లు కప్పుకున్నారు. ప్రజలపై పీడన పోలేదు నాజూకు రూపం ధరించిందంతే. ఆనాటి పోరాట పద్దతులు అధ్యయనం చేస్తే ఈనాటి పోరాటాలను ఎలా రూపొందించుకోవాలో అర్థం అవుతుంది.

"చరిత్ర పునరావృతం అవుతుంది.కాకపోతే ఈ సారి మరింత వ్యంగ్యంగా" – మార్క్స్

'కృష్ణాజిల్లా జమీందారులు – రైతాంగ పోరాటాలు' అనే చారిత్రక గ్రంథాన్ని ప్రజల కోణంలో రికార్డ్ చేసిన సిలార్ అభినందనీయులు. ●

**'కృష్ణాజిల్లా జమీందారులు - రైతాంగ పోరాటాలు'**

దొరుకుచోటు : **మహమ్మద్ సిలార్, 20/620, లక్ష్మణరావుపురం, చిలకలపూడి (పోస్ట్), మచిలీపట్నం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.**

**ఫోన్ : 99855 64946**

స్పందన

# 75 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా మనదేశంలో మారని అర్ధఫ్యూడల్ వ్యవస్థ - పెచ్చరిల్లుతున్న తిరోగమన, అభివృద్ధి నిరోధక భావజాలం, సాంస్కృతిక ఆచరణలు

– జి.వి. భద్రం

**నేడు** మనం సమాచార సాంకేతికత అత్యున్నతంగా అభివృద్ధి చెందిన, 21వ శతాబ్దపు ఆధునికయుగంలో జీవిస్తున్నాము.

మనదేశంలో యిప్పుడు యించుమించుగా ప్రతిఒక్కరూ డిజిటల్ పరికరమైన మొబైల్‌ఫోన్లను విరివిగా వాడుతున్నారు. టి.వి.లను చూస్తున్నారు. ఎక్కువమంది లాప్‌టాప్‌లు, కంప్యూటర్లూ వాడుతున్నారు. అనేకమంది ఇంటర్నెట్ వాడుతున్నారు. సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్ లాంటి వాటి ద్వారా వివిధ అభిప్రాయాలను వ్యాప్తిచేస్తున్నారు.

గ్రామ ప్రాంతాలలోని ఉన్నత మధ్యతరగతి కుటుంబాలలో సైతం ఎలక్ట్రానిక్ పరికరాలైన వేక్యూమ్ క్లీనర్స్, మాపింగ్ (తడిగుడ్డతో నేలను శుభ్రపరిచే) పరికరాలను వాడుతున్నారు. వ్యవసాయరంగంలో విత్తు యంత్రాలూ, కోత యంత్రాలూ, గింజలను రాల్చే యంత్రాలు మొదలైనవి వాడుతున్నారు. వివిధ పనుల్లో జె.సి.బి. లాంటి భారీ ఎర్త్‌మూవింగ్ యంత్రాలను వాడుతున్నారు.

ప్రతిరోజూ కేబుల్‌టీవీలో ప్రసారమవుతున్న సీరియల్స్‌ను చూడటానికి అలవాటుపడ్డారు. స్విగ్గీ, జొమాటోల వంటి యాప్‌ల ద్వారా నచ్చిన వంటకాలను కొనుగోలు చేసుకోవటానికీ, ఆన్‌లైన్ షాపింగ్‌లకు, ఆన్‌లైన్ గేమింగ్‌లకూ అలవాటుపడ్డారు.

అయితే యీ రకంగా విరివిగా డిజిటల్ – ఎలక్ట్రానిక్ పరికరాలు, యంత్రాలు వాడటానికి అలవాటుపడిన మనదేశ ప్రజల భావజాలం, సాంస్కృతిక ఆచరణలు, జీవన వ్యవహారాలు యీ సాంకేతికాభివృద్ధికి అనుగుణంగా ఆధునికంగా వున్నాయా? ప్రగతిశీలమైనవిగా వున్నాయా అని పరిశీలించుకుంటే, అవి ఆధునికంగా కాక ఎక్కువ మేరకు మధ్య యుగాలనాటి ఫ్యూడల్ భావజాలంతోనూ, అభివృద్ధి నిరోధకంగానూ, పతనశీలంగానూ వున్నాయని దేశంలో జరుగుతున్న అనేక ఘటనలు, ఆచరణలూ తేటతెల్లం చేస్తున్నాయి. ఈ అభివృద్ధి నిరోధక భావజాలం, ఆచరణలు ప్రత్యేకించి గత 8 సంవత్సరాలుగా బి.జె.పి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరకాలంలో మరింతగా ప్రజలలో పెరిగిపోవటం చూస్తున్నాం.

ఇటీవలి కాలంలో జరిగిన – జరుగుతున్న కొన్ని ఘటనలు యీ అంశాన్ని రూఢి చేస్తున్నాయి.

ఇటీవలనే కేంద్ర హోంశాఖ దేశవ్యాపితంగా ఒక శాంపిల్ సర్వే నిర్వహించింది. ఈ శాంపిల్‌సర్వే – 2020 ప్రకారం దేశంలో బాల్యవివాహాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. పల్లెలు, పట్టణ ప్రాంతాలు అని తేడా లేకుండా సగటున 29.5% బాలికలకు 21 సం॥లు వయసు రాకుండానే వివాహాలు జరుగుతున్నాయి. అత్యధికంగా బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలలో 54 శాతంపైగా బాల్యవివాహాలు జరుగుతున్నాయి. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో కూడా బాల్యవివాహాల సంఖ్య ఏమీ తక్కువ కాదు. సామాజిక రుగ్మతగా ఎన్నడో గుర్తింపబడి, యిందుకు వ్యతిరేకంగా వీరేశలింగం, గురజాడ అప్పారావు, రాజారామమోహన్‌రాయ్ ప్రభృతులు జరిపిన సామాజిక ఉద్యమాల గురించి మనం ఎరిగున్నదే! శారదా బిల్లు, తదితర బాల్యవివాహ నిషేధాలు ఎన్ని వున్నా, యీ ఆధునిక యుగంలో కూడా బాల్యవివాహాలు పెరిగిపోతూ వుండటం అన్నది, మన సమాజం ఎంతగా తిరోగమిస్తోందో తెలియజేస్తోంది.

అక్టోబరు రెండవ వారంలో కర్నాటకలోని చిక్కమంగుళూరులో ఒక ప్లాంటేషన్ యజమాని, 16 మంది దళిత కూలీలను తనకు కట్టుబానిసలుగా పనిచేయటంలేదని 15 రోజులపాటు నిర్బంధించి చిత్రహింసలు పాలుజేసి, బలవంతంచేసిన వైనం మనం వార్తల ద్వారా తెలుసుకొన్నాం. వాస్తవానికి యీ రకమైన కట్టుబానిస విధానం క్వారీల్లో, యిటుక బట్టీల్లో వ్యవసాయ క్షేత్రాల్లో కొనసాగుతున్నట్లు పలువురు సామాజిక కార్యకర్తలద్వారానూ, వార్తలద్వారానూ వెల్లడి అవుతూనే వుంది. నూలు పరిశ్రమల్లోనూ, వస్త్రరంగ పరిశ్రమల్లోనూ అనేకమంది బాలికలను, యువతులను, ఆధునిక బానిసత్వ పద్ధతుల్లో కట్టుబానిసలుగా పనిచేయించుకొంటున్నట్లు, ప్రభుత్వసంస్థలు ఈ కట్టుబానిసలకు అప్పుడప్పుడు వారికి "విముక్తి"ని కల్పిస్తున్న బూటకాలను గురించి కూడా మనం తరచూ వింటూనే వున్నాం. మధ్యయుగాలనాటి ఫ్యూడల్ శ్రమదోపిడీని యీ కట్టుబానిస రూపంలో, నేటి ఆధునిక యుగంలో కూడా యధేచ్ఛగా జరగటాన్ని మనం చూస్తూనే వున్నాం. ఇది అభివృద్ధి నిరోధకమయిన, తిరోగమన పూర్వకమైన భావజాలానికి, ఆచరణకు సంబంధించిన విషయాలే అన్నది నిర్వివాదం.

ఇటీవలనే కేరళ రాష్ట్రంలోని ఒక గుడికి చెందిన కోనేటిలో ఒక "శాకాహారపు" మొసలి చనిపోయినట్టూ, ఆ చనిపోయిన మొసలి కళేబరానికి, భారీఎత్తున ఎంతో భక్తిప్రపత్తులతో హైందవ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాన్ని జరిపించినట్లూ మనం వార్తల ద్వారా తెలుసుకొన్నాం. ఇక మన రాష్ట్రానికి వస్తే దసరా పండుగల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఎంతో ఘనంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించటం, అందులో భాగంగా ధ్వజారోహణ సందర్భంగా "పవిత్రమైన" దర్భలతో అల్లిన చాప, ధ్వజాన్ని ఎగురవేసే తాడును ఎంతటి ఆచార బద్ధంగా తయారుచేస్తున్నారో మీడియా ప్రచారం చేసింది. విజయవాడ కనకదుర్గకు ప్రభుత్వం ఘనంగా సారెలు సమర్పించటం, భారీగా

కురిసే వానలను సైతం లక్ష్యపెట్టకుండా వేలమంది పేద, మధ్యతరగతి ప్రజలు సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చి 'భవానీ వ్రతాన్ని' (దీక్షను) చేబట్టడం వార్తలద్వారా తెల్సుకొంటున్నదే. మరోవైపు దేవరగట్టు, కర్నూలుజిల్లా ప్రజలు కర్రలతో కొట్టుకొని తలలు బద్దలుకొట్టుకొనే ఆట (బన్నీ ఉత్సవం)ను ఆడి గాయపడ్డ వార్తలను విన్నాం. వెంకటగిరిలో క్రీడాకారిణి సింధు ప్రారంభించిన, ఎం.ఎల్.ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజయవంతం'గా ముగించిన పోలేరమ్మ జాతర వివరాలనూ విన్నాం. యథాప్రకారం ఏటా జరిగే సిరిమానోత్సవంలో వందల వేలమంది పాల్గొన్న వివరాలనూ మనం విన్నాం. ఈ వివరాలన్నీ మన సమాజం యొక్క పురోగమనాన్ని ప్రగతిశీల భావజాలాన్నీ ప్రతిబింభిస్తున్నాయా లేక తిరోగమన, అభివృద్ధి నిరోధక సంస్కృతికీ సజీవ సంకేతాలుగా వున్నాయా అన్నది నిస్సందేహంగానే వెల్లడిచేస్తున్నాయి.

ఇవన్నీ ఒక ఎత్తైతే, సంపూర్ణ అక్షరాస్యత వున్న, విద్యాధికులైన ప్రజలు ఎక్కువమంది వుండి, చాలాకాలం నుండి వామపక్ష పాలనలో వుంటూ, 'పురోగామిగా' వుందని చెప్పబడుతున్న కేరళ రాష్ట్రంలో జరిగిన ఘటన మనదేశంలో అమలులో వున్న వ్యవస్థ యొక్క స్వభావాన్నీ తెలియ చేసింది. మనదేశంలో వ్రేళ్ళూనుకొని కొనసాగుతున్న, ఆచరింపబడుతున్న అభివృద్ధినిరోధక భావజాలానికీ, సంస్కృతికీ అద్దంపడుతూ, యీ ఫ్యూడల్ వ్యవస్థ యొక్క స్వభావాన్ని మరొకసారి ధృవపరుస్తోంది :

కేరళలోని ఎలనూర్ గ్రామంలో భగవాల్‌సింగ్ అనే 68 సంవత్సరాల ఆయుర్వేద మూలికావైద్యుడూ, అతడి భార్య కలసి అపారమైన ధనం లభిస్తుందన్న (మూఢ) నమ్మకంతో రోసవీ, పద్మ అనే యిరువురు స్త్రీలను నరబలి యిచ్చారు. విచిత్రం ఏమిటంటే, ఆ వైద్యుడికి వామపక్షవాదిగానూ, ప్రజామిత్రుడిగానూ తన గ్రామంలో పేరు ప్రఖ్యాతులున్నాయి. పైపెచ్చు ఆ వైద్యుడు ఒక మళయాళ కవిగా వున్నాడు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో మలయాళ హైకూ కవిత్వంపై ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించాడు. సి.పి.ఎం పార్టీ యొక్క అనుచరుడిగా వుంటూ, సోషల్ మీడియాలో, వామపక్ష నాయకులను గురించిన ప్రొఫైల్స్ (వ్యక్తిగత వివరాలను) పెట్టిన వ్యక్తిగా పేరొందినవాడు. అటువంటి వ్యక్తి, మూఢనమ్మకాలకి, విశ్వాసాలకి గుర్రై, ధనసంపాదనా దురాశతో యీ నరబలులను సాగించాడు. బలియిచ్చిన స్త్రీలను, సరఫరా చేసినందుకు అడ్వాన్సుగా అతడు 3 లక్షల రూపాయలను, మొహమ్మద్ షఫీ అనే నేరస్థుడికిచ్చాడు. ఈ వార్తను బట్టి చూస్తే విద్యావంతులైనా, వామపక్ష భావజాలాన్ని అంగీకరించినా, ఆచరణలో అభివృద్ధి నిరోధక తిరోగమన భావజాలానికీ, ధన దురాశకు, మూఢవిశ్వాసాలు, నమ్మకాలకూ గుర్రై ఎటువంటి ఆచరణలకు పాల్పడుతున్నారో అర్ధమవుతుంది. ఈ రకమైన మూఢవిశ్వాసాలకూ, ధన దురాశకూ పాల్పడటానికి మూలాలు మన సామాజిక వ్యవస్థలో వున్నాయన్న విషయాన్ని యీ ఘటన తేటతెల్లం చేస్తోంది. ఉపరితలానికి చెందిన ఈ భావజాల సాంస్కృతిక ఆచరణలకు పునాదిగా వున్నది దేశంలో నెలకొని వున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థేనన్నది తిరుగులేని సత్యంగా ఋజువవుతోంది.

దేశంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న చేతబడులు, చిల్లంగి, భూతవైద్యాలూ మాదిరిగానే కేరళ రాష్ట్రంలో కూడా "శత్రుసంహార పూజలు", 'ధనాకర్షణ యంత్రాల'ను (రక్ష రేకులను) యిళ్ళల్లోనూ, కార్యాలయాల్లో ప్రతిష్ఠించటాలు జరుగుతున్నట్లు యీ ఘటన (నరబలి) సందర్భంగా అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రత్యేకించి ఇదుక్కి జిల్లాలో క్షుద్ర విద్యలైన బాణామతి, చేతబడులు మంత్రగత్తెల ద్వారా చాలాకాలం నుండే నిర్వహిస్తున్నారని అధికారులు వెల్లడి చేస్తున్నారు. వాస్తవానికి యిటువంటి మూఢాచారాలూ, మూఢవిశ్వాసాలతోకూడిన క్షుద్ర కార్యకలాపాలు దేశమంతటా అన్ని రాష్ట్రాలలోనూ ఆచరింపబడుతూనే వున్నాయి. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో ప్రకారం ఒక్క జార్ఖండ్ రాష్ట్రంలోనే మంత్రాల నెపంతో 2015లో 32; 2018లో 18; 2019-2020ల్లో 15 మంది చొప్పున హత్యకు గురయ్యినట్లు వెల్లడి అవుతోంది. వాస్తవానికి యిటువంటి ఘటనలు రికార్డులోకి నమోదు చేయబడటం అరుదుగా జరుగుతోంది. అధికారిక లెక్కలకన్నా యిటువంటి దురాచారాలు ఎన్నోరెట్లు ఎక్కువగా, అనునిత్యం జరుగుతూ వున్నాయి.

కర్నాటక, మహారాష్ట్రలలో మూఢాచార, మూఢనమ్మకాల నిరోధక చట్టాల లాంటివి వున్నప్పటికీ, యివి యథాప్రకారం జరిగిపోతూనే వుండటం ప్రత్యేకించి గమనించాల్సిన విషయం.

టీవీలు, కేబుల్‌టీవీలు, ఇంటర్నెట్లూ, యూట్యూబ్‌లూ, ఫేస్‌బుక్‌లు లాంటి అత్యాధునిక సాధనాలు విరివిగా వాడకం వున్న యీ రోజుల్లో ఇటువంటి అభివృద్ధి నిరోధక, తిరోగమన భావజాలం ఎందుకు పెరిగి పోతోంది? అని ప్రశ్నించుకొంటే, యీ డిజిటల్ సాధనాలు, సోషల్ మీడియాలూ ప్రగతిశీలక, పురోగామి భావజాలాన్ని పెంపొందించటం లేదని, కేవలం అవి వ్యాపారాన్ని మాత్రమే (ఎటువంటి జంకూ లేకుండా ఎటువంటి ఆంక్షలను లెక్కపెట్టకుండా) చేస్తూ, సూపర్ లాభార్జనను సాధించటానికే అన్నది అర్ధమవుతుంది. ఆ సాధనాలు - సాంకేతికతకు యజమానులైన బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే. అవసరమనుకొన్న భావజాలాన్ని (తిరోగమన భావజాలం - పతన సంస్కృతులను) ప్రచారం చేస్తూ పనిచేస్తున్నాయి.

'నరబలి' యిచ్చిన కేరళలోని ఆయుర్వేద వైద్యుడు కూడా 2019లో ఫేస్‌బుక్ ద్వారానే, నేరస్తుడు షఫీతో సంబంధం ఏర్పాటు చేసుకొన్నాడట. ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక దుస్థితి నుండి యీ నరబలుల ద్వారా బయట పడవేస్తానని (మూఢవిశ్వాసాన్ని) షఫీ వైద్యుడిని నమ్మించాడు.

ప్రతిరోజూ ప్రజలు చూసే కేబుల్ టీవీ సీరియల్స్‌లో ఈ రకమైన తిరోగమన భావజాలం, పతన సంస్కృతులు అనుక్షణం ప్రసారం చేయబడుతున్నాయి. ప్రతీ పండుగ, 'పవిత్ర' దినాల సందర్భంగా ఆయా పూజలు నిర్వహించవల్సిన, ఆ రకమైన సంప్రదాయాలను, ఆచారాలను పాటించవల్సిన ఆవశ్యకతపై 'ఎపిసోడ్'లు ప్రచారం చేస్తున్నారు. ఉండ్రాళ్ళతద్ది, అట్లతద్ది, బొమ్మల కొలువులూ లాంటివి జరుపుకోవల్సిన ఆవశ్యకత, వాటి విశిష్టత గురించీ, బతుకమ్మ పూజలూ, సంక్రాంతి గొబ్బిళ్ళు లాంటివాటిని చేయటం గురించీ ప్రచారం చేస్తున్నాయి. దేవుళ్ళ కళ్యాణాలు చేయాల్సిన అగత్యాలూ, జ్యోతిష్యులు చెప్పే జోస్యాలు వాస్తవమైనట్లూ ఆ ఎపిసోడ్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. క్షుద్ర విద్యలైన మంత్రాలూ, మాయల ప్రభావం గురించీ వాటి విరుగుడు గురించీ యజ్ఞ, యాగాదుల ప్రాశస్త్యం గురించీ నిరంతరం ఘోషిస్తున్నాయి. భక్తి టి.వి. లాంటి అనేక ఛానల్స్ అనుక్షణం ఈ ఛాందస, మౌఢ్య

భావాలను ప్రసారం చేస్తున్నాయి. కొండదొరలు యిచ్చే తాయత్తులూ, మంత్రగాళ్ళు యిచ్చే రక్షరేకులు, 'పవిత్ర' రుద్రాక్షలు, విభూది తదితర మత సంప్రదాయకర్మలు ఆచరించటానికి అవసరమైన వస్తువుల అమ్మకానికి సంబంధించిన ప్రకటనలను ముమ్మరంగా వేస్తూ – ప్రచారం చేస్తూ, ప్రజలను తిరోగమన, అభివృద్ధి నిరోధక భావజాలంలోకి, సాంస్కృతిక ఆచరణలలోకి కూరుకుపోయేటట్లు ప్రచారం చేస్తున్నాయి.

అత్యధిక ఫీజులు, ఛార్జీలు వసూలుచేసే కార్పొరేటు ఆసుపత్రులు, తమ ప్రవేశ ద్వారాల వద్దే వినాయకుడు, వెంకటేశ్వరుడు, జీసస్ తదితర విగ్రహాల చిరు ఆలయాలను నెలకొల్పి, వాటికి రోగులు మొక్కుకొనే విధంగా ఏర్పాట్లు చేయటాన్ని మనం చూస్తూనే వున్నాం.

పాలకులు, ప్రభుత్వ కార్యకలాపాలలో మతభావాన్ని ఆదరించటం, దేవుళ్ళకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు, ముత్యాలు, సారెలు లాంటివి ఆయా సందర్భాలలో అధికారికంగానే యివ్వటం, వివిధ మతాధిపతులకు, స్వాములకు, పీఠాధిపతులకు అధికార పూర్వకంగానే సేవలు చేస్తున్నారు. వారు సూచించే యజ్ఞాలూ, యాగాలూ, పూజలూ, వ్రతాలూ జరిపిస్తూ మూఢ తిరోగమన భావజాలం పెంపొందిస్తున్నారు. మతాచారాలు – సంప్రదాయాలు పేరిట వాటిని ఆచరించటానికీ మద్దతునిస్తున్నారు.

ఈ మూఢాచారాలూ, తిరోగమన భావజాలం అభివృద్ధి నిరోధక ఆచారాలూ కొనసాగటానికి మూలంగా, పునాదిగా వున్నది – ఎటువంటి మార్పుచెందకుండా, చెక్కుచెదరకుండా, అర్ధవలస వాదంతో చెలిమికట్టి సాగుతున్న అర్ధభూస్వామ్య వ్యవస్థే. 75 సంవత్సరాల 'స్వాతంత్ర్యం' తర్వాత కూడా, అదే అర్ధఫ్యూడల్ సామాజిక వ్యవస్థ కొనసాగుతూండటం వల్లనే నేటికీ మనదేశంలో అభివృద్ధి నిరోధక, ఫ్యూడల్ భావజాలం, సంస్కృతులు కొనసాగుతూ, వెల్లివిరుస్తున్నాయి. ఈ వాస్తవాన్ని నిర్ధారిస్తున్నవే పైన పేర్కొన్న కొన్ని ఘటనలు.

ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, సోషలిస్టు వ్యవస్థను స్థాపించటం ద్వారా మాత్రమే, యీ దేశాన్ని తిరోగమన, అభివృద్ధి నిరోధక భావజాలం నుండీ, సాంస్కృతిక ఆచరణల నుండీ రక్షించటం సాధ్యమవుతుంది. సమాజంలో జరిగే ప్రతీ అంశాన్నీ నిర్దిష్టంగా, సూక్ష్మంగా పరిశీలించటం ద్వారా, యీ తిరోగమన, అభివృద్ధి నిరోధక భావజాలాలు, సాంస్కృతిక కార్యాచరణల స్వభావాన్ని స్పష్టంగా అర్థం చేసుకోగల్గుతాము. వాటి నివారణకూ, నిర్మూలనకూ తగు కార్యకలాపాలను చేపట్టగల్గుతాము.

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

– శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

ఇప్పుడిప్పుడే వైకుంఠపాళి ఆట మొదలైంది
గవ్వల్ని గలగలమనిపించే చేతులు
దొంగ పందేలకు సన్నద్ధం అయ్యాయి
పాముల నోటికి చిక్కకుండా
ధనప్రవాహాలు పారాలి కదా
నిచ్చెన మెట్లని దొరకపుచ్చుకోవాలంటే
ఎన్ని సర్పయాగాలు చేయాలో
ఏపందెం ఎట్లా వేయాలన్నా
వెయ్యి కళ్ళ పహారాలు తప్పించుకోవాలి కదా
ఏ నిచ్చెన ఎగబాకాలన్నా
ఏ గెంతులు గెంతాలన్నా
ఆటగాళ్ళ ఆలోచన ఒకటే
ఈ పందెం బరిలో నెగ్గాలంటే
ఏ పందెం కోడికి ఎంత బేరం పెట్టాలా అని
ఏ బస్తీనేతని ఏ మొత్తంతో కొనాలా అని
ఒక్కసారిగా చైతన్యం చిచ్చుబుడ్డై
ఊరంతా వెలుగువెన్నెల వానౌతుంది
సంతరించుకున్న పెళ్ళికళతో
రహదారులన్నీ పెళ్ళిమంటపాలౌతాయి
వాహనాలన్నీ రంగులద్దుకొని
నీటిలో వదిలిన కార్తీక దీపాలౌతాయి
గొంతు సవరించుకొన్న మైకులన్నీ
మంటల్ని పిడుగులా వర్షించే
క్యుములోనింబస్ మేఘాలౌతాయి

జనంలో అలసట ఎరగని ఉత్సాహం
జనసేకరణ బేరసారాల్తో గల్లీలీడర్ల ఆర్భాటాలు
పండుగ ముస్తాబుతో కూడళ్ళంతటా భజనకీర్తనలు
వాహనాలు పూలరథాలై వీథుల్నిండా కరపత్రాలజల్లులు
విపక్షనాయకుల డొంకల్ని కదిలించి
తీగల్నిలాగుతూ అవాకులూ చవాకుల్ని
బాటకిరుపక్కలా గులకరాళ్ళుగా విసుర్తుంటే
ఎవరు నీతిమంతులో అర్థం కాక
పక్కకు తిరిగి నవ్వుల్ని బుగ్గల్లో దాచుకుంటున్న జనం
రాజకీయతంత్రంలో మిత్రులెవ్వరో
చిత్తుగా పడిపోయే శత్రువులెవ్వరో
పెర్ముటేషన్ కాంబినేషన్ లలో
క్షణక్షణానికీ మారిపోయే ఎత్తుల్లో
రకరకాలుగా రూపొందే సమీకరణాల్తో
ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మకూడదో
అర్థంకాని అయోమయంలో జనం
అంతటా ఒకటే గందరగోళం
ఎన్నికలలో ఎన్ని కళలో!

(ఇంకావుంది)

## జాతీయ అక్షరయోధులు




చిత్తప్రసాద్ భట్టాచార్య

**( 1915 - 1978)**

**8**

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# కామ్రేడ్ చిత్ర ప్రసాద్

బెంగాల్ కరువు కాటక కరాళనృత్యాలు
తెలంగాణా సాయుధ విప్లవ కృత్యాలు
విప్లవ కళనేత చిత్తప్రసాద్ భట్టాచార్య
నిరంతర చేతన విశిష్ట చిత్ర సత్యాలు

**'నా కళాసృజన కార్యకలాపాలను మానవసంబంధాలకోసం ఉపయోగించాలని నాకు మొదటిసారి స్పష్టంగా తెలిసి వచ్చిందీ, అందుకుగాను తపించిందీ రెండో ప్రపంచ యుద్ధకాలంలోనే.. ఈ బొమ్మల తయారీ సాంఘిక కార్య కలాపం, కళ కళ కోసమే అనేమాట అస్సలు దీనికి నప్పదు' అంటూ నిజాం వ్యతిరేక వీర తెలంగాణా రైతాంగ సాయుధ విప్లవ పోరాటకళల్ని ఏచిత్రకారుడూ చేయని విధంగా, అమరజీవుల అరుణపథంగా, ప్రజల కళ్లకు బొమ్మకట్టించిన చిత్తప్రసాద్, బెంగాల్‌కు చెందిన భారతీయ కవి, రచయిత, చిత్రకారుడు, గాయకుడు.**

చిత్తప్రసాద్ విద్యాభ్యాసం బంకూరా, చిట్టగాంగ్‌లలో కొనసాగింది. ఆర్ట్సుసబ్జెక్ట్సుతో ఇంటరు ఉత్తీర్ణులయ్యారు.అతను అకడమిక్ శిక్షణలేని స్వీయ బోధన కళాకారుడు. కేవలం గ్రామశిల్పులు, తోలుబొమ్మల ఆటగాళ్లనుండి ప్రేరణపొందిన ప్రతిభావంతుడు

ఆ రోజుల్లో(1930-34)చిట్టగాంగ్ ఒకవిప్లవకేంద్రం. బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడే భారత స్వాతంత్ర్య సాయుధ పోరాట విప్లవకారులకు అది పెట్టని కోట.

'రాజకీయాల్లో పాల్గొనను'అని రాసిస్తేనే కాని సీటు ఇవ్వనన్న కాలేజీ ప్రిన్సిపల్ షరతును తోసేసి ప్రజలమధ్యనే తన కళకు ఎరుపులు, మెరుపులు అద్దుకున్న ప్రజాకళాకారుడు. కుంచెను పదునైన ఆయుధంగా వాడిన చిత్రకళాయోధుడు.

తన బొమ్మల్ని చూసి 'నీకు మేము నేర్పేది ఏదీలేదు, ఇలానే నీ పద్ధతిలో సాగిపో, మమ్మల్ని మించిపోతావు' అంటూ శాంతినికేతన్ నిర్వాహకుల ప్రశంసలందుకున్న ప్రజ్ఞావంతుడు. ఫాసిస్టు వ్యతిరేక చిత్రాలు గీసి ఇండియా - బర్మా సరిహద్దు గ్రామాల్లోని పొలాల్లో ప్రదర్శించి ప్రజలను చైతన్యపరుస్తుండగా కమ్యూనిస్టుపార్టీ ఆయనను చేరదీసి బొంబాయి తీసుకువెళ్ళింది.

చిత్తప్రసాద్ కమ్యూనిస్టుపార్టీ, అరసం, ఇప్టా సంస్థలతో అరుణబంధం కలిగివున్నారు. 'పీపుల్స్ వార్', 'పీపుల్స్ ఏజ్' పత్రికలు వారి చిత్రాలను విరివిగా ప్రచురించాయి. ప్రసిద్ధ బెంగాల్ కరువు ప్రాంతాలలో పర్యటించి ముప్పైలక్షలమంది అమాయక ప్రజల్ని కబళించిన కరువు చరిత్రను, గుండెల్ని పిండేసే ఆకలి చావులను అతను దృశ్యమానం చేసిన తీరు అనితరసాధ్యం. పొట్టలు పెంచుకున్న బ్లాక్‌మార్కటీర్లను, వారికి అండగా నిలిచిన బ్రిటిష్ పాలకవర్గాన్ని తన శక్తిమంతమైన చిత్రయుద్ధ కళతో బట్టలూడదీసి ప్రజల ముందు పడేశారు. తొలుత వాటిని ప్రచురించిన పత్రికలే భయపడి ఆ తర్వాత వాటిని ధ్వంసం చేశాయట!

1944నాటి బెజవాడ రైతు మహాసభ దృశ్యాలనీ, బ్రహ్మాండమైన జనసముద్రాన్నీ, ఒక్క చేతి మీదుగా వెయ్యిమందికి వంటచేసిపెట్టిన 'తెలుగుఅవ్వ' రూపాన్నీ చిత్రశాశ్వతం చేశారు. ఆయన రేఖలలో తెలుగు రైతులు, మహిళలు ప్రజ్వలితంగా చిత్రితమయ్యారు.

కయ్యూరు కామ్రేడ్స్ ఉరి, బెంగాల్ తెభాగా రైతాంగపోరాటం, భారత జాతీయ పోరాటపు నావికులతిరుగుబాటు వంటి అనేక ఉద్యమాలకు శాశ్వతమైన రూపురేఖలను కూర్చిపెట్టారు.

1946లో బొంబాయిలో స్థిరపడి పప్పెట్ థియేటర్‌ను ప్రారంభించారు. 1949లో ప్రపంచ శాంతి సంఘం పిలుపుపై అనేక చిత్రాలు గీసి ఉద్యమానికి అంకితమిచ్చారు. చెకోస్లోవేకియాలో ఆయనపై ఒక డాక్యుమెంటరీ రూపొందింది. 1989లో 'జనసాహితి' చిత్తప్రసాద్ కళాప్రదర్శనతో పాటు 'చిత్తప్రసాద్ కోసం' పుస్తకాన్నీ - శతజయంతికి 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచికనూ వెలువరించింది.

'బెంగాలీలం మరచిపోయినా తెలుగునాట ఆయన సజీవంగా ఉన్నారు' అంటూ ఇప్టా నాయకులు సుధీప్రధాన్ అభివర్ణించిన చిత్తప్రసాద్ బెంగాల్లోని నైహతిలో 1915 జూన్ 21న జన్మించారు. 1978 నవంబరు, 13న కలకత్తాలో కన్నుమూశారు.

**వ్యాసం** రా.రా. శతజయంతి సంవత్సరం - 36వ వర్ధంతి సందర్భంగా....

# రుద్రయాగం

- రా.రా.

రాచమల్లు రామచంద్రారెడ్డి తెలుగు సాహిత్యలోకంలో రా.రా. అనే క్లుప్త నామంతో ప్రసిద్ధులు. 28-2-1922న కడప జిల్లాలోని పులివెందుల తాలూకాలో జన్మించి తన 66వ యేట 1988 నవంబరు 25న హైదరాబాదులో మరణించారు. సాంస్కృతిక పక్షపత్రిక 'సవ్యసాచి'కి 1959-63లలోనూ, 1968-69లలో 'సంవేదన' సాహిత్య త్రైమాసికకూ సంపాదకత్వం వహించారు.

1964లో 6 నెలలు 'విశాలాంధ్ర'లోను, 1969 అక్టోబరు నుండి 1975 డిసెంబరు వరకు మాస్కో ప్రగతి ప్రచురణాలయంలోనూ, 1977 ఏప్రిల్ నుండి 1979 మార్చి వరకు 'ఈనాడు'లోనూ ఉద్యోగం చేశారు.

వారి కథల సంపుటి 'అలసిన గుండెలు', 'సారస్వత వివేచన' (విమర్శ) 'అనువాద సమస్యలు' వారి ప్రసిద్ధ మౌలిక గ్రంథాలు.

రా.రా. సమగ్ర సాహిత్యం నాలుగు సంపుటాల్లో జులై 2012లో యుగసాహితి, రా.రా. స్మారక సమితి కలసి ప్రచురించాయి.

ఆనాటి 'రుద్రయాగా'నికి మించి ఈనాడు రకరకాల యాగాల ఉన్మాదం దేశంలో పెచ్చరిల్లింది. ఒక మహాసాంస్కృతిక విప్లవం అవసరాన్ని ఈనాటి పరిస్థితి గుర్తు చేస్తోంది. - సం॥

**ఒంటిమిట్ట** శ్రీ కోదండరామ ఆలయంలో 3-2-1961 నుండి 14-2-61 వరకు "మహారుద్రయాగం" చేస్తారట. దీనిని గురించి ప్రకటింపబడిన రకరకాల కరపత్రాల ఆర్భాటమూ, దీనికొరకు చేసే సన్నాహాల అట్టహాసమూ చూస్తే యిదేదో బ్రహ్మాండమైన ప్రయత్నంగానే వుండేటట్లు వుంది. నాటకంలో స్టార్‌వాల్యూ కొరకు గొప్పగొప్ప యాక్టర్లను పట్టుకొచ్చినట్లు, కాశీ, అలహాబాద్, హృషీకేశం మొదలైన పుణ్యతీర్థాల నుండి సాధువులూ, సన్యాసులూ, అనబడే 300 మంది జనాకర్షణగల స్వాములవార్లను పిలిపిస్తారట. వట్టి 'రుద్రయాగ' నాటకంతో తృప్తి లేనివాళ్లకు, రామాయణ పారాయణ, అఖండ భజన, అఖండ అన్నదానము, మొదలైన 'ప్రత్యేక పంచరంగుల ఆకర్షణలు' కూడా ఉంటాయట. ఇంత నాటకం జరుగుతూ వుంటే మన 'తాజ్‌మహల్', 'గోపురం', 'కారింజ', బీడీల కంపెనీలవాళ్లు మాత్రం చూస్తూ వూరకవుంటారా? వాళ్ల స్పెషల్ ఎలక్ట్రిక్ ఫోకసింగ్ వగైరా హంగామాతో పసందైన భోగం మేళాలు ఏర్పాటు చేస్తారని ఆశింపవచ్చు.

ఇంతమంది కలిసి ఇంత బ్రహ్మాండమైన నాటకం యెందుకు ఆడుతున్నారంటే, యీ నాటకం ఆడిన వెంటనే, మనకు నిత్యం కలుగుతున్న 'అధివ్యాధి మహాపీడలు' అన్నీ విరగడైపోతాయట. 'సర్వవిధ క్షామ నివారణము' జరుగుతుందట. 'మరియు రాష్ట్రము యొక్క క్షేమము నిమిత్తము' ఈ నాటకం ఆడబడుతుందట. ఈ పవిత్రమైన సదుద్దేశాలన్నీ కరపత్రాలలో ప్రకటింపబడినాయి.

ఈ 'రుద్రయాగం' అనే నాటకం ఆడటానికి కొన్ని లక్షల రూపాయలు ఖర్చు ఔతుందని అంచనా వేస్తున్నారు. ఇంత భారీ యెత్తున నాటకం ఆడాలంటే సూత్రధారులు కూడా గొప్ప మోతుబరి ఆసాములుగా వుండవలె గనుక, మొత్తం 43 మందితో యేర్పడిన 'యాగ కమిటీ'లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలూ, కాంగ్రెస్ ఎమ్మెల్సీలూ, వకీళ్లూ, మొదలైన ప్రముఖులు వున్నారు. ఈ కమిటీకి ప్రెసిడెంట్ ఒక కాంగ్రెస్ ఎమ్మెల్సీగారు.

ఈ కమిటీలోని మెంబర్ల పేర్లు చూస్తేనే ఎవరికైనా మొట్టమొదట ఒక సందేహం కలుగుతుంది - ఈ ఘరానా పెద్దలకందరికీ దేశంమీదా, దేశంలోని ప్రజలమీదా, ఇంత హఠాత్తుగా, ఇంత ప్రేమ ఎప్పుడు పుట్టిందీ అని? స్వార్థం తప్ప ఏ జీవితాశయమూలేని వాళ్లకు ఇంత ఉట్టిపాటుగా ప్రజలకు సంభవించే అధివ్యాధులను గురించి యింత శ్రద్ధా, సర్వవిధ క్షామ నివారణము గురించి ఇంత ఆసక్తీ, రాష్ట్రం యొక్క క్షేమం మీద ఇంత భక్తీ, ఏ విధంగా కలిగిందీ అని?

వివేకం వున్న వాళ్లకెవరికైనా యీ సందేహం కలిగి తీరుతుంది. కానీ ఒక క్షణం ఆలోచిస్తే అసలు రహస్యం బోధపడుతుంది. అధివ్యాధి మహాపీడల నుండి విముక్తి కలుగుతుందని అంటున్నారేగానీ, ఈ పెద్దలందరూ కలిసి ఒక ఆసుపత్రి కట్టిస్తున్నారా? రోగుల నిమిత్తం ఒక విశ్రాంతి మందిరం కట్టిస్తున్నారా? మందుల ఫ్యాక్టరీ కట్టిస్తున్నారా? రోగ నివారణ నిమిత్తం పుష్టికరమైన ఆహారమేమైనా బీదలకు ఉచితంగా అందిస్తున్నారా? ఇవేమీ లేదు. కానీ, ఏవో మంత్రాలు వల్లిస్తూ మూడువందల మంది సద్బ్రాహ్మణులు ముప్పూటా, పుష్టిగా భోంచేస్తే, ప్రజలకు కలిగే అధివ్యాధులన్నీ నివారణ ఔతాయని వీళ్ల విశ్వాసం.

సర్వవిధ క్షామ నివారణ అంటున్నారేగానీ, ఈ పెద్దలందరూ కలసి పంటలు అదనంగా పండడానికి ఏదైనా ఆనకట్ట కట్టిస్తున్నారా? ఒక చెరువో, బావో త్రవ్విస్తున్నారా? బంజరు భూములను సాగులోకి తీసుకురావడానికి ట్రాక్టర్లో, బుల్‌డోజర్లో సప్లై చేస్తున్నారా? రసాయనిక ఎరువులు సప్లై చేస్తున్నారా? భూసారాన్ని రక్షించడానికి గానీ, వర్షపాతం

అధికం చేయడానికి గానీ, ఆధునిక శాస్త్ర సహాయంతో ఎట్టి ప్రయత్నాలైనా చేస్తున్నారా? ఇవేమీ లేదు. కండ్లు మూసుకొని లక్షల రూపాయలు అగ్నిదేవుడికి ఆహుతిచేస్తే, తక్షణం క్షామ నివారణ జరుగుతుందని వీళ్ల భావం.

రాష్ట్రం యొక్క క్షేమం అంటున్నారేగానీ, ఈ పెద్దలందరూ కలిసి రాష్ట్రంలోని ప్రజలకు విద్యాసౌకర్యాలు పెంచడానికి ప్రయత్నిస్తున్నారా? ఉద్యోగ వసతులు అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారా? ప్రజలకు నిత్యం జరుగుతున్న అన్యాయాలనూ, అక్రమాలనూ, అరికట్టడానికి ఏవిధమైన ప్రయత్నమైనా చేస్తున్నారా? ఇవేమీ లేదు. కాషాయ గుడ్డలు కట్టుకొన్న స్వాములవార్లు 'హంఫట్' అంటూనే ఏ దేవుడో 'రాష్ట్రం యొక్క క్షేమం' అనేది పొట్లం కట్టుకొనివచ్చి వీళ్ల జేబులో పెట్టిపోతాడని వీళ్ల ఆశ.

అసలు రాష్ట్రమంటే ఏమిటో యీ పెద్దలను అడిగి తెల్సుకోవలసిన ప్రశ్నే. రాష్ట్రమంటే రాష్ట్రంలో నివసించే మూడుకోట్ల మంది మనుషులు అనే భావం వీళ్లకు యేకోశానా వుండదు. రాష్ట్రమంటే రాష్ట్రంలోని చెట్లూ, పుట్టలూ, నదులూ, కొండలూ, అనే వీళ్ల అభిప్రాయం అయి వుంటుంది.

అ పెద్దలందరూ కలిసి ఇంత డబ్బు వసూలు చేసి నిష్కారణంగా బూడిదపాలు చేస్తున్నారని ఈ అవివేకపు పనిని మనం ఎంత నిరసించినా, ఇదొక గొప్ప సత్కార్యమని వాళ్లు వాదించవచ్చు. మన పూర్వులు యజ్ఞయాగాలు చేసి అభీష్టాలు తీర్చుకొన్నట్లు మన వేదాలలో, పురాణాలలో లేదా అని – భక్తులూ, ఆస్తికులూ, మత మూర్ఖులూ అంటూనే వున్నారు. ఇంద్రునికో, వరుణునికో, పూజలు చేస్తే వర్షాలు పడినట్లు మన పూర్వ గ్రంథాలలో నిదర్శనాలు లేవా అంటున్నారు. కొడుకులు కావాలని దశరథుడు యేదో యాగం చేస్తే, ఏ దేవుడో ప్రత్యక్షమై ఒక చెంబులో గర్భధారణ పానీయం అందియ్యలేదా అని అంటున్నారు. ఒక కొడుకూ కూతురూ కావాలని ద్రుపద మహారాజు యేదో యజ్ఞంచేస్తే, ఆయన భార్యకు గర్భం ధరించడం, నవమాసాలు మోయడం, పురిటినొప్పులు పడడం వగైరా బేజారు పనులేమీ లేకుండా, శుభ్రంగా పూర్ణయవ్వనులైన దృష్టద్యుమ్నుడూ ద్రౌపదీ అగ్ని గుండంలోనే అమాంతం ఆవిర్భవించలేదా అంటున్నారు. మన పూర్వ గ్రంథాలలో యివన్నీ వున్నమాట నిజమే. కానీ మన పూర్వ గ్రంథాలలో వున్నవన్నీ నిజమా అన్నదే ప్రశ్న.

రెండు మూడు వేల యేండ్లనాటి మన పూర్వులకంటే యీనాడు మన విజ్ఞానం శతాధికంగా, శత సహస్రాధికంగా పెరిగింది. స్థూలంగా ఆలోచించినా ఈ విషయం అందరికీ అర్థమౌతుంది. మన పూర్వులు ఊహించలేని రైళ్లు, మోటర్లు, విద్యుచ్ఛక్తి, అణుశక్తి యీనాడు మన నిత్యజీవితంలో భాగాలైనాయి. ఈనాటి వైద్యశాస్త్రంలోని సాధారణ విషయాలైన ఇంజెక్షన్ వైద్యమూ, క్రిమి సిద్ధాంతమూ, గర్భ నిరోధక విధానాలు ఒకరి రక్తం తీసి మరొకరికి ఎక్కించడమూ, ఒకరి దేహంలోని ఎముకలూ, నరాలూ, కనుగ్రుడ్లూ మరొకరికి అతికించే విధానమూ, మన పూర్వులకు తెలియనే తెలియవు; తెలుసుకునే అవకాశం కూడా లేదు. సముద్రంలో రత్నాలు వుంటాయనీ, ఏనుగు తలకాయలో ముత్యాలు వుంటాయనీ, చంద్రునిలో నుండి కారే అమృతంతో ఓషధులు పెరుగుతాయనీ, చకోరపక్షులు వెన్నెలను మేస్తాయనీ, వ్రాసిన మన పూర్వ శాస్త్రాలు చూస్తే వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం మొదలైన ప్రకృతి శాస్త్రాలలోని ఓనమాలు కూడా మన పూర్వులకు తెలియవని మనం గ్రహించవచ్చు. నిజం చెప్పాలంటే యీనాటి అనేక శాస్త్రాలపేర్లు కూడా వాళ్ళకు ఊహించరాని విషయాలు. అష్టాదశ పురాణాలు వ్రాసినాడనీ, వేదాలను విడగొట్టినాడనీ, భగవద్గీత అనే అమోఘమైన వేదాంత గ్రంథం వ్రాసినాడనీ, అఖండకీర్తినార్జించిన ఆ వేదవ్యాస మహర్షికి యీనాటి మన కాలేజీ విద్యార్థులకు తెలిసిన ఖగోళ విషయాలలో పైసా భాగం కూడా తెలియదు. పురాణాలలో ఖగోళం గురించీ, భూగోళం గురించీ ఆయన వ్రాసిన వ్రాతలు చూస్తే మనకు నవ్వు వస్తుంది. యీనాడు మనకున్న విజ్ఞానం మన పూర్వులకు లేకపోవడంలో వింత కూడా యేమీలేదు. ఇరవై ముప్ఫైయేండ్ల మనిషికి వున్న విజ్ఞానం రెండు మూడేండ్ల పిల్లవానికి లేకపోవడం ఎంత సహజమో, ఇదీ అంత సహజమే. కానీ మనకంటే మన పూర్వులు విజ్ఞానవంతులని నమ్మేవాళ్లను చూసినప్పుడు నిజంగా యీ అవివేకులకంటే మన పూర్వులే విజ్ఞానవంతులని ఒప్పుకోక తప్పదు.

మానవుని విజ్ఞానం యింతగా అభివృద్ధి ఐన ఈనాడు, ఏనాడో మన పూర్వులు ఏదో చెప్పినారని, విచక్షణ లేకుండా గుడ్డిగా నమ్మే అవివేకులను చూసి మనం జాలిపడడం న్యాయమే. కానీ అవివేకం అనేది ఒక అంటు జాడ్యం. ఒక అవివేకి తెలిసో తెలియకో తన అవివేకాన్ని మరి పదిమందికి అంటిస్తాడు. కాబట్టి వివేకవంతులందరూ యీ అంటుజాడ్యాన్ని నిర్దాక్షిణ్యంగా ఎక్కడికక్కడ అరికట్టకపోతే సంఘానికంతటికీ ప్రమాదం కలుగుతుంది.

మానవుని విజ్ఞానం దినదినమూ, క్రమక్రమంగా పెరుగుతూ వుందనీ, కొన్నివేల యేండ్లనాడు మానవుడు చాలా అజ్ఞాన దశలో వుండినాడనీ, సనాతన ఛాందసులు ఒప్పుకోకపోవచ్చు. అలనాడు ఆ యొక్క మాంధాత మహారాజు రాజ్యం చేస్తూవుండిన కృతయుగంలోనే జ్ఞానం అనేది సర్వసంపూర్ణంగా వుండిందనీ, పాపపంకిలమైన ఈ యొక్క కలియుగంలోనే ధర్మం అడుగంటి అజ్ఞానం ప్రబలిందనే మన భక్తులూ, తలతిరిగిన దేశ భక్తులూ, వితండవాదం చేయవచ్చు. కానీ మానవజాతి పరమ అజ్ఞానదశలో పుట్టి క్రమక్రమంగా జ్ఞానం ఆర్జిస్తూ ఈనాటికి ఈ దశకు చేరుకున్నదనేది చారిత్రక సత్యం. మానవుడు ఒకనాడు జంతువులవంటి అజ్ఞానదశలో వుండడమేగాక జంతువుల వలెనే ఇతర జంతువుల్తో పోరాడుతూ, జంతువులవలెనే తమలోతాము పోట్లాడుతూ, జంతువుల వలెనే చెట్లకొమ్మలమీదా, కొండగుహల్లోనూ కాపురం చేసినాడు. జంతువులవలెనే దిగంబరంగా తిరిగినాడు. జంతువులవలెనే వివాహమూ, కుటుంబమూ అనే సాంఘిక కట్టుబాట్లు యేవీలేకుండా పెరిగినాడు. జంతువులవలెనే వ్యవసాయం అనేది తెలియకుండా, ఇనుము, రాగి మొదలైన లోహాలతో పరిచయం లేకుండా, అగ్నిని ఉపయోగించేదికూడా తెలియకుండా బ్రతికినాడు. కానీ మానవుల మెదడు జంతువుల మెదడుకంటే ఉన్నతమైనది గనుక, జంతువులకు సాధ్యంకాని ఊహలు మానవునికి రాసాగినాయి. ఆ ఊహలన్నీ మానవుని చుట్టూ వున్న ప్రకృతిని గురించే; మానవుని నిత్యజీవితంలో జరిగే ఘటనల గురించే. మొట్టమొదటి దశలోనే

ప్రాణం వున్న వస్తువులకూ ప్రాణంలేని వస్తువులకూ మధ్యవున్న భేదం మానవుడు గమనించినాడు. ప్రాణంలేని జడవస్తువులు ఎక్కడవున్నవి అక్కడనే అచేతనంగా పడివుంటాయి. కానీ ప్రాణం వున్న వస్తువులు తమ యిష్టం వచ్చిన చోటికి కదులుతూ వుంటాయి. ప్రాణం వున్నవాటికి కదలిక వుంది కాబట్టి, కదలిక వున్నవాటికల్లా ప్రాణం వుందని ఆదిమానవుడు సహజంగా ఊహించుకున్నాడు. (ఈనాటికీ మన పసిపిల్లలు ఈ విధంగా ఊహించుకోవడం మనం చూస్తూనే వున్నాము.) ఆ ఆధారం మీదనే సూర్యుడు, చంద్రుడు, నదులు, వర్షము, మేఘము, అగ్ని, ఇవన్నీ ప్రాణంవున్న వస్తువులనే ఆదిమ మానవుడు అనుకొన్నాడు. ప్రాణంవున్న వస్తువులకన్నిటికీ మనుషులకున్నట్లే కోపతాపాలూ, ఆకలిదప్పులూ, రాగద్వేషాలూ, సంకల్ప వికల్పాలూ వుంటాయని ఊహించుకోవడం కూడా ఆ దశలో అతిసహజమే. కోతులవలె కర్రలనూ, రాళ్లనూ మాత్రమే ఆయుధాలుగా ఉపయోగించుకుంటూ జంతువుల మధ్య బ్రతుకుతూ వచ్చిన మానవుడు ఒంటరి జీవితంలో కంటే సమిష్టి జీవితంలో కొన్ని సదుపాయాలు వున్నాయని క్రమక్రమంగా గ్రహించినాడు, ఆచరణలో అది రుజువైనప్పటినుండే మానవులు యే యాభైమందో నూరుమందో కలిసి ఒక సమాజంగా ఏర్పడి యే గుహలోనో సమిష్టి జీవితం ప్రారంభించినారు.

సమిష్టి జీవితపు తొలిదశలోనే మానవులు కంఠధ్వనులద్వారా ఒకరి అభిప్రాయాలనూ అనుభూతులనూ మరొకరికి తెలుపుకుంటూ వుండినారు. ఆ ప్రయత్నంలోనే ఒకవైపు భాషపుట్టి క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. మరొకవైపు అనేక సూక్ష్మధ్వని భేదాలను ఉచ్చరించేశక్తి కంఠానికీ, ఆ ధ్వని భేదాలను గ్రహించేశక్తి శ్రవణేంద్రియానికీ, అభివృద్ధి ఔతూ వచ్చినాయి. ఆ దశలో మానవులకు అగ్నిని సృష్టించేది చేతగాకపోయినా, అడవుల్లో సహజంగా పుట్టే దావానలం నుండి మండుతున్న కొరువులు తెచ్చుకొని, అవి ఆరిపోకుండా రక్షించుకుంటూ వుండినారు. రాత్రిపూట క్రూరజంతువుల బారినుండి తప్పించుకోడానికి తాము నివసించే గుహల్లోనూ, గుహల ద్వారాలలోనూ మంటలు మండించేవాళ్ళు. ఆ తర్వాత మంటలో మాంసమూ, దుంపలూ కాల్చుకొని తినడం అలవాటు పొందిన మానవుడు అగ్నిపట్ల ప్రేమాభిమానాలు కలిగివుండడం అతిసహజమైన విషయం. అదేవిధంగా సూర్యునిపట్ల కూడా ఆదిమ మానవుడు కృతజ్ఞత కనపరచేవాడు. పగటిపూట క్రూరజంతువుల బారినుండి యేదోవిధంగా తప్పించుకొన్న మానవునికి రాత్రిపూట సంచారంచేసే క్రూరజంతువుల బారినుండి తప్పించుకోవడం చాలా కష్టంగా వుండేది. అందువలన సూర్యుని వలన తనకు రక్షణ కలుగుతున్నట్లు ఆనాటి మానవుడు అభిప్రాయపడినాడు. ఈ విధంగా అత్యంత ఆదిమమానవునికి మొదట సూర్యుడూ, తరువాత అగ్ని ముఖ్యదేవతలు, వ్యవసాయం కనిపెట్టిన తరువాతనే వర్షదేవుడు (పర్జన్యుడో, వరుణుడో, ఇంద్రుడో) మానవులకు ముఖ్యదేవుడు అయ్యాడు.

బలవంతులకు కోపంవస్తే, వాళ్లను శాంతింపజేయడానికి బలహీనులు ప్రార్థనలూ, పొగడ్తలూ, వినయవిధేయతలు ప్రకటించడమూ, మొదలైన పద్ధతులు ఉపయోగిస్తారు. బుజ్జగించడమూ, ఆత్మీయత ప్రకటించడమూ, మమకారం చూపించడమూ, కొందరిపట్ల – ముఖ్యంగా పిల్లలపట్ల – ఉపయోగించే పద్ధతులు. రుచికరమైన ఆహార పానీయాల ద్వారా ఎంతటివాళ్ళనైనా తృప్తిపరచవచ్చు. ఈ సత్యాల నన్నిటినీ ఆదిమమానవుడు తన నిత్యజీవితంలో అనుభవం ద్వారా గ్రహించినవే. దేవతలుగా ఎంచబడిన ప్రకృతిశక్తులను తృప్తిపరచడానికీ, ప్రసన్నం చేసుకోడానికీ, ఆదిమ మానవుడు ఈ పద్ధతులన్నీ ఉపయోగించినాడు. (మనం ఎవరమైనా మనకు తెలిసిన పద్ధతులు మాత్రమే ఉపయోగిస్తాము. కాబట్టి ఆనాటి మానవుడు తనకు తెలిసిన పద్ధతులను మాత్రమే ఉపయోగించడంలో ఆశ్చర్యం లేదు.) అందుకనే ఆదిమ మానవుని మతంలో ప్రార్థనలూ, జంతుబలులూ ప్రధానాంశంగా వున్నాయి. వేట ప్రధానవృత్తిగా వున్న తొలిదశలోనూ, పశుపాలనం (ఆవులనూ, గుర్రాలనూ పెంచడం) ముఖ్యవృత్తిగా వున్న తరువాతి దశలోనూ మాంసమే ముఖ్య ఆహారం. తాము తినే ఆహారంలో విలువైనదీ, తమకు అత్యంత ప్రీతికరమైనదీ మాంసమే గనుక, ఆదిమ మానవుడు తన దేవతలకు కూడా మాంసమే భక్తితో అర్పించినాడు. అందుకనే ఆదిమకాలంలో భారతదేశంలోని యజ్ఞయాగాదులన్నిటిలోనూ జంతు బలులు (తొలిదశలో ఆవులు, గుర్రాలు, తరువాత మేకలు) అర్పించేవాళ్ళు. ఈనాడు మనకు గోవు పవిత్రమైన జంతువుగా వున్నది కానీ రెండు మూడు వేల యేండ్లనాటి భారతీయ ఆర్యులు బాగా బలిసిన ఆవులతోనూ, ఎద్దులతోనూ విందు చేసుకునేవాళ్ళు. పాలుతాగే దూడలైతే మరింత ప్రీతితో ఆరగించేవాళ్ళు. సామాజికంగా అనేక మార్పులు వచ్చిన తర్వాత, శ్రమవిభజనవల్ల వర్గవిభజన, వర్గ విభజన ద్వారా బ్రాహ్మణ, క్షత్రియాది వర్ణవిభజన, యీ అన్నిటివల్లా క్రింది వర్గాల శ్రమ ఫలితాన్ని పై వర్గాలవాళ్లు దోచుకోవడమూ, యివన్నీ జరుగుతూ అనేక శతాబ్దాలు గడచిన తర్వాత, ధనికులకూ దరిద్రులకూ భేదాలు తీవ్రమైన తరువాతే, సంఘంలో ప్రబలిన అశాంతికి చిహ్నంగా బౌద్ధమతం పుట్టిన తరువాతనే, బౌద్ధమతం ద్వారా యజ్ఞయాగాదులకు వ్యతిరేకంగా, జంతుబలులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తమైన ఆందోళన జరిగిన తర్వాతనే మన బ్రాహ్మణులు మాంసాహారం వదలిపెట్టడమూ, యజ్ఞయాగాలలో జంతుబలులు తగ్గిపోవడమూ, యజ్ఞయాగాదులే తగ్గిపోవడమూ జరిగింది.

## యజ్ఞం అంటే?

ఆదిమకాలంలో యజ్ఞం అనబడేదానికీ ఈనాటి యజ్ఞానికీ చాలా భేదం వుంది. అనాగరిక దశలోని ఆర్యుల దైనందిన జీవిత విధానమే ఆనాడు యజ్ఞం అనబడేది. ఆ దైనందిన జీవితంలో అగ్నిపూజ ఒక ముఖ్యమైన అంశం. ఆర్యులు భారతదేశానికి రాకపూర్వమే అగ్నిని ఆరాధించేవాళ్ళు. అడవుల్లో జంతువుల మాదిరి పచ్చి మాంసమూ, పచ్చికాయలూ, దుంపలూ తింటూ వుండిన ప్రప్రథమ దశలో, వ్యవసాయం తెలియక ముందు, ఇండ్లు కట్టుకునేది తెలియక ముందు, బట్టలు తయారుచేసేది తెలియకముందు, కత్తి, కొడవలి, రంపము, గొడ్డలి మొదలైన ఇనుప సాధనాలు కనిపెట్టకముందు జీవితం ఏవిధంగా వుండేదో ఒక్కసారి ఊహించుకోండి. ఆ దశలో అగ్నిని ఉపయోగించడం నేర్చుకున్నప్పుడు, రాత్రులయందూ, చలికాలంలోనూ, అగ్ని ఒక్కటే ఆనాటి మానవులకు ప్రాణభిక్ష పెట్టగలిగిన మహాశక్తి. అంతేగాక మాంసమూ, చేపలూ, దుంపలూ, అగ్నిలో కాల్చుకొని తినడం ప్రారంభమైన తరువాత, ఆహారం సులభంగా జీర్ణం కావడం ద్వారా

వాళ్ల ఆరోగ్యంలోనూ, ఆయుస్సులోనూ గణనీయమైన అభివృద్ధి కనపడింది. ఈ విషయాలు అర్థం చేసుకుంటే ఆనాటి మానవులకు అగ్నిమీద అంతటి భక్తి విశ్వాసాలు ఎందుకు కలిగిందీ అర్థమౌతుంది. అటు తరువాత ఆవులనూ, గుర్రాలనూ మచ్చిక చేసుకొని మందలు మందలుగా పెంచుతూ, వాటి పాలు, పెరుగు, మాంసం మీద బ్రతకడం ప్రారంభమైన తర్వాతనే వాళ్లు అడవులు వదిలిపెట్టి పచ్చిక బయళ్లలో బ్రతకడం మొదలుపెట్టినారు. పాలు, పెరుగు, వండిన మాంసం, సమృద్ధిగా తినడం ప్రారంభమైన తరువాతనే మానవుని మెదడు బాగా అభివృద్ధి అయింది. జనసంఖ్య కూడా విస్తారంగా అభివృద్ధి అయింది. అప్పుడే యవలు, గోధుమలు మొదలైన గడ్డి ధాన్యాలు తినడం అలవాటయింది. (ధాన్యం తినడం అలవాటైనా, వ్యవసాయం అప్పటికింకా అమలులోకి రాలేదు.) విస్తరించిన జనసమూహమంతా ఒకచోట బ్రతకడం అసాధ్యమైనప్పుడే అందులో కొందరు దూరప్రదేశాలకు వలస పోవడం ప్రారంభమైంది. ఆ దశలోనే తమ పశువులకు కొత్త పచ్చిక బీళ్లను వెదుక్కుంటూ భారతదేశానికి వచ్చి సింధూ, గంగా మైదానాలలో స్థిరపడిపోయినారు.

ఆ తొలిదశలో ఆర్యులు ఒక్కొక్కచోట కొన్ని వందల మంది కలిసి కాపురం చేసేవాళ్లు. చుట్టూ బండలతో ఒక గోడవలె ఏర్పాటుచేసి, ఆ అశ్వవ్రజం (రాతికోట)లో మూడు నాలుగు ఇండ్లు కట్టుకొని, అందరూ ఏక కుటుంబంగా జీవించేవాళ్లు. ఇండ్లగోడలు మొద్దులతోనూ, కప్పు కట్టెలతోనూ, గడ్డితోనూ తయారయ్యేవి. ఒక ఇంటిలో రేయింబగలు ఎడతెగకుండా అగ్ని మండుతూ వుండేది. ఆ ఇంటిలోనే వంట (మాంసమూ, రొట్టెలూ) తయారయ్యేది. మరొక ఇంటిలో కట్టెలూ, గడ్డీ, గంపలూ, కుండలూ, ధాన్యమూ, నిలువ వుండేవి. మరొక ఇంటిలో సోమరసం తయారయేది. (అంటే సోమ అనే మొక్కలతో తయారయ్యే సారాయి) ఆ విశాలమైన సమిష్టి కుటుంబంలో ఎవనికీ సొంత ఆస్తి అనేది లేదు. ఉన్నదంతా అందరికీ చెందిన సమిష్టి ఆస్తే. వ్యక్తిగత ఆస్తులూ, వ్యక్తిగత కుటుంబాలూ లేని దశలో స్త్రీల మీద పురుషుల పెత్తనం కూడా వుండేదికాదు. స్త్రీలు తాము కోరిన పురుషులతోనూ, పురుషులు తాము కోరిన స్త్రీలతోనూ, కలిసి స్వేచ్ఛగా విహరించేవాళ్లు.

ప్రతిరోజూ ప్రొద్దున్నే సమిధలు (కట్టెలు) తేవడానికి కొందరూ, సోమ మొక్కలు తేవడానికి కొందరూ, దర్భలు (గడ్డి) తేవడానికి కొందరూ పోయేవాళ్లు. (చాపలు, పశువులకు కావలసిన తాళ్లూ తలుగులూ, గడ్డితోనే తయారయ్యేవి.) కొందరు పాలు పిండడానికీ, కొందరు ధాన్యం పిండిగొట్టడానికి, కొందరు జంతువులను చంపి, చర్మం తీసి, మాంసం తయారుచేయడానికి నియుక్తులయ్యేవాళ్లు. ఈవిధంగా అందరినీ అన్ని పనులకు నియమించడానికీ అందరికీ సలహాలు ఇవ్వడానికీ, అన్ని పనులనూ పర్యవేక్షణ చేయడానికీ, ఒకడు పెద్దగా ఎన్నుకొనబడేవాడు. ఆ సమిష్టి కుటుంబమంతా కలిసి బ్రహ్మ అని పిలువబడేది. ఎన్నుకోబడిన పెద్దను బ్రాహ్మణస్పతి అనేవాళ్ళు. బ్రాహ్మణస్పతి పర్యవేక్షణ క్రింద ఆనాడు తయారైన భోజనం పంపకమయ్యేది. కానీ భోజనానికి ముందు తమ ప్రత్యక్ష దైవమైన అగ్నిని పూజించి తమను రక్షించినందుకు కృతజ్ఞతలు తెలిపి, భవిష్యత్తులో రక్షించే నిమిత్తం ప్రార్థనలు చేసి, తమ ఆహారంలో కొంత భాగాన్ని భక్తిపూర్వకంగా అగ్నిలో వేసేవాళ్లు. అగ్నికి అర్పించిన ఆహారాన్ని హుతం అనేవాళ్ళు. మిగిలిన భోజనాన్ని (హుతశేషం) అందరూ పంచుకొని భుజించేవాళ్ళు. హుతం భోంచేసేవాడు గనుక అగ్నికి 'హుతభుక్కు' అనే పేరు వచ్చింది. ఇతర దేవతలను పూజించదలచుకున్నప్పుడు కూడా, ఆ దేవతలకు అర్పించదలచుకొన్న ఆహారం అగ్నిలో వేస్తే, అగ్నిదేవుడే దాన్ని మోసుకపోయి ఆయాదేవతలకు బట్వాడా చేస్తాడని ఆర్యులు నమ్మేవాళ్లు. అందువల్లనే అగ్నికి హుతవహుడనీ, హుతవాహనుడనీ పేర్లు వచ్చినాయి.

ఏక కుటుంబంగా కలిసి బ్రతుకుతున్న సమాజాన్నంతటినీ బ్రహ్మ అన్నట్లే వాళ్ల మొత్తం జీవిత విధానం అంతటినీ యజ్ఞం అనేవాళ్లు. పశు, ప్రజాసంపదను, సృష్టించేవాడు బ్రహ్మ. యజ్ఞం ద్వారా పశువులూ, ప్రజావృద్ధి అయ్యేవి. (ఏ పనులు చేస్తే పశువృద్ధీ, ప్రజావృద్ధి ఔతుందో ఆ పనులన్నీ కలిసే యజ్ఞం అనబడేది. పశువృద్ధికి, ప్రజావృద్ధికి అగ్ని అనుగ్రహం ముఖ్యకారణమని నమ్మేవారు గనుక యజ్ఞంలో అగ్నిపూజ ఒక ముఖ్యభాగమైంది.) అనగా యజ్ఞ పద్ధతి ద్వారా బ్రహ్మ పశువులనూ, ప్రజలనూ సృష్టించేవాడు. బ్రహ్మ అంటే తామే.

కానీ తరువాతి కాలంలో ఈ బ్రహ్మ భావం కొంత విస్తృతిచెంది సమస్త ప్రకృతినీ సృష్టించేవాడు బ్రహ్మ అన్న భావం ప్రచారంలోకి వచ్చింది. తరువాత ఈ బ్రహ్మభావం కొంత వికృతి చెంది ఉపనిషత్తులలోని రూపనామ క్రియలేని బ్రహ్మగా రూపుమారింది. ఉపనిషత్తులలోని బ్రహ్మకూ వేదాలలోని బ్రహ్మకూ ఎక్కడా పోలికే కనపడదు. ఉపనిషత్తులలోని బ్రహ్మ నిర్గుణుడూ, నిరాకారుడూ, నిరంజనుడూ, నిర్వికల్పుడూ ఐన శుద్ధ సచ్చిదానంద స్వరూపుడు. అంటే ఏమి చేయలేని, ఎందుకూ పనికిరానివాడు. కానీ వేదమంత్రాలలోని బ్రహ్మ తిని, తాగి, ఆడి, పాడి అన్నిటినీ అనుభవించే మానవసమాజం. (వేదాలలోని బ్రహ్మ శబ్దానికి మంత్రం అనీ, సామగానం అనీ, వాటి ఉచ్చారణ అనీ, ఇతర అర్థాలు కూడా కొన్ని సందర్భాలలో లేకపోలేదు. పశు ప్రజాభివృద్ధికి అవన్నీ హేతువులే అన్నభావంలో ఆ అర్థాలు ఏర్పడినాయి. కానీ ఉపనిషత్తులలోని అర్థం మాత్రం వేదాలలో ఎక్కడా లేదు.)

శ్రమ విభజన వల్ల ఆర్థికవ్యవస్థలో మార్పులు వచ్చిన తర్వాత సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలు ఏర్పడినప్పుడు, బ్రహ్మ యొక్క ముఖంనుండీ, భుజాలనుండీ, తొడలనుండీ, ఆ మూడు కులాలు పుట్టినాయనీ ఆనాటి ఆర్యులు అన్నారు. సమిష్టి కుటుంబంగా వున్న రోజుల్లో అందరూ కలిసే యజ్ఞం చేసేవాళ్లు. సమిష్టి కుటుంబం చీలిపోయి వ్యక్తులకు సొంత ఆస్తులు ఏర్పడిన తర్వాతనే యజనం (యజ్ఞం చేయడం), యాజనం (యజ్ఞం చేయించడం) అనే భేదాలు ఏర్పడినాయి. తొలిదశలో యజమానుడు (యజ్ఞం చేయించేవాడు) ఋత్విజులు (మంత్రాలు చదివేవాళ్లు), అనే భేదం కూడా లేదు. కానీ తర్వాతి దశలో డబ్బున్న మహారాజు ఎవరైనా ఋత్విజులకు కూలి (దక్షిణలు) ఇచ్చి యజమానుడు కావచ్చు. తొలిదశలో ప్రతిరోజూ యజ్ఞం చేసేవాళ్లు; అది వాళ్ల దైనందిన జీవిత విధానం. కానీ తరువాతి కాలంలో ఏ మహారాజో తన జీవితాని కంతటికీ ఒక యజ్ఞం చేయగలిగితే గొప్ప. పెద్ద ఖర్చుతోనూ, శ్రమతోనూ కూడుకున్న పని గనుకనే, తరువాతి కాలంలో యజ్ఞం చేసినంతపని అన్న సామెత పుట్టింది. దానం ఇవ్వడం యజ్ఞంలో ఒక ముఖ్యభాగం. గనుకనే యజ్ఞం ఎంతో ఖర్చుతో కూడుకున్న పని అయింది. కానీ తొలిదశలో దానం అంటే అర్థం ఆనాటి ఆహారాన్ని అందరికీ పంచిపెట్టడం.

ఈ పని బ్రాహ్మణస్పతి యొక్క ధర్మం. యుద్ధంలో శత్రువుల పశువులూ, ఆయుధాలూ, శత్రువుల స్త్రీలూ దొరికినపుడు ఆ సంపదను కూడా బ్రాహ్మణస్పతి యజ్ఞధర్మం ప్రకారం అందరికీ పంచిపెట్టేవాడు. ఇది కూడా దానం అనబడేది. దానం అనే పదానికి వ్యుత్పత్తి అర్థం పంచడం అనే. ఆనాడు యజ్ఞం అనేది ఒక చారిత్రక దశలో ఆచరణలో వుండిన సజీవమైన జీవిత విధానం. కానీ తరువాతి దశలో యజ్ఞం ఒక నిర్జీవమైన కర్మకాండ – మంత్రాలు వల్లించినంత మాత్రాన దేవతలు మన కోరికలు తీరుస్తారనే ఒక పరమ మూర్ఖమైన విశ్వాసం. తొలిదశలో అది నిత్యజీవితంలో పుట్టి, నిత్య జీవితంతో పెనవేసుకొని వుండిన జీవనమార్గం. తరువాతి దశలో అది జీవితానికి సంబంధంలేని ఒక గుడ్డి అనుకరణ. మన భారత, రామాయణాలు పుట్టక పూర్వమే ఆర్యులలో సమిష్టి జీవితం విచ్చిన్నమైంది గనుక, అప్పటికే యజ్ఞయాగాలు కేవలం మూఢాచారాలుగా తయారైనాయి.

ఈనాడు యజ్ఞంలో అవలంబించే కొన్ని ఆచారాలను చూసినా యజ్ఞం అనేది ఎటువంటి చారిత్రక పరిస్థితులలో పుట్టిందీ అర్థమౌతుంది. ఈనాడు యజ్ఞమంటపాలలో ఎక్కడా ఇనుము వుండరాదంటారు. బలియిచ్చే జంతువును చంపడానికి కత్తి ఉపయోగించరాదంటారు. దర్భలు కోసుకురావడానికి కొడవలి ఉపయోగించరాదంటారు. ఆదిమ కాలంలో ఇనుమును కనిపెట్టక పూర్వమే ఆర్యులు యజ్ఞయాగాలు చేస్తూవుండిన కాలంలో ఇనుప పనిముట్లు లేవు గనుక, గుర్రపు ఎముకలతో గడ్డి కోసుకునేవాళ్ళు. బడెలతో మోది జంతువులను చంపి, పదునైన రాళ్లతోనూ, ఎముకలతోనూ చర్మం తీసేవాళ్ళు. ఆనాటి అనివార్యమైన పద్ధతుల యొక్క గుడ్డి అనుకరణలే ఈనాటి పవిత్రమైన ఆచారాలు. అదేవిధంగా ఈనాడు యజ్ఞానికి కావలసిన ధాన్యపు పిండి తయారు చేయడానికి విసురురాళ్ళు ఉపయోగించరాదంటారు. అగ్నిని సృష్టించడానికి అరణి మాత్రమే ఉపయోగించాలనీ, అగ్గిపుల్లలు ఉపయోగిస్తే దేవతలు ఆగ్రహిస్తారనీ అంటారు. ఆనాడు విధిలేక ఉపయోగించిన పద్ధతులనే ఈనాడు కూడా ఆచరించాలనే మూర్ఖపు పట్టుదలలే ఇవన్నీ.

## మంత్రం అంటే?

భాష పుట్టిన మొదటి రోజుల్లో మాటల ద్వారా ఎదుటివాళ్లలో భిన్న మనోవికారాలను పుట్టించవచ్చుననీ, భిన్న చర్యలకు పురికొల్ప వచ్చుననీ ఆదిమ మానవుడు గమనించాడు. అందువలన శబ్దాన్నీ, మాటలనూ దైవశక్తులుగానే భావించుకున్నాడు. ఆ భావన యొక్క ప్రతిఫలమే శబ్దబ్రహ్మ, వాగ్దేవి మొదలైన రూపకల్పనలు. వస్తువులకూ, భావాలకూ, చర్యలకూ, ధ్వనిరూపమైన సంకేతాలే మాటలు. కుక్క అనేమాట కుక్క అనే వస్తువుకు ధ్వనిరూపమైన సంకేతం (గుర్తు). (వ్రాతలో కుక్క అనే అక్షర సముదాయం కుక్క అనే ధ్వనికి సంకేతం – అనగా సంకేతానికి సంకేతం)

ఈనాడు మనకు తెలిసిన సత్యం ఇది. కానీ ఆనాటి మానవుని అభిప్రాయంలో మాటలకు ప్రత్యేకమైన దైవికశక్తి వుంది. ఒక్కొక్క మాటకు ఒక్కొక్క విధమైన శక్తి ఉందనీ, ఒక మాట విన్న మానవుడు ఆ మాటకు అనుగుణమైన మనోవికారాన్ని విధిగా పొంది తీరుతాడనీ, ఆ శక్తి ఆ మాటలలోనే వుందనీ, ఆదిమ మానవుని విశ్వాసం. ఆ శక్తినే మంత్రశక్తి అన్నారు. ఆనాటి దేవతలు మానవులకంటే అధిక బలవంతులు కావచ్చునేగాని, మిగతా అన్ని విషయాలలోనూ మనుషుల వంటివాళ్ళే; కనుక మంత్రశక్తి మనుషుల మీద పనిచేసినట్లే దేవతల మీద కూడా పనిచేస్తుందని ఆనాటి మానవుడు నమ్మినాడు. పూజలు, ప్రార్థనలు, భక్తి, బలులు, వీటిద్వారా దేవతలను ప్రసన్నం చేసుకోవడం ఒక పద్ధతి. మంత్రశక్తి ద్వారా దేవతలను వశం చేసుకోవడం మరొక పద్ధతి. కానీ ఈ రెండు పద్ధతులూ ఆదిమ మానవుని జీవితంలో పెనవేసుకొనే వుంటాయి. ఆదిమకాలంలో నృత్యంలో సంగీతమూ, సంగీతంలో కవిత్వమూ, కవిత్వంలో మతమూ, మతంలో తత్త్వశాస్త్రమూ కలిసే వున్నాయి. ఆ విధంగానే పూజాపద్ధతీ, మంత్రపద్ధతీ కలిసే వున్నాయి. మానవ విజ్ఞానం కొంత వికసించిన తరువాత ఇంద్రుడు, అగ్ని, సూర్యుడు, వరుణుడు మొదలైన ప్రకృతి దేవతలకంటే భిన్నుడూ, చాలా అధికుడూ ఐన భగవంతుడు సృష్టింపబడిన తర్వాత భక్తికీ, చిత్తశుద్ధితో చేసే పనులకూ, విలువ హెచ్చి మంత్ర పద్ధతికి విలువ తగ్గిపోయింది. అందుకనే మన పురాణాలలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు భక్తికీ, తపస్సుకూ మెచ్చి ప్రత్యక్షమౌతారేగానీ, మంత్రశక్తికి లోబడినట్లు లేదు. అప్పటినుండి మంత్రాలు క్షుద్ర దేవతలకు మాత్రమే పరిమితమై పోయినాయి. పెద్ద దేవతలను ఆరాధించేవాళ్ళూ, ఆధ్యాత్మిక విలువలను అభిలషించేవాళ్లూ, మంత్ర పద్ధతిని అవలంబించరు.

ఈ విధంగా మంత్రాలు, యజ్ఞయాగాలు, దేవుడు, దయ్యం, ఆత్మ, పరమాత్మ అనే భావాలన్నీ మానవ చరిత్రలో అజ్ఞాన దశలో పుట్టినవే. ఆ భావాలు ఆనాటి పరిస్థితులలో సహజమైనవి. నిత్యజీవితంలో తనకు కలిగే అనుభవాల ద్వారానే మానవుడు ప్రకృతిని గురించీ, సృష్టిని గురించీ, తనను గురించీ, కొన్ని అభిప్రాయాలు ఏర్పరచుకుంటాడు. మతమూ, వేదాంతమూ, సైన్సూ, అన్నీ ఆ అభిప్రాయాల ద్వారా ఏర్పడినవే. మన అభిప్రాయాలు తప్పు అని అనుభవంలో రుజువైనప్పుడు, ఆ అభిప్రాయాలు మార్చుకుంటాము. ఆ విధంగా అభిప్రాయాలు మార్చుకుంటూ వచ్చినందువల్లనే సూర్యుడు దేవుడు కాదనీ, సూర్యుడంటే భూమికి 9 కోట్ల మైళ్ళ దూరంలో సుమారు 9 లక్షల మైళ్ళు అడ్డుకొలత గల ఒక అగ్నిగోళమనీ ఈనాడు మనకు తెలుసు. అదేవిధంగా వరుణుడనే దేవుడే ఈ వర్షం కురిపించడం లేదనీ, సూర్యుని వేడిమి వలన సముద్రాలలోని నీరు ఆవిరై, ఆ ఆవిరే చల్లబడి వర్షంగా భూమిమీద పడుతున్నదనీ ఈనాడు మనకు తెలుసు. అదేవిధంగా మనం చేసే వ్యవసాయమూ, ఎరువులూ, భూమిలోని సారమూ, వీటివల్లనే పంటలు సక్రమంగా పండుతాయి గానీ, మనలను అనుగ్రహించడానికి భూమాత అనే పేరుతో 25 వేల మైళ్ల చుట్టుకొలత గల సుందరాంగి ఎవరూ లేరనీ మనకు తెలుసు.

## పెట్టుబడిదారీ సమాజంలో మూఢవిశ్వాసాలు :

ఇవన్నీ మనకు తెలుసు. ఇంకా అనేకం మనకు తెలుసు. కానీ ఈ విజ్ఞానమంతా ప్రజలకు అందుబాటులోకి రాకుండా మన పెట్టుబడిదార్ల ప్రభుత్వమూ, పెట్టుబడిదార్ల పత్రికలూ, పెట్టుబడిదారీ నాగరికతను పోషించడానికి పుట్టిన విశ్వవిద్యాలయాలూ, నిరంతరం ప్రయత్నిస్తూనే వున్నాయి. మూఢవిశ్వాసాలు అంతరించి ప్రజలు విజ్ఞానవంతులైతే పెట్టుబడిదార్ల దోపిడీ సాగదు గనుక, ప్రజలను అజ్ఞానంలోనే వుంచడానికి పెట్టుబడిదారీశక్తులన్నీ నిరంతరం కృషి చేస్తుంటాయి.

ప్రపంచంలోని ఐశ్వర్యమంతా మానవులు సృష్టించిందే. వ్యవసాయం ద్వారాగానీ, పరిశ్రమల ద్వారాగానీ, గనులు తవ్వడం ద్వారాగానీ ఉత్పత్తి ఐన సమస్త వస్తువులూ మానవుడు ఉత్పత్తి చేసినవే. కానీ కష్టపడి, చెమట కార్చి ఈ వస్తువులన్నిటినీ ఉత్పత్తి చేస్తున్న కోటానుకోట్ల శ్రామికులు కూటికీ, గుడ్డకూ మొగంవాచి అవస్థలు పడుతుండగా, ఏ కొద్దిమంది ధనికులో ఈ ఐశ్వర్యాన్నంతటినీ అనుభవిస్తున్నారు. ప్రత్యక్షంగా సాగుతున్న ఈ దోపిడీని దేవుని పేరుతోనూ, కర్మ పేరుతోనూ మతం సమర్థిస్తున్నది. ధనవంతుల భోగభాగ్యాలకు వాళ్ళ పూర్వజన్మ సుకృతమే కారణమనీ, ఆకలితో, రోగాలతో అలమటిస్తున్న శ్రామికజనుల దారిద్ర్యానికి వాళ్ళ పూర్వజన్మ కర్మే కారణమనీ, అంతా భగవంతుని దయ అనీ, పరమేశ్వరుని ఆజ్ఞ లేనిదే గడ్డిపోచ కూడా కదలదనీ, ఇటువంటి మూఢవిశ్వాసాలను ప్రజలు నమ్మినంతకాలం ధనవంతులు తమ ఇచ్ఛానుసారం బీదవాళ్లను దోపిడీ చేసుకుంటూ సుఖపడవచ్చు. ప్రజల కష్టాలకు కారణం దోపిడీదార్ల దుర్మార్గమే కారణమని ప్రజలు తెలుసుకున్నప్పుడు ఆ దోపిడీని అరికట్టడానికి ప్రజలు ప్రయత్నిస్తారు. అందుకనే ప్రజలు విజ్ఞానవంతులు కావడం దోపిడీదార్లకు ఇష్టంలేదు. అందుకనే ప్రజలను మూఢవిశ్వాసాలలోనే వుంచడానికి పెట్టుబడిదారీశక్తులన్నీ ప్రయత్నించడం. ఆధునిక విజ్ఞానశాస్త్రాలు ప్రజల మాతృభాషలలో బోధిస్తే అందరూ విజ్ఞానవంతులయ్యే ప్రమాదం వుంది గనుకనే మన విశ్వవిద్యాలయాలు ఇంకా ఇంగ్లీషే వుండాలంటూ పోరాడడం. దేవుని మీద భక్తి వున్నన్నాళ్లూ, దోపిడీదార్లకు అడ్డం వుండదు గనుకనే మన వారపత్రికలు తిరుపతి దేవుని నిదర్శనాలంటూ కాకమ్మ కథలు ప్రచురించడం. అందుకనే మన దినపత్రికలు అనంతమైన ఆధునిక సాహిత్యమంతా వదలి భారత, భాగవతాలను అదేపనిగా తిరగవ్రాయించి అచ్చువేయడం. అందుకనే మన సాహిత్య అకాడమీలు ప్రజలను మూర్ఖత్వంలో వుంచడానికి పనికివచ్చే రాజగోపాలాచారి రామాయణమూ, తత్త్వశాస్త్ర చరిత్రకు తెలుగు అనువాదమూ, మొదలైన గ్రంథాలకే బహుమతులివ్వడం. అందుకనే మన రాష్ట్ర ప్రభువులు భద్రాద్రి దేవాలయం పునరుద్ధరించడానికీ, శ్రీశైలానికి రోడ్డు వేయడానికీ, తిరుపతి విశ్రాంతి గృహాలు నిర్మించడానికీ చూపుతున్న శ్రద్ధలో శతాంశమైనా ప్రజలను విద్యావంతులను చేయడంలో చూపకపోవడం. అందుకనే మన బ్లాక్ డెవలప్‌మెంటు వాళ్ల ద్వారా భజనకూటాలు ఏర్పాటుచేయడంలో మన ప్రభుత్వం అంత శ్రద్ధ కనబరచడం.

అన్ని మూఢవిశ్వాసాలకూ మతమే పట్టుకొమ్మ కానీ మతాన్నీ, దేవునీ ఖండించినంత మాత్రాన మూఢవిశ్వాసాలు పోవు. ఆధునిక విద్యావిజ్ఞానాలు విస్తారంగా ప్రజలందరికీ లభ్యమైనప్పుడు మూఢవిశ్వాసాలు తగ్గిపోతాయి. కానీ అవి సమూలంగా తొలగిపోవడానికి ఈనాటి జీవిత పరిస్థితులే మారవలసి వుంది. పెట్టుబడిదారీ సమాజంలో ఎవరి కష్టము వాని అధీనములో లేదు. ఎవని భవిష్యత్తు వాని చెప్పుచేతుల్లో లేదు. అందరికీ తగినన్ని ఉద్యోగాలు లేవు గనుక, ఎప్పుడూ కొందరు నిరుద్యోగులుగానే వుండక తప్పదు. వ్యాపారాల్లో పోటీ వున్నది గనుక కొందరికి లాభాలు కొందరికి నష్టాలు తప్పవు. వస్తూత్పత్తిలో ఎక్కువ తక్కువలు కల్గినప్పుడల్లా ధరలు తలక్రిందులు కావడంతో ధనికులు దరిద్రులు కావడం, దరిద్రులు ధనికులు కావడం తప్పదు. ఈ విధంగా వ్యక్తి జీవితం ఒక అదృష్ట పరీక్షగా తయారైన పెట్టుబడిదారీ సమాజంలో మానవునికి స్వప్రయత్నం మీద కంటే దేవుని దయమీదా, తాయెత్తులమీదా, మంత్ర తంత్రాలమీదా విశ్వాసం ఎక్కువ వుంటుంది. సోషలిస్టు సమాజంలో ప్రణాళికాబద్ధమైన ఆర్థికవ్యవస్థలో మానవుని భవిష్యత్తు మానవుని ఆధీనంలోనే వుంటుంది. ఆహారం, ఆరోగ్యము, విద్య, ఉద్యోగము మొదలగువాటికి ఒకరితో ఒకరికి పోటీ వుండదు గనుక ఎవని జీవితంలోనూ హఠాత్పరిణామాలు వుండవు; వ్యక్తి జీవితం ఒక క్రమపద్ధతిలో సుఖశాంతులతో విలసిల్లుతూ వుంటుంది. ఆ సమాజంలో అన్ని పనులూ మానవ ప్రయత్నాలవల్లనే నెరవేరడమే గాక, అన్ని పనులూ మానవ ప్రయత్నాలవల్లనే నెరవేరుతాయని అందరికీ అర్థమౌతుంది. అప్పుడే తాయెత్తులమీదా, యజ్ఞయాగాలమీదా మానవులకు విశ్వాసం నశిస్తుంది. అట్టి మానవులే విజ్ఞానవంతులు.

పెట్టుబడిదారీ వ్యవస్థకూ, యజ్ఞయాగాల వంటి మూఢవిశ్వాసాలకూ అవినాభావ సంబంధం వుంది. కానీ మన ప్రభుత్వమూ, పత్రికలూ, సినిమాలూ పనిగట్టుకొని దైవికశక్తులమీద మూఢనమ్మకాలను ప్రచారం చేయకపోతే, ఈనాటి ప్రజలు సహజంగా విజ్ఞానవంతులయ్యే అవకాశాలు అనంతంగా వున్నాయి. మామూలు మనిషి ఎవ్వడూ ఈనాడు రోగం వస్తే రాంభజన చేస్తూ కూర్చోడు; వెంటనే డాక్టరు వద్దకు పోతాడు. సంతానం కలక్కపోతే ఈనాడు వివేకవంతులెవ్వరూ రావిచెట్టు చుట్టూ తిరగడంలేదు. డాక్టర్లతో పరీక్ష చేయించుకుంటున్నారు. మానవ ప్రయత్నాల ద్వారా సంతానం పరిమితం చేసుకోవడం కూడా ఈనాడు విద్యావంతులందరూ ఆచరణలో పెట్టుతున్న విషయమే. ఉద్యోగం కావాలంటే ఈనాడు తిరుపతి వెంకటేశ్వరునికి ఎవ్వరూ ముడుపు కట్టుకోవడంలేదు; తగిన ఎమ్మెల్యేను ఆశ్రయించి పని గడుపుకుంటున్నారు. డబ్బు సంపాయించడానికి ఈనాడు ఎవ్వరూ మంత్రాలు జపించడంలేదు; మంత్రులను ఆశ్రయించి ఇంపోర్టు పర్మిట్లు ఇప్పించుకుంటున్నారు. మంచి మగడు కావాలని ఈనాడు ఎవ్వరూ వరలక్ష్మి వ్రతాలు చేయడంలేదు; తగిన కట్నం చెల్లిస్తే మన్మథుని మించిన మగడు దొరుకుతాడని ఆడపిల్లలకు కూడా తెలుసు. నిజానికి ఈనాటి నిత్యజీవితంలో అందరూ పురుషకారం యొక్క విలువను గుర్తిస్తూనే వున్నారు. కానీ ఈ గుర్తింపు సాధారణంగా వ్యక్తిగత జీవితాలకు మాత్రమే పరిమితమై వుంది. మొత్తం సమాజాన్నంతటినీ మానవ ప్రయత్నాల వల్ల మార్చవచ్చుననీ, సామాజిక పరిస్థితులన్నీ మానవుల ఆధీనంలోకి తేవచ్చుననీ, ఈ విధమైన సామాజిక అవగాహన చాలా కొద్దిమందికి మాత్రమే వుంది.


ఈ సామాజిక అవగాహన తగినంతమందికి కలిగినప్పుడు సామాజిక మార్పులు శరవేగంగా వస్తాయి. అప్పుడే అందరూ సుఖపడగల సోషలిస్టు సమాజం ఏర్పడుతుంది. ఒకరినొకరు దోచుకునే అవకాశాలు లేని ఆ సమాజంలో, అందరూ కలిసి అనంతమైన సిరిసంపదలు సృష్టించగల ఆ సమాజంలో పురాకృత పాప ఫలితంగా యెంచబడుతున్న జీవితం సుఖశాంతులు నిండిన నిరంతర ఆనందోత్సవంగా మారగల ఆ సమాజంలో మూఢవిశ్వాసాలను ప్రచారం చేసేవాడే వుండడు; మూఢవిశ్వాసాలను నమ్మేవాడు అంతకూ వుండడు.

**('సవ్యసాచి' - జనవరి 1961)**

సినిమా సమీక్ష

# విశ్వాసాల విజ్ఞానంతో 'రామ్ సేతు' (2022)

- బాలాజీ (కోల్‌కతా)




**"ఈ** దేశంలో శ్రీరాముణ్ణి నమ్మని వాడి మొహానికి నల్ల రంగు పూయడమే సరైన పని" అని తాజాగా రిలీజైన 'రామ్ సేతు' అనే సినిమాలో. ఈ సినిమా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది ఓ డైలాగు వుంది. హిందీ వర్షన్‌లో ఆ డైలాగు ఇలా వుంటుంది – "ఇస్ దేశ్ మే జో శ్రీరామ్ కో నహీ మాన్‌తా, ఉస్కా మూహ్ కాలా హెూనా హీ హై!" ఈ మాటకు తెలుగు అనువాదమే పైన రాసిన ఆ వాక్యం. తెలుగు వర్షన్‌లో ఈ వాక్యం ఇలానే వుందా లేదా అని చూస్తే అక్కడ మరోలా వుంది. "ఈ దేశంలో శ్రీరాముడ్ని అవమానిస్తే ఇలానే అనాల్సొస్తుంది" అని తెలుగులో వుంది! ఇంత తేడా ఏమిటీ? డబ్బింగ్ విషయంలో శ్రద్ధ చూపలేదా లేక కావాలనే ఇలా అనువదించారా? ఇంకా సినిమా మొత్తం హిందీ, తెలుగు సంభాషణలు పోల్చుకుని చూస్తే ఇంకెన్ని దొరుకుతాయో! తమిళంలోని మాటలు ఇంకా ఎలా మారివుంటాయో! శ్రీరాముణ్ణి నమ్మకపోయినా, నల్ల రంగు పూస్తామని బెదిరిస్తున్నారు హిందీలో! అదే తెలుగులో అయితే అవమానించినంత పనిచేసినా, ఏదో అనాల్సి మాత్రమే వస్తుందిట! సౌత్ ఇండియా కోసం ఇంత కన్సెషన్ ఎందుకిచ్చారూ?

### కలిపేయ్ లేదా అణిచేయ్ :

ఉత్తర భారతంలో, హిందీ ప్రాంతాల్లో హిందుత్వ దూకుడుగా దూసుకుపోతోంది. దక్షిణ భారతంలో అదింకా పట్టు సంపాదించాలి. ద్రవిడ సంస్కృతి ఉన్న నేలలో మరీ అంత స్పీడు పనికిరాదు. బహుశా అందుకే ఆ తేడానేమో! ఆర్థిక సామ్రాజ్యవాదంలానే సాంస్కృతిక సామ్రాజ్యవాదం ఒకటుంది. అది ఆధిపత్య శ్రేణుల దేవుడ్నే అందరి దేవుడిగా చేయజూస్తుంది. ఆ దేవుడే అన్ని ప్రాంతాలకూ ప్రధాన దేవుడవ్వాలి. ప్రాంతీయ ప్రధాన దేవుళ్లు కూడా రెండో శ్రేణిలోకి నెట్టబడాలి. మాతృశక్తి ఆరాధన ప్రధానంగా ఉన్న చోట కూడా ఆధిపత్య శ్రేణుల దేవుడికే పెద్ద పీఠం వేయాలి. ఇటీవల 'కాంతారా' సినిమాలో చూపిన 'భూత కోల' అన్నది కర్ణాటక తీరప్రాంత ఆదివాసీల సంస్కృతి, అది హిందూ సంస్కృతి కానేకాదు అని అన్నందుకు కన్నడ నటుడు చేతన్ కుమార్‌పై కేసు పెట్టారు. 'కలిపేసుకోగల వాటినన్నీ కలిపేసుకుని వాటిపై హిందూ ముద్ర వెయ్యి, అలా కాని పక్షంలో వాటిని విదేశీ మతాలుగా వెలివేసి అణిచెయ్యి' అన్నది హిందూత్వ ఆది గురువుల మంత్రమే. ప్రస్తుతం ఆ ఎజెండాలో భాగమే ఈ సినిమాలన్నీ. ఒక దర్శకుణ్ణి అతడి ఫిల్మోగ్రఫీ నుంచి పసిగట్టొచ్చు. దర్శకుడు అభిషేక్ శర్మ గతంలో తీసిన సినిమాల లిస్టు చూసినా లేక ఈ సినిమాకు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వచ్చిన చంద్రప్రకాశ్ ద్వివేదీ గత చరిత్ర చూసినా ఈ సినిమా చూడనక్కర లేకుండానే ఎలా వుంటుందో ఊహించవచ్చు.

### రామ్ సేతు సినిమా :

సినిమా ఆరంభంలోనే చాంతాడంత 'డిస్‌క్లయిమర్' చదివేసిన తర్వాత ఇందులో చూపిన ఏ సంఘటననూ, ఏ తర్కాన్నీ నమ్మనక్కరలేదు. విశ్వాసాల ఆధారంగా తీర్పులు వెలువడే యుగం నడుస్తోందిప్పుడు! అయోధ్యపై తీర్పు ఎలా వచ్చిందో మనకు తెలుసు. '(నమ్మనివాళ్లు) శ్రీరాముడు లేడని నిరూపించేవరకు, రామ సేతుకు నష్టం చేసే అనుమతి ఇవ్వడం లేదు' అంటూ కోర్టులో సినీ జడ్జి తీర్పు చెబుతాడు. ఉందని చెప్పేవాడు ఉందని నిరూపించడం కాదు, లేదన్నవాడు లేదని నిరూపించుకోవాలట! బర్డెన్ ఆఫ్ ప్రూఫ్ ఎవరి మీద మోపారో చూడండి! 'ఇక్కడ బాబ్రీ మసీదు ఉండేది కాదు' అని చెప్పకుండానే తీర్పులు వచ్చిన యుగంలో హిందూత్వ గుప్పెట్లోకి వెళ్లిపోయిన సినిమా ఫీల్డు నుండి మరోరకం సినిమాలు ఆశించడం వ్యర్థం అని మరో మారు రుజువౌతోంది ఇలాంటి సినిమాలు చూస్తే!

ఈ సినిమా కథ 2007 సంవత్సరంలో నడుస్తుంది. ఆనాడు కేంద్రంలో ఎవరి సర్కారు వుందో చెప్పకపోయినా ఆ సర్కారును మళ్లీ మళ్లీ హిందువుల ముందు అప్రతిష్టపాలు చేయడానికి ఏ మాత్రం వెనుకాడదు ఈ సినిమా. హీరో పేరు ఆర్యన్ కులశ్రేష్ట. (అక్షయ్ కుమార్) ('ఆర్యుడూ, కులశ్రేష్ఠుడూనూ!' అన్న విగ్రహవాక్యం రాసుకోవచ్చు.) అతడు పేరు మోసిన ఆర్కియాలజిస్టు. ఆఫ్ఘనిస్తాన్‌లో బామియాన్ బుద్ధ విగ్రహాల పునరుద్ధరణ కోసం యూఎన్ఓ తరుపున వెళ్లిన టీమ్‌లో భాగంగా సినిమా ఆరంభంలో కొన్ని సాహసాలు చేస్తాడు. ఇతడు నాస్తికుడు కూడా. (నాస్తికుడ్ని ఆస్తికుడిగా మారిస్తే వచ్చే మజానే వేరు కదా!) ఇతడి నాస్తికత్వం ఆవశ్యకత కేంద్ర ప్రభుత్వానికి ఉంది. (సెక్యులర్ పార్టీలూ, నాస్తికులూ, రాముడిని పూజించని వారూ, కమ్యూనిస్టులూ, చరిత్రకారులూ అందరినీ కలిపి ఉతికేయాలన్న స్కీమొకటి నడుస్తోంది కదా? దాని ప్రకారమన్న మాట!) 'సేతు సముద్రం ప్రాజెక్టు'కు హిందూ నమ్మకస్తుల నుండి వ్యతిరేకత వస్తోంది. దాన్ని ఆపడానికి హైకోర్టులో కేసు కూడా నడుస్తోంది. కానీ ఈ ప్రాజెక్టులో ఇంద్రకాంత్ (నాజర్) అనేవాడికి లాభాలున్నాయి. ప్రభుత్వ పెద్దలతో ఆయనకి సంబంధాలున్నాయి. కాబట్టి 'రామసేతువు మానవనిర్మిత కట్టడం కాదు, ప్రకృతి సహజంగా ఏర్పడినది' అని ఆర్యన్ లాంటి వ్యక్తి నుండి ఒక అఫిడెవిట్ కావాలి – కోర్టుకు సమర్పించడానికి! కానీ ఆర్యన్ 'రామాయణం కావ్యం మాత్రమే, చరిత్ర కానే కాదు' అని రెండు మాటలు ఎక్కువే

రాసేసరికి గొడవ ఎక్కువై సర్కారు బ్యాక్‌ఫుట్‌లోకి వస్తుంది. ఐతేనేం? సుప్రీమ్ కోర్టు ఇంకా మిగిలేవుంది కదా? 'రామ సేతు' మానవ నిర్మితం కాదు అని చెప్పే పక్కా ప్రమాణాలు సంపాదించడానికి ఇంద్రకాంత్ వత్తిడి మేరకు ఆర్యన్‌ను సముద్ర గర్భంలో పరిశోధన చేసే పనిలో మళ్లీ నియోగిస్తుంది అప్పటి కేంద్ర ప్రభుత్వం. ఈ పనిలో అతడికి తోడుగా ఓ గోవాకు చెందిన ఒక పర్యావరణవేత్త (జాక్వెలిన్ ఫెర్నాండేజ్) వుంటుంది. ఈసారి ప్రభుత్వానికి మొదటికే మోసం వస్తుంది. అంత గొప్ప నాస్తిక మహాశయుడు పుష్కర్ భట్నాగర్ అనే ఆయన రాసిన 'డేటింగ్ ది ఎరా ఆఫ్ లార్డ్ రామ్' (రాముడి యుగపు కాలనిర్ణయం) అన్న సూడో సైన్సు పుస్తకాన్ని నమ్ముతున్నాడు. వాల్మీకి రామాయణంలోని గ్రహగతుల విశ్లేషణ ప్రకారం రాముడు క్రీస్తుపూర్వం 5114 జనవరి 10వ తేదీన పుట్టాడని ఆ పుస్తకం చెబుతోంది. కనుక రామ సేతు వయసు దాదాపు 7000 సంవత్సరాలు అయివుండాలి! రామ శిల వయసు గనుక అంతకంటే ఎక్కువ అని నిరూపించగలిగితే చాలు అనుకుని పని ప్రారంభిస్తాడు ఆర్యన్. సముద్రం లోపలి నుండి గుమ్మడి కాయ లాంటి నీట తేలే రాయినొకదాన్ని తీసుకొస్తాడు. తీరా కార్బన్ డేటింగ్ లెక్కల ప్రకారం ఆ శిల వయసు 7000 సంవత్సరాలు అని 'తేలుతుంది'. కనుక అది రామశిలే అనీ, రామాయణంలోని రామ సేతు నిర్మాణం నిజమేననీ నమ్మి మిగతా పని సాగిస్తాడాయన. అక్కడ్నుంచి సినిమా ఆఖరయ్యే వరకూ రామాయణం గురించీ, భారతీయ సంస్కృతి గురించీ మనకే కాదు, కోర్టు వారికీ లెక్చర్లు దంచుతూ వుంటాడు. ఢిల్లీ మెట్రోను కట్టేటపుడు కుతుబ్ మినార్‌ను వదిలేస్తూ కట్టారు తెలుసా అని లెక్చరిస్తాడు గానీ, కరోల్‌బాగ్ ఆంజనేయుడి విగ్రహానికీ మినహాయింపు ఇచ్చిన సంగతిని మాత్రం దాచేస్తాడు. తాలిబాన్లు బుద్ధుని విగ్రహాల్ని ధ్వంసం చేయడాన్ని విమర్శిస్తాడు గానీ అయోధ్యలో మూకస్వామ్యం బాబ్రీ మసీదును కూల్చడం సంగతిని మాత్రం దాటేస్తాడు. అతడి లెక్చర్లు ఎంతలా సాగుతాయంటే, 'శ్రీ రాముడికి నీకంటే మంచి వకీలు దొరకడు' అని అతడి భార్య అతడితో అన్నంత! ప్రొఫెసర్ అయిన అతడి భార్య (నుస్రత్ బరూచా) వాట్సప్ సమాచారం వల్లించే 'అంధభక్తురాలి' ప్రతిరూపం అన్నమాట! ఇంట్లో ఆమె ప్రధాన కర్తవ్యం భర్తకు టీ చేసి ఇవ్వడం మాత్రమే!

సరే, మన కథలోని విలన్ గారికి హీరోపై కోపం వస్తుంది. అతడు ఆర్యన్‌ను చంపేయమని తన మనుషులకు పురమాయిస్తాడు. శ్రీలంకలో తమిళ మిలిటెంట్ల పోరాటం సాగుతున్న ఆ కాలంలో ఆర్యన్ జాఫ్నా జలాల్లోకి తప్పించుకోవడానికి అతడికి ఏపీ అనే తెలుగు ఇండస్ట్రీ 'సత్యదేవ్' కాపాడతాడు. ఏపీ సాయంతో తదుపరి రిసెర్చి టకటకా సాగిపోతుంది. శ్రీలంకలో రావణుడి అస్తిత్వాన్ని నిరూపిస్తే ఇండియాలో రాముణ్ణి నిరూపించినట్టే అన్న యాంగిల్లో రెండో విడత పరిశోధన సాగుతుంది. సరిగ్గా టైంకి హీరో రామభక్తుడిగా, తన భార్యకంటే బ్రెయిన్‌లెస్ అంధభక్తుడిగా మారిపోవడంతో ఈ ఊహాతీత సినిమాకు గట్టి ఊతం అందుతుంది. త్రికూట పర్వతం, రావణ సొరంగం, అశోక వాటిక, సంజీవనీ ఔషధం – ఇలా అన్నీ ఒకటి తర్వాత ఒకటి దారి పొడుగునా దొరికిపోతూనే వుంటాయి. వాల్మీకికీ, తులసీదాసుకీ తెలీనన్ని సంగతులు హీరోకీ, అతడి ద్వారా ప్రేక్షకులమైన మనకూ తెలిసి పోతుంటాయి. చివరాఖరి ట్విస్టేమిటంటే అసలు చనిపోయాడనుకున్న 'ఏపీ' అన్నవాడు సాక్షాత్తూ 'అంజనీ పుత్రుడు'. ఎస్! మీరు విన్నది నిజం! స్వయానా ఆ ఆంజనేయస్వామే మన నాస్తిక హీరోను రామభక్తుడిగా మార్చి, అతడి ద్వారా తన స్వామి అస్తిత్వాన్ని సుప్రీం కోర్టు ముందు నిరూపింపజేయాలని సినిమాలోకి ఓ పాత్రగా వచ్చేశాడన్న మాట! కావ్యం చరిత్రగా మారడమే కాదు హిందీ సినిమా మహాద్భుత దశకు చేరిన సంగతి అర్థమై మనం నిశ్చేష్టులమైపోతాము.

ఈ సినిమా తెలివిగా ముఖ్యమైన కొన్ని చారిత్రక వాస్తవాల్ని దాచేసింది. పాయింట్ల వారిగా వాటిని చూద్దాం –

1. భారతదేశపు పశ్చిమ తీరం నుండి తూర్పు తీరానికి పోయే భారీ ఓడల కోసం 400 నాటికల్ మైళ్ల అదనపు దూరాన్నీ, 36 గంటల అదనపు ప్రయాణకాలాన్నీ తగ్గించే 25 వేల కోట్ల వ్యయంతో కూడిన 'సేతు సముద్రం షిప్పింగ్ కెనాల్ ప్రాజెక్టు'ను (ఎస్ఎస్‌సిపి) ఆమోదించింది 1998 లో వాజ్‌పేయి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్ హయాంలో ప్రాజెక్టు పని ఆరంభం మాత్రమే జరగబోయింది. కానీ విచిత్రమేమిటంటే ఆ బీజేపీకి చెందిన సుబ్రహ్మణ్యస్వామి, రామగోపాలన్ వంటి వారే దీన్ని ఆపాలంటూ మద్రాసు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు.

2. ఒకప్పటి బొగ్గు, ఖనిజవనరుల శాఖామాత్యులు ఉమా భారతిగారి ఆదేశం మేరకే డిసెంబర్ 2002 నుండి మార్చి 2003 వరకు 'ప్రాజక్ట్ రామేశ్వరం' పేర భారత భూగర్భ సర్వే సంస్థ పరిశోధనలు జరిపింది. ఈ పరిశోధన కూడా ఆ ప్రాంతంలో మానవనిర్మిత కట్టడాలు లేవని చెప్పింది. కానీ ద్వంద్వ వైఖరి ఏమిటంటే ఆవిడే తర్వాతి కాలంలో రామసేతువు ఉద్యమకారిణి అయింది. ఈ సినిమాల వాళ్లు చాలా సేఫ్‌గా ఇలాంటి విషయాలన్నీ దాటేస్తారు లేదా దాచేస్తారు.

3. మద్రాసు హైకోర్టుకు జవాబు ఇవ్వడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తరుపున ఇద్దరు భారత పురాతత్వ శాఖ (ఎఎస్ఐ) ఉన్నతాధికారులను కోరింది. వారు భారత భూగర్భ పరిశోధన శాఖ (జీఎస్ఐ) వైజ్ఞానిక పరిశోధనా ఫలితాల ఆధారంగా సంబంధిత దస్తావేజులు జతపరిచి మరీ అఫిడవిట్‌ని సమర్పించారు. రాముడు చారిత్రక పురుషుడు కాడనీ, రామసేతువు మానవ నిర్మాణం కాదనీ అందులో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. కానీ వోటు బ్యాంకు రాజకీయాలకు తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అధికారుల్ని సస్పెండ్ చేసి, తను సరికొత్త అఫిడవిట్‌ని తదుపరి కాలంలో ప్రవేశపెడతానని కోర్టుకు తెలిపింది. "హిమాలయాలు హిమాలయాలే, గంగ గంగే, రాముడు రాముడే. రాముడి అస్తిత్వం కోసం ఆధారాలు వెతకాల్సిన పనిలేదు" అంటూ స్టేట్మెంటిచ్చాడు యూపీఏ న్యాయశాఖ మంత్రి హంసరాజ్ భరద్వాజ్. కేవలం కాంగ్రెస్‌ను అప్రతిష్టపాలు చేయడమే పనిగా పెట్టుకున్న ఈ సినిమాలు కాంగ్రెస్‌లోని ఈ సాఫ్ట్ హిందుత్వ పోకడను సైతం గుర్తించ నిరాకరిస్తాయి. అసలు కాంగ్రెస్‌కు ఎటువంటి మైలేజీ కూడా దక్కకూడదని వీటి ఉద్దేశం.

4. రామాయణంలోని యుద్ధకాండ 22:66–70 ప్రకారం వానరులు మొదటిరోజు 14 యోజనాలు, రెండవరోజు 20 యోజనాలు, మూడవరోజు 21 యోజనాలు, నాల్గవరోజు 22 యోజనాలు,

ఐదవరోజు 23 యోజనాలు – మొత్తం ఐదు రోజుల్లో 100 యోజనాలు శ్రీలంక గట్టువరకూ రామ సేతు నిర్మించి చివరకు లంక ఒడ్డుకు చేరారు. యోజనము అనగా 3 మైళ్ళు. అనగా ఐదు రోజుల్లో 300 మైళ్ళు నిర్మించడం జరిగింది. మైలు అనగా 1.6 కిలోమీటర్లు, అనగా వానరులు 5 రోజుల్లో 480 కిలోమీటర్ల వంతెన కట్టడం జరిగుండాలి. కానీ రామసేతువు అసలు పొడవు 48 కి.మీ. ఏది కరెక్టు? 480నా లేక 48నా? ఐదు రోజుల్లో 48 కి.మీ. వారధి కట్టడం కూడా సాధ్యమా?

5. 'తేలి''పోయే' రాళ్ళు ఒక దగ్గర పడుంటాయా? సముద్ర ప్రవాహంలో 'తేలి' ఎటో'పోవా?' మరో సంగతి ఏమిటంటే రామాయణం ప్రకారం పలురకాల చెట్లకాండాలతో సేతువును తయారుచేస్తే, జిఎస్ఐ డ్రిల్లింగు సాంపిల్లలో చెట్లు, ఆకుల శిలాజాల అవశేషాలేవైనా దొరకాలి కదా? అసలు సముద్రంలో ఆ మాత్రం దూరం ప్రయాణించడానికి ఇన్ని తిప్పలుపడి వారధి కట్టడమెందుకు? నౌకల్లో, తెప్పల్లో వెళిపోవచ్చు కదా?

6. సంఘ పరివారం చెప్పే త్రేతాయుగం లెక్కల మేరకు శ్రీలంక ప్రాంతంలో 17 లక్షల 50 వేల సంవత్సరాల పూర్వం మానవ మనుగడ వుండి తీరాలి. కానీ శాస్త్రవేత్తలు నిర్ద్వంద్వంగా తేల్చిన ప్రకారం హోమో సేపియన్స్‌గా పిలవబడే ఆధునిక మానవుడి పరిణామం మహా అయితే 2 లక్షల సంవత్సరాల క్రితమే జరిగింది. భారత ఉపఖండానికి మానవుని రాక లక్ష సంవత్సరాలనాడే జరిగింది. కాబట్టి రాముడు చారిత్రక పురుషుడైతే అతడే కాలం వాడో ముందు తేల్చుకోవాలి. 17 లక్షల 50 వేల సంవత్సరాల త్రేతాయుగమూ కావాలి, 7000 యేళ్ల భట్నాగర్ సిద్ధాంతమూ కావాలంటే ఎలా కుదురుతుంది?

7. సాధారణంగా రాళ్ళ సాంద్రత నీటి సాంద్రత కంటే అధికం. అవి నీట మునగవలసిందే. కానీ అగ్నిపర్వతాల కారణంగా ఏర్పడే 'ప్యూమైస్' బండల్లో ఖాళీ స్థలాలు ఏర్పడి వాటిలోకి గాలి దూరడం వలన అవి కొంతసేపు మాత్రమే అతి సాంద్రతరమైన నీటిలో తేలే అవకాశం వుంది. కానీ ఖాళీల్లో నీళ్ళు నిండితే మునిగి పోవలసిందే. అన్ని ప్యూమైస్ రాళ్ళు ఆ ప్రాంతానికి ఎక్కణ్నించి వచ్చాయి? రామేశ్వరం దగ్గర్లో అగ్ని పర్వతాలు వున్న దాఖలాలు లేవు. నిజానికి రామ సేతు దగ్గరివి సున్నపురాళ్ళు. కానీ ఈ సినిమాలో హీరో గుమ్మడికాయలాంటి రాయిని సముద్ర గర్భం లోపలినుంచి తీసుకురావడం, సముద్రంపై నడుచుకుంటూ రావడం, ఆ రాయిని కోర్టు వారి ముందు వుంచి వాదించడం చాలా హాస్యాస్పదంగా వుంది.

8. డిస్కవరీ ఛానెల్ ఫొటోలు చూపి 'నాసా' వారు కూడా రామ సేతును నిర్ధారించారని హిందూత్వవాదులు చాలా సార్లు ప్రచారాలు చేశారు. కానీ ప్రతిసారీ 'నాసా' వారు తాము అలా చెప్పలేదని తేల్చేశారు. కాబట్టి వాట్సప్‌లకే పరిమితమైన ఈ సంగతిని సినిమాలో చూపడానికి సినిమా వారు జంకారేమోననిపిస్తోంది.

సినిమా ఆఖర్లో కోర్టు ఆవరణలో గాంధీజీ విగ్రహాన్నీ, దానికింద 'హే రాం' అని రాసి వుండటాన్నీ ఫోకస్ చేసి చూపించాడు దర్శకుడు. అంతటి రామభక్తుడు గాంధీజీ కూడా రాముణ్ణి పురాణ పురుషుడిగానే నమ్మాడు. ఒకచోట ఆయన ఏమన్నాడో చూడండి.

"I like the ideal of Rama and Janaka. They owed nothing against the people. They lived in their midst a life not above than theirs. But these may not be regarded as historic personages." (*The Selected Works of Mahatma Gandhi,* Vol. V, p. 364 (2006), (Navjivan)

ఈ సినిమాలో గాంధీజీని వినియోగించుకున్న బాలీవుడ్ హిందూత్వ దర్శకులు గాడ్సే గురించి తీసే సినిమాల్లో ఆయన్ని ఎలా చూపిస్తారో చూడాలని వుంది.

## చైతన్యవాహిని

**20-10-2022, తెనాలి :** విప్లవవాది, పూర్వ పోస్టుమాస్టరు, కార్మికనాయకుడు పొట్టి పోలేశ్వరరావు తన 81వ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన రాజకీయ చర్చా కార్యక్రమాన్ని కనపర్తి బెన్‌హర్ సంధానకర్తగా నిర్వహించారు. జనసాహితి సభ్యుడు, రచయిత చందు నాగేశ్వరరావు చర్చ ప్రారంభిస్తూ నేటి ప్రపంచ రాజకీయాలలో సామ్రాజ్యవాద పాత్ర వివరించారు. యుక్రెన్‌ను రష్యా పైకి ఎగదోసి అమెరికా మూడో ప్రపంచ యుద్ధానికి బీజం వేసిందన్నారు. పోస్టల్‌శాఖకు చెందిన కాంతారావు, పోస్టల్ కార్మికరంగంలో పోలేశ్వరరావు, కామ్రేడ్ పురుషోత్తమరాజు ఇచ్చిన ప్రోత్సాహంతో చేసిన కృషిని వివరించారు. 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ పుట్టినరోజు జరపుకోవడంలో ఇదొక ప్రత్యామ్నాయ సంస్కృతి అన్నారు. ఈ సందర్భంగా గదర్ వీరుల్లో ఒకరైన దర్శి చెంచయ్యనూ, ఆనాటి దేశభక్తులూ చేసిన త్యాగాల్నీ, పోరాటాల్నీ గుర్తుచేస్తూ, ఈనాడు బిజెపి దేశాన్ని వెనక్కి నడిపిస్తోందనీ, దీనికి వ్యతిరేకంగా చురుకుగా పోరాడాలన్నారు. గుంటూరు నుండి వచ్చిన విశ్రాంత లెక్చరర్ ఎన్.వి. నరసింహారావు, సి. హెచ్. వెంకటేశ్వర్లు సమకాలీన రాజకీయాలలో విప్లవవాదుల పాత్రను ప్రస్తావించారు. విశ్రాంత ప్రిన్సిపల్, హేతువాది హజరత్ ఆలీ, బి. శివనాగేశ్వరరావు తదితరులు ప్రసంగించి పోలేశ్వరరావుకు శుభాకాంక్షలు తెల్పారు.

**21-10-2022, తెనాలి :** అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో బి.వి.రావు అధ్యక్షతన అభ్యుదయ కవి అనిసెట్టి సుబ్బారావు శతజయంతి సభ జరిగింది. అనిసెట్టి సాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేట్ సంపాదించిన డా॥ పి.వి. సుబ్బారావు అనిసెట్టి కృషినీ, జీవిత విశేషాలనూ వివరించారు. కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ అనిసెట్టి తన సాహిత్య జీవితపు తొలిదశలో రాసిన రచనలను వివరించారు. ఇంకా ఈ సభలో యర్రంశెట్టి హనుమంతరావు, పెద్దింటి నాగమణి, కనపర్తి బెన్‌హర్, పాతూరి సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు. ప్రజానాట్యమండలి గాయకుడు ఎ. రామారావు అభ్యుదయ గేయాలు పాడారు. శ్రీదేవి వందన సమర్పణ చేశారు.

# ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

**సంపుటి : 16 సంచిక : 2 నవంబర్ 1992**

**ప్రపంచాన్నే** కుదిపేసిన పదిరోజుల సందర్భంగా మహానాయకుని మహోద్వేగ ప్రకటన – "అధికారాలన్నీ సోవియట్లకే!" అని పిలుపునిస్తున్న లెనిన్ ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. రెండవ, మూడవ అట్టపై కనకయ్య రాసిన 'సారా బందుపెట్టం' పాటనూ, నాలుగవ అట్టమీద వింటర్ ప్యాలెస్‌పై దాడికి పథకం రచనలో లెనిన్, స్టాలిన్‌ల చిత్రాన్ని ముద్రించారు. "సారా"జకీయం" సంపాదకీయంలో గత రెండు నెలలుగా సాగుతున్న సారా వ్యతిరేక పోరాటంను పరిచయం చేస్తూ సారా వ్యాపారాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సారా వ్యతిరేక ఉద్యమం సాగాలన్నారు. ఈ ఉద్యమం సారా వ్యతిరేక స్పృహ నుండి చైతన్య స్థాయిని అభివృద్ధి చేసుకుంటూ సంఘటితమవ్వాలని, గ్రామ, ప్రాంతీయ స్థాయిల్లో కూడా 'సారా వ్యతిరేక ప్రజా పోరాట కమిటీలు' రూపొంది సారాని రానివ్వకుండా నిరోధించాలని, అందుకు అడ్డు తగిలే స్వార్థపర శక్తుల ఆట కట్టించాలని పిలుపునిస్తూ – సారా వ్యతిరేక పోరాటానికి సంఘీభావం తెలియచేశారు.

అక్టోబరు విప్లవాన్ని స్మరించుకుంటూ వి.ఐ. లెనిన్ ప్రావ్ద నం.2, 3-1-1913 సంచికలో అంతర్జాతీయ గీతం (ఆకలి మంటల మలమలలాడే....) అనే కార్మికవర్గ గీత రచయిత, ఫ్రెంచ్ కార్మిక కవి 'ఏజెన్ పోత్యే 25వ వర్ధంతి' గురించి రాసిన వ్యాసాన్నీ, రష్యాలో దేశభక్తియుత మహాయుద్ధం బద్ధలయినపుడు రచయితల యూనియన్‌కి నాయకత్వం వహించిన కవి, యువ కమ్యూనిస్టు లీగ్ తాతార్ – బష్కిర్ బ్యూరో కేంద్రకమిటీలో పనిచేస్తూ 'బుల్లి కామ్రేడ్స్' 'అక్టోబర్ పిల్లలు' బాలల పత్రికలకు సంపాదకులైన మూసా జలీల్ (1906–1944) రాసిన 'చేరుమాలు' కవితనూ, 'విశ్వసాహితి' పత్రికకు లూషన్ పంపిన జవాబును, బి. రామానాయుడు రాసిన 'మనం కలగనాలి' కవితనూ, 'దిటవు గుండెలు' గ్రంథం ఆధారంగా క్రాంతి కిరణ్ రాసిన 'మెరుపువీరుడు కుజ్నెత్సోవ్'ను త్యాగమేరా జీవితం–3' శీర్షికలో పరిచయం చేశారు. 'ఆంక్షలు–నిషేధాలు' శీర్షికలో కొత్తపల్లి రవిబాబు "కరపత్రాల బాంబులను నిషేధించిన బ్రిటీష్ ప్రభుత్వం" కరపత్రాన్ని (వి. కృష్ణ అనంత్, 6-9-92 'ది హిందూ' సౌజన్యంతో) పరిచయం చేశారు. డా॥ శాంతికుమార్ రాసిన "సాంస్కృతిక సామ్రాజ్యవాదము – స్టార్ టి.వి" వ్యాసాన్నీ 'పుస్తక సమీక్ష' శీర్షికలో విజయనగరం 'వెలుగు' పుస్తకాలు; అవసరాల రచన 'మన గురజాడ'; కె.వి.ఆర్. రచన 'కన్యాశుల్కం : టీకాటిప్పణి' పుస్తకాలను ఛాయరాజ్ సమీక్ష చేశారు. గోపరాజు నారాయణరావు రాసిన 'బాబూ! ఇక లాగలేను!' కథనూ; 'కవితలు' శీర్షికలో పాపినేని శివశంకర్ రాసిన 'చీకట్లో చీకటితో'; కొండపల్లి కోటేశ్వరమ్మ రాసిన 'నీ ఉద్యమం – నవోదయం'; తిరునగరి రాసిన 'నీతిలేని ఆదాయం'; రవిబాబు రాసిన "సం'క్షుభి'త సోమాలియా"; చెరుకు సుధాకర్ రాసిన 'సింధూర సాక్షిగా'; చిన్ని రాసిన 'గమ్యం కోసం' కవితలనూ; కె.వి.పతి రాసిన 'వద్దుర బాబు సారా'; సకిన్ రాసిన 'సారాబందు' జనం పాటలను ప్రచురించారు. 'స్పందన' శీర్షికలో దివికుమార్ రాసిన "సర్కస్ ఫీట్ల "పురాణం" వ్యాసాన్నీ; పి. చంద్రశేఖర్ ఆజాద్ నిర్వహిస్తున్న పిల్లల ప్రపంచం శీర్షికలో టాల్‌స్టాయి 'ఇద్దరు మిత్రులు' నుండి 'గబ్బిలాయి' కథనూ; 'తనెవరో తెలియదు' అంటూ 'అతని రచన' చెప్పి – వాటి గురించి చిత్రాల్ని గీయమన్నారు.

1/8 డెమ్మీలో పుటలు : 64; వెల : 5 రూ॥

# 'రెక్కలు' కవితాప్రక్రియ సృష్టికర్త యం.కె. సుగమ్‌బాబు మృతి

**పైగంబరకవి,** ప్రయోగవాద కవి యం.కె. సుగమ్‌బాబు తన 78వ యేట హైదరాబాదులో 18-10-2022న మరణించారు. ఆయన పెదకాకానిలో 1-4-1944న ఒక పేద ముస్లిం కుటుంబంలో జన్మించారు. ఆయన అసలుపేరు మహబూబ్ ఖాన్. కలం పేరు సుగమ్ బాబు.

తాడికొండలో 10వ తరగతి, ఎ.సి. కళాశాల, గుంటూరులో తెలుగు సాహిత్యంలో బి.ఏ. చదివారు. కొంతకాలం వాచ్ రిపేరుషాపు నిర్వహించి మద్రాసులో సినీరంగంలో చేరారు. ఆ తర్వాత హైదరాబాదులో 'దక్కన్ క్రానికల్' పత్రికలో 1978లో జర్నలిస్టుగా ప్రవేశించి 1999 వరకు పనిచేశారు. ఆయన మొదటి కవిత 'మట్టి బొమ్మ' 1963 డిసెంబరు 'భారతి'లో ప్రచురితమైంది. 1970లో పైగంబర కవుల బృందంలో వుండి అదే ఏడాది వి.ర.సం.లో చేరారు. ఆయన రాసిన 'సూరీడు' కవితల, పాటల సంపుటి నిషేధానికి గురైంది. దానిలో ఆయన చేనేత కార్మికులపై రాసిన పాట 'కుయ్యి కుయ్యిమంటు కుమలుతావెందుకు, కుమలమాకే నీవు నాడే! – నీవు నేసిన గుడ్డ అమెరికా బోతుంది, కుమలమాకే నీవు నాడే!' బహుళ ప్రచారం పొందింది. 'లెనిన్.. లెనిన్' కావ్యం ద్వారా సమసమాజ స్థాపన ఆవశ్యకతను సూచించారు.

వచనకవితారూపం తన ప్రాభవం కోల్పోయి, కేవలం వచనాన్నే తుంటలుగా చేసి కవితగా ప్రచారం పొందుతున్న దుస్థితిని గమనించి 'రెక్కలు' అనే లఘురూప కవితారూపాన్ని 2002లో సృష్టించారు. ఈ ప్రక్రియలో తానే 6 సంపుటాలు ప్రచురించారు. ఈ 'రెక్కలు' కవితారూపం విస్తృతంగా కవులు ఉపయోగిస్తున్నారు. సుగమ్‌బాబు రెక్కలు ఇంగ్లీషులోకి 'Wings' అనే పేరుతో అనువాదమయ్యాయి. 2019లో లఘురూప కవితావేదిక స్థాపించారు. వీరు గురజాడపై నిర్మించిన డాక్యుమెంటరీ 'అస్తమించిన సూర్యుడు'కు 1985లో బంగారు నంది బహుమతి లభించింది.




**చరితార్థులు-2 (The Immortals) :**

1780 నుండి 1947 వరకు బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమంలో పాల్గొన్న 155 మంది ముస్లిం యోధుల చిత్రపటాలు తెలుగులో, ఇంగ్లీషులో సంక్షిప్త వివరణలున్న రెండోభాగం ఇది.

ఎం.కాం.; ఎల్.ఎల్.బి; సాహిత్యరత్న (హిందీ) పట్టాలు సాధించిన సయ్యద్ నశీర్ అహమ్మద్ న్యాయవాదిగా, పాత్రికేయునిగా పనిచేసి, ఇప్పుడు భారత స్వాతంత్రోద్యమంలో ముస్లిముల పాత్రను వివిధ కోణాలలో వివరిస్తూ 1998 నుండి 22 గ్రంథాలు రచించారు. హిందూ-ముస్లిం మత విద్వేషాలను రెచ్చగొడ్తున్న బిజెపి కుయుక్తులను వమ్ము చేసేందుకు ఈ పుస్తకాయుధాలు ఉపయోగిస్తాయి. ముస్లిములు భారతజాతిలో మిళితమైపోయారనీ, వారిని విడగొట్టి చూడటం చారిత్రాత్మకమైన తప్పిదమని ఈ పుస్తకాలు రుజువు చేస్తాయి. నశీర్ రాస్తున్న ఈ పరిశోధనాత్మక పుస్తకాలకు ఆదరణ లభించడం, ఇతర భాషలలోకి అనువాదం కావడం ఆనందించాల్సిన విషయం.

చరితార్థులు 1,2 సంపుటాలను ఆల్బమ్ పరిమాణంలో ఒక్కొక్కటి 366 పుటలతో, ఛాయాచిత్రాలతో ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్ పేరుతో రచయిత ప్రచురించారు. ఒక్కొక్క సంపుటి వెల ఒక వేయి రూపాయలు. ప్రచురణ నెం.26; ప్రథమ ముద్రణ : 2022. దొరుకుచోటు : ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. సి3, శ్రీరామ్స్ ఆర్కేడ్, అమరావతి రోడ్, ఉండవల్లి, తాడేపల్లి మండలం, గుంటూరుజిల్లా - 522501. సెల్: 9440241727. email: naseerahmedsyed@gmail.com

**భారత జాతీయోద్యమం - మహోజ్వల వారసత్వం :**

మోడీ ప్రకటించిన 'అమృత్ మహోత్సవ్' సందర్భంగా, కేవలం జాతీయ జెండాలు ఎగురవేయడం కాదు - ఆ జెండా వెనుక సాగిన మహత్తర స్వాతంత్ర్య పోరాట చరిత్రను ఈ తరంవారు తెలుసుకోవాలన్న ఆశయంతో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థిసంస్థ (పిడిఎస్ఓ), నవయువ సమాఖ్య (ఎన్‌వైఎస్) సంయుక్తంగా ఈ విలువైన పుస్తకాన్ని ప్రచురించారు.

ఈనాటి సైబర్‌తరంవారు వారి పూర్వీకులు వలస పాలనకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమాలు, ఆందోళనలు, పోరాట త్యాగాలు తెలుసుకోవడం ద్వారా వారి సామాజిక బాధ్యతను కొంతైనా గుర్తిస్తారు. బూతుల భాష మాత్రమే తెలిసిన ఈనాటి రాజకీయ నాయకులకూ, ఎన్నో త్యాగాలు చేసి, ఎన్నో కష్టాలు అనుభవించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఆనాటి వీరులను ఈ పుస్తకాలు చదవడం ద్వారా గుర్తించి ఎటువంటి పోరాటాలు చేయాలో తెలుసుకుంటారు.

1857 తిరుగుబాటుపై సి.వి. 1957లో 'సందేశం'లో రాసిన వ్యాసం; రైతాంగ పోరాటాలపై 2005 నవంబర్ 'ప్రజాసాహితి'లో గోపరాజు నారాయణరావు వ్యాసం, కార్మికులు, మహిళలు, విద్యార్థులపై మరో మూడు వ్యాసాలు ఆయారంగాలలో జరిగిన ఉద్యమాలను వివరిస్తున్నాయి.

అన్ని రంగాల ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేసే సామ్రాజ్యవాద, కార్పొరేట్ల అనుకూల పాలక విధానాలనూ, మతం పేరుతో ప్రజలలో చిచ్చుపెడుతున్న పాలకుల ప్రయత్నాలను బట్టబయలు చేస్తూ కరపత్రాలూ, లఘు పుస్తకాలూ విరివిగా ప్రచురించి ప్రచారం చేయాల్సిన అవసరం నేడు వుంది. వీటిని హైస్కూళ్ళకూ, కళాశాలలకూ తీసుకువెళ్ళి వాస్తవాలను యువతరానికి తెలియచేసే బాధ్యత యువజన సంఘాలూ, విద్యార్థిసంఘాలూ స్వీకరించాలి. పాలకవర్గాలకు సంబంధించిన సంస్థలు సోషల్‌మీడియా ద్వారా చేస్తున్న దుష్ప్రచారాన్ని సోషల్‌మీడియా ద్వారానే త్రిప్పికొట్టాల్సిన అవసరం కనపడుతోంది.

1/8 డెమ్మీలో 80 పుటల ఈ పుస్తకం వెల : రూ.75/- ప్రథమముద్రణ : సెప్టెంబరు 2022. ప్రతులకు : మైత్రీబుక్‌హౌస్, 28-29-6, జలీల్‌వీధి, కార్ల్‌మార్క్సురోడ్డు, విజయవాడ - 520002.

**డా॥ ఘంటావిజయ్‌కుమార్ 5 బులెటిన్లు :**

ఆంధ్రప్రదేశ్ మేథావుల ఫోరం బాధ్యుడు, సీనియర్ జర్నలిస్టు డా॥ ఘంటా విజయ్‌కుమార్ కీర్తిశేషులైన తన భార్య ఇందిర స్మారకార్థం 'ఘంటా సిరీస్' పేరుతో 16 పేజీల బులెటిన్లు మూడు ప్రచురించారు. అవి : 1. అమూల్య చందు కవిత్వాన్ని పరిచయం చేస్తూ, ఆమె రాసిన 8 కవితలున్న బులెటిన్; 2. అంబేడ్కర్ ఫోర్త్ ఎస్టేట్; 3. మహాకవి శ్రీశ్రీ. దీనిలో 5, 6 పుటలలోని విషయమే మరల 10, 11 పుటల్లో అచ్చయింది.

నెల్సన్‌మండేలా శతజయంతి ఉత్సవాల ప్రత్యేక బులెటిన్ నాల్గవది. గుర్రంజాషువా 50వ వర్ధంతి ప్రత్యేక బులెటిన్ ఐదవది. మండేలాపై వ్యాసం అనువాదం బాగా లేదు. కొన్ని వాక్యాలు అస్సలు అర్థంకావు. దీనిలోనూ ఒకే విషయం రెండుసార్లు అచ్చయింది.

ఈనాటి యువతరానికి చక్కటి కేప్సూల్స్ (Capsules) ఇవి. తెలుగును నిర్లక్ష్యం చేస్తున్న యువతరానికి ఇటువంటి చిన్న చిన్న పుస్తకాలతో సాహిత్య, సామాజిక విప్లవకారులను పరిచయం చేయడం చక్కని ప్రయత్నం. మనకు చారిత్రక దృష్టి తక్కువ అని కూడా ఈ బులెటిన్లు రుజువు చేస్తున్నాయి. ఎలాగంటే ఏ పుస్తకం మీద కూడా ప్రచురణ కాలం ముద్రించలేదు. మండేలా పుట్టిన తేదీ వుందిగనుక 2018లో శతజయంతి అనీ, జాషువా మరణించిన తేదీ వుంది గనుక 2021న 50వ వర్ధంతి అనీ గ్రహించాలి. అలాగే శ్రీశ్రీ జయంతి, వర్ధంతి ఆ బులెటిన్‌లో లేదు.

అన్ని బులెటిన్లలోనూ ఆ అంశానికి సంబంధించిన తెలుపు-నలుపు చిత్రాలు ఆకర్షణీయంగా ముద్రించారు. ఒక్క 'విశ్వనరుడు' 'నల్ల సూరీడు' పుస్తకాలలో తప్ప మిగిలినవాటిలో అక్షరదోషాలు వెదికితేగాని దొరకనంత తక్కువున్నాయి. ముద్రణ అందంగా వుంది. వీటికి వెల లేదు. ఇవి నెలకొకటి వస్తాయో లేక అప్పుడప్పుడు మాత్రమే వస్తాయో తెలియదు.

వీటన్నిటికీ విషయ సేకరణ, రచనలో ఘంటాకు 'మల్లెతీగ' కలిమిశ్రీ సహకరించారు.

చిరునామా : ఘంటా విజయకుమార్, నందిగామ, కృష్ణాజిల్లా. ●


కవిత

# కాలం కుత్రుల నడుమ

– ఎస్. శంకరరావు

గ్లోబల్ ప్రభువుల
అడుగులకు మడుగులొత్తే
కాలం కుత్రుల పాలనలో
"స్వేచ్ఛ"
అదొక ఎడారిలో నీటిచుక్క!
అయ్యో!
కాలం విద్వేష విధ్వంస బలిపీఠంపై
కునారిల్లుతున్న రాజ్య లక్ష్యాలు
అదిగదిగో
కసాయి విధ్వంస దరహాసంలో
అగని అసహన మత విద్వేష
రాజ్య ప్రేరేపణ దాడులు
ప్రశ్నించే - గొంతెత్తే
కలాలకు, గళాలకు
బిగిస్తున్న ఉక్కు సంకెళ్లు
బతుకు శ్వాస పాటకు నిర్బంధాలు!
కాలం కుత్రుల నడుమ
మహత్తర నాగరికతా
వారసత్వ వస్త్రం పీలికలు పీలికలే
అంతా శ్రమదోపిడీయే
పెట్టుబడికి రెడ్ కార్పెట్‌లే
ఓహో
అందరి వికాసం - అందరి విశ్వాసం
కాలం అందమైన ముసుగు మాత్రమే!!
కవీ!
సంఘర్షించాలి అక్షరాగ్నివై
ప్రపంచీకరణ పెను సవాళ్లపై
ప్రవహించాలి ఎడారిలో ముత్యుందుకు
చైతన్యపూరిత ఒయాసిస్సువై
పరాధీన కాలానికి
ముచ్చెమటలు పట్టించే
చెమట సిరాతో
జనసంద్రాన్ని నడిపించాలి మునుముందుకు
కదలాడాలి జగన్నాథ రథచక్రాలై
నిప్పు పుట్టించాల్సిన సమయం
ఆసన్నమైనది...
అక్షర శంఖారావం
పూరించాల్సిన సమయం ఇదే ఇదే!!

## శ్రామికవర్గ సంస్కృతికి ప్రతిబింబం
# కామ్రేడ్ మదార్‌కు జోహార్లు




విజయవాడ ఆర్‌టిసి డిపో వర్క్‌షాపులో సుదీర్ఘకాలం పనిచేసిన, గిరిపురం కాలనీ వ్యవస్థాపకులలో ఒకరైన కామ్రేడ్ షేక్ మదార్ 17-10-22న విజయవాడ, గిరిపురంలోని తన స్వగృహంలో 90వ ఏట మరణించారు. ఆయన 21-5-1932న నరసరావుపేట దగ్గర ఇక్కుర్తిలో జన్మించారు.

మదార్ నిరంతర శ్రమజీవి. బాల్యం నుండీ సామ్యవాద భావాల ప్రభావంతో పెరిగారు. 1958-59లలో విజయవాడ ఆర్‌టిసి డిపోలో ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఆయన కార్మికసంఘాన్ని నిర్మించటంలో ప్రధానపాత్ర వహించారు. 'ప్రజాసాహితి' పత్రికను కార్మికవర్గంలోకి తీసుకెళ్ళారు. సాహిత్యాన్ని చదివి అర్థం చేసుకోవటం, చదివి మిగతావారికి వివరించటం, చర్చించటం ఆయన నిరంతరం చేసేవారు. 'ప్రజాసాహితి' పత్రిక చందాలు కట్టించేవారు. చేతి సంచిలో ఎప్పుడూ కరపత్రాలో, పత్రికలో వుంచుకొని, రోడ్డుమీద నుంచున్నా, ఆసుపత్రిలో చూపించుకోవటానికి వెళ్ళినా, ప్రయాణం చేస్తున్నా, ఆ కరపత్రాలను పంచేవారు. ఆయన చనిపోవటానికి కొన్ని రోజుల ముందువరకూ, సత్తువ వున్నంతవరకూ కార్మికరంగం పనుల్లో నిమగ్నమయ్యారు. మదార్ కార్మికలోకపు ఆదర్శ వ్యక్తి.

జనసాహితి రాష్ట్ర మహాసభల సందర్భంలోనూ, విజయవాడలో జరిగే జనసాహితి సభల నిర్వహణలో భాగస్వాములయ్యేవారు. తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన శ్రీశ్రీ 'మహాప్రస్థానం' హిందీలోకి నిర్మలానంద అనువాదం చేస్తున్న సమయంలో ఆయన కృషి నిరాటంకంగా సాగటానికి బాధ్యత వహించారు. అందరినీ చిరునవ్వుతో పలకరించేవారు. గిరిపురంలోని తరిమెల నాగిరెడ్డి భవనంకి వచ్చే కార్యకర్తలందరినీ ఆదరించేవారు. సమాజం మారాలన్న ఆకాంక్షతో, సమసమాజ స్థాపన కోసం సాగుతున్న వర్గ ఉద్యమాలతో మమేకమవుతూ శ్రమించారు. జనసాహితి సంస్థకూ, 'ప్రజాసాహితి' పత్రికకూ ఆప్తులైన కామ్రేడ్ షేక్ మదార్‌కు జోహార్లు. వారి కుటుంబ సభ్యుల బాధలో పాలుపంచుకుంటున్నాం.

PRAJA SAAHITI November 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI